జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528

రంగారెడ్డి | బుధవారం 30 జూలై 2025 | సంపుటి : 15 | సంచిక : 263 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com


## డేటా సెంటర్ల ఏర్పాటుకు ఏపీ అనుకూలం

- అమరావతి అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామిగా ఉంటుంది
- 2019 తర్వాత ఏపీలో వచ్చిన ప్రభుత్వం నుంచి సహకారం ఆగిపోయింది
- సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటన ఫలప్రదం కావాలిలి
- సింగపూర్ దేశ మంత్రి టాన్సీ లెంగ్ వెల్లడి



**అమరావతి**

సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటనలో ఉండగానే ఆ దేశ మానవనరులు, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి టాన్సీ లెంగ్ కీలక ప్రకటన చేశారు. వివిధ రంగాల్లో ఏపీ ప్రభుత్వంతో కలిసి పని చేయడానికి సంసిద్ధతను వ్యక్తం చేయడమే కాకుండా.. గత ప్రభుత్వ విధానాలను ప్రస్తావిస్తూ ఎక్స్ వేదికగా సింగపూర్ మంత్రి చేసిన ప్రకటన ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఆంధ్రప్రదేశ్, అమరావతి అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామ్యంగా ఉండేందుకు సిద్దంగా ఉందని ఆ దేశ ట్రేడ్ ఇండస్ట్రీ శాఖలోని మానవ వనరులు, శాస్త్రసాంకేతిక మంత్రి టాన్ సీ లెంగ్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరిగిన సమావేశంపై ఎక్స్ హ్యాండిల్ లో ట్వీట్ చేసిన ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో ఏపీతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు వెల్లడించారు. వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, పునరుత్పాదక ఇంధనం లాంటి రంగాలు పెట్టుబడులకు అనుకూలమని టాన్సీ లెంగ్ పేర్కొన్నారు. భారత్ లో అత్యంత వేగంగా ఎదుగుతున్న రాష్ట్రాల్లో ఒకటైన ఏపీలో ఫుడ్ ఎంపైర్, ఎవర్ - మిగతా3లో



## ఉగ్రవాదుల్ని మట్టిలో కలిపేయడానికి ముమూర్తం కావాలా ఏంటి?

- ఈ వర్షాకాల సమావేశాలు భారత్ విజయోత్సవానికి నిదర్శనం
- ఆపరేషన్ సిందూర్ విజయానికి ప్రతీకగా విజయ్ ఉత్సవ్
- మన సైనికులు ఉగ్రవాదుల్ని మట్టిలో కలిపారు
- ఆపరేషన్ సిందూర్‌ను దేశం మొత్తం విజయోత్సవాలు చేసుకుంటోంది.
- ఆపరేషన్ సిందూర్: ట్రంప్ ప్రమేయం లేదు
- కాంగ్రెస్‌కు హెడ్‌లైనే గతి.. మాస్టర్ మైండ్‌కు నిద్ర కరువైంది
- పాక్ బిత్తర పోయింది.. మన దేశ సామర్థ్యాలపై కాంగ్రెస్‌కు నమ్మకం లేదు
- ముమూర్తం కావాలా ఏంటి?



## బీహార్ ఓటర్ల జాబితా సవరణలో తప్పులు జరిగితే జోక్యం చేసుకుంటాం

- ఓటర్ల జాబితాను స్పెషల్ ఇంటెన్సివ్ రిజివిజన్ పేరుతో సవరించేందుకు కేంద్ర ఎన్నికల సంఘానికి అధికారం ఉన్నది
- ఈసీ చట్ట ప్రకారం పని చేస్తుంది
- ఈ సవరణ లక్ష్యం భారీగా కొత్త ఓటర్లను జాబితాలో చేర్చడమే ఉండాలిగానీ, భారీగా ఓటర్లను జాబితా నుంచి తొలగించడం ఉండకూడదు



## తప్పంతా కేంద్ర ప్రభుత్వానిదే

- భారత సైన్యం ఎటువంటి తప్పు చేయలేదు.
- మన సైనికుల్ని యుద్ధానికి పంపి.. వారి చేతులు కట్టేశారు: రాహుల్
- భారత్-పాక్‌ల యుద్ధాన్ని ఆపానని ట్రంప్ ఇప్పటికి 29 సార్లు చెప్పారు
- ట్రంప్ అబద్ధాలు చెబుతున్నప్పుడు మోదీ తిరిగి ఎందుకు ప్రశ్నించడం లేదు
- ఇందిరాగాంధీ ప్రదర్శించిన ధైర్య సాహసాల్లో 50 శాతం కూడా మోదీ చూపించలేదు.

## పవన్ కల్యాణ్ న్యూ ప్లాన్



- ఏనుగుల గుంపు కదలికలపై వాట్సాప్ ద్వారా హెచ్చరికలు..
- ఏనుగులు ఎటువైపు వెళ్తున్నాయనేది పరిశీలించడానికి డ్రోన్ టెక్నాలజీ
- ఏనుగుల గుంపు తిరుగుతూ పొలాలు ధ్వంసం చేసిన ఘటనను అధికారులు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు వివరించారు.
- అవి వెళ్లే అవకాశం ఉన్న మార్గాల్లోని గ్రామాలవారిని అప్రమత్తం చేయడంలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలి

**అమరావతి**

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఏనుగులు గుంపులు గుంపులుగా సంచరిస్తున్న క్రమంలో అటవీ శాఖ ఉన్నతాధికారులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంగళవారం రాష్ట్ర సచివాలయంలో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. చంద్రగిరి నియోజకవర్గం పరిధిలో ఏనుగుల గుంపు తిరుగుతూ పొలాలు ధ్వంసం చేసిన ఘటనను అధికారులు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు వివరించారు. డ్రోన్ ద్వారా ఏనుగుల గుంపు కదలికలను పరిశీలిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఏనుగులు - మిగతా3లో

## పార్టీ తరపున త్వరలో యాప్ విడుదల చేయబోతున్నాం



- వైఎస్ జగన్ సంచలన ప్రకటన
- ప్రభుత్వ వేధింపులు జరిగినా, అన్యాయం జరిగినా.. వెంటనే యాప్‌లో నమోదు చేయొచ్చు
- ఫలానా వ్యక్తి లేదంటే ఫలానా అధికారి అన్యాయంగా ఇబ్బంది పెడితే ఆ వివరాలు ఎంట్రీ చేయాలి
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ ఫిర్యాదులపై కచ్చితంగా పరిశీలన ఉంటుంది

## తల్లినీ చెల్లినీ కోర్టుకు లాగడం.. వారి ఆస్తులు కొట్టేయడం జగన్ విజయమా?

హోం మంత్రి అనిత ధ్వజం



## ఆగస్టు 25 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్





## ఆగస్టు 8 నాటికి.. హైకోర్టు, అసెంబ్లీ కాన్సెప్ట్ డిజైన్లు

- సచివాలయ నిర్మాణానికి సంబంధించి కూడా..
- గుత్తేదారులతో కలిసి ఫోస్టర్స్ సంస్థ తుది రూపు
- మూడేళ్లలో పూర్తిచేయాలన్న లక్ష్యంతో అడుగులు

**అమరావతి**

అమరావతిలో కీలకమైన శాశ్వత హైకోర్టు, అసెంబ్లీ, సచివాలయ టవర్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. వీటికి గత తెదేపా ప్రభుత్వ హయాంలో లండన్‌కు చెందిన ఫోస్టర్స్ సంస్థ డిజైన్లు రూపొందించింది. ప్రస్తుతం టెండర్లు ముగిసి, గుత్తేదారులు పనులు మొదలుపెట్టారు. అంతర్గత నిర్మాణాలకు సంబంధించి నమూనాలను ఖరారు చేసి ఇచ్చేందుకు ఫోస్టర్స్ సంస్థ ఇటీవల కాంట్రాక్టర్లు, కన్సల్టెంట్లతో వర్క్‌షాప్ నిర్వహించింది. ఇందులో అసెంబ్లీ, హైకోర్టుకు సంబంధించి కాన్సెప్ట్ డిజైన్లు కొలిక్కి వచ్చాయి. వచ్చే నెల 4న ఆ సంస్థకు చెందిన మరో ప్రతినిధి బృందం రానుంది. వీరు సచివాలయ టవర్ల నమూనాలను ఖరారు చేయనున్నారు. ఆగస్టు 8 నాటికి మూడు నిర్మాణాలకు సంబంధించి కాన్సెప్ట్ డిజైన్లు ఖరారు కానున్నాయి. - మిగతా3లో

## 21 మందికి స్ట్రెయిట్ వార్నింగ్

- మళ్లీ మళ్లీ గెలిచి అసెంబ్లీకి రావొచ్చు
- ఫస్ట్ టైమ్ ఎమ్మెల్యేగా మిగిలిపోతామంటే మీ ఇష్టం
- ఎమ్మెల్యేలకు పదే పదే వార్నింగ్ ఇస్తూ వస్తున్నారు సీఎం చంద్రబాబు
- ఇప్పటివరకు 21మంది ఎమ్మెల్యేలతో విడివిడిగా భేటీ అయిన సీఎం



**విజయవాడ**

మీరు బాగా పనిచేస్తే.. పార్టీకి మేలు. మీ పొలిటికల్ ఫ్యూచర్ బాగుంటుంది. మళ్లీ మళ్లీ గెలిచి అసెంబ్లీకి రావొచ్చు. ఫస్ట్ టైమ్ ఎమ్మెల్యేగా మిగిలిపోతామంటే మీ ఇష్టం. అంటూ ఎమ్మెల్యేలకు పదే పదే వార్నింగ్ ఇస్తూ వస్తున్నారు సీఎం చంద్రబాబు. ఇప్పటికే పలుసార్లు ఎమ్మెల్యేలతో భేటీ అయి..అలర్ట్ చేస్తూ..వార్నింగ్‌లు ఇస్తూ వచ్చిన చంద్రబాబు..ఇప్పుడు ఏకంగా వన్ టు వన్ మీటింగ్‌లు పెట్టుకున్నారు. ఇప్పటివరకు 21మంది ఎమ్మెల్యేలతో విడివిడిగా భేటీ అయిన సీఎం.. ఎమ్మెల్యేల పనితీరు..వారి మీద వచ్చిన ఆరోపణలు..క్యాడర్‌కు అందుబాటులో ఉన్న తీరు..ప్రభుత్వ పథకాలపై ప్రచారం వంటి వాటిపై ఆరా తీశారట. తనకు ఉన్న ఇన్ఫర్మేషన్, గ్రౌండ్ రిపోర్ట్ ప్రకారం ఎమ్మెల్యేలకు ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇస్తున్నారట. - మిగతా3లో

# ఉగ్రవాదుల్ని మట్టిలో కలిపేయడానికి ముమూర్తం కావాలా ఏంటి?

**న్యూఢిల్లీ:** రాహుల్ గాంధీకి ప్రధాని మోదీ కౌంటర్ ఇచ్చారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పిలుపుతో భారత్-పాక్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగిందంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఆ పార్టీ ఇతర ఎంపీలు చేస్తున్న వ్యాఖ్యలపై ప్రధాని మోదీ లోక్‌సభలో మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్‌ను ఆపమని ఏ ప్రపంచాది నేతలు చెప్పలేదని స్పష్టం చేశారు. మంగళవారం లోక్‌సభలో ఆపరేషన్ సిందూర్‌పై కొనసాగుతున్న చర్చలో ప్రధాని మోదీ మాట్లాడారు.

ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో జరుగుతున్న చర్చపై మోదీ మాట్లాడుతూ.. ఈ వర్షాకాల సమావేశాలు భారత్ విజయోత్సవానికి నిదర్శనం. ఆపరేషన్ సిందూర్ విజయానికి ప్రతీకగా విజయ్ ఉత్సవ్. మన సైనికులు ఉగ్రవాదుల్ని మట్టిలో కలిపారు. ఆపరేషన్ సిందూర్‌ను దేశం మొత్తం విజయోత్సవాలు చేసుకుంటోంది. ఉగ్రస్థావరాలను మనసైన్యం నేలమట్టం చేసింది. 140కోట్ల మంది భారతీయులు నాపై నమ్మకం ఉంచారు. సైన్యం వెనుక దేశ ఉంది. మతం కోణంలో పహల్గాంలో టూరిస్టులపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. శత్రువుకు ఊహకు అందని విధంగా శిక్ష విధించాం. సైనికులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం.



### పాక్ బిత్తర పోయింది

'పహల్గాం ఉగ్రదాడికి ప్రతీ కారం తీర్చుకుంటామని చెప్పాం.. చేసి చూపించాం. పాక్‌లోకి చొచ్చుకెళ్లి ఉగ్రస్థావరాల్ని ధ్వంసం చేశాం. పాక్‌లోని ఉగ్రవాదుల హెడ్ క్వార్టర్స్‌ను కూల్చేశాం. కలుగులో దాక్కున్న ముష్కరులకు పొగపెట్టిమరీ మట్టిలో కలిపాం. పథకం ప్రకారం ఆపరేషన్ సిందూర్. భారత్ ప్రతీకార చర్యలను చూసి పాక్ బిత్తర పోయింది. ఆపరేషన్ సిందూర్ ముందు పాక్ తేలిపోయింది. ఆపరేషన్ సిందూర్ ముందుకు బ్లాక్ మెయిల్స్ పనిచేయవని చూపించాం' అని స్పష్టం చేశారు.

### కాంగ్రెస్‌కు హెడ్‌లైనే గతి

56 ఇంచ్‌ల చెస్ట్ ప్రధాని ఎక్కడా అంటూ కాంగ్రెస్ నాపై విమర్శలు చేసింది. పహల్గాం ఉగ్రదాడి విషయంలో కాంగ్రెస్ రాజకీయాలు చేసింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత కాంగ్రెస్ నన్ను విమర్శించడమే పనిగా పెట్టుకుంది. ప్రపంచం మొత్తం కాంగ్రెస్‌ను కాదు.. దేశాన్ని సపోర్ట్ చేసింది. కాంగ్రెస్ హెడ్‌లైన్స్‌లో ఉండొచ్చు కానీ.. ప్రజల హృదయాల్లో నిలవలేదు.

### మాస్టర్ మైండ్‌కు నిద్ర కరువైంది

ఉగ్రవాదానికి ఊతం ఇస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని పాక్‌కు బదులిచ్చాం. మనం చేసిన దాడులనుంచి పాక్ ఎయిర్ బేస్‌లు ఇంకా కోలుకోలేదు. ఆపరేషన్ సిందూర్‌లో మన ఎయిర్‌ఫోర్స్ 100శాతం విజయం సాధించాయి. సిందూ నుంచి సిందూర్ వరకు పరాక్రమాన్ని ప్రదర్శించాం. ఆపరేషన్ సిందూర్ తర్వాత మాస్టర్ మైండ్‌కు నిద్ర కరువైంది.

### పాక్ ప్రాధేయపడింది

ఉగ్రవాదులతో పాకిస్తాన్ బంధం బహిరంగ రహస్యమే. ఉగ్రవాదాన్ని అణిచి వేయడమే భారత్ లక్ష్యం. మన మిస్సైల్స్ పాక్ మూల మూలల్లోకి చొచ్చుకుని వెళ్లాయి. మనం ఆపరేషన్ సిందూర్‌తో స్పందిస్తామని పాక్ కలలో కూడా ఊహించలేదు. ఆపరేషన్ సిందూర్‌తో సైనికులు పాక్ ఉగ్రవాదుల్ని చీల్చి చెండాడారు. ఇక చాలు అంటూ డీజీఎంవో సమావేశంలో పాక్ ప్రాధేయపడింది. మన దాడులతో పాక్ కాళ్ల బేరానికి వచ్చింది. దయచేసి ఇంక దాడులు ఆపండి అంటూ ప్రాధేయపడింది.

### ఆపరేషన్ సిందూర్: ట్రంప్ ప్రమేయం లేదు

ఆపరేషన్ సిందూర్‌ను ఆపమని ఏ ప్రపంచాది నేతలు మాకు ఫోన్ చేయలేదు. మే9న అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నాకు ఫోన్ చేశారు.నేను బిజీగా ఉన్నాను. వాన్స్ చాలాసార్లు నాకు ఫోన్ చేశారు. పాక్ భారత్‌పై భారీ ఎత్తున మిస్సైళ్లతో దాడి చేయబోతోందని వాన్స్ నాకు చెప్పాడు. పాక్ దాడి చేస్తే తిప్పి కొడతామని చెప్పాను. పాక్ మూల్యం చెల్లించుకోక తప్పలేదు. ఆపరేషన్ సిందూర్ ఆన్‌లోనే ఉంది. పాక్ అజెండాను ఇంపోర్ట్ చేసుకునే పనిలో కాంగ్రెస్ ఉంది. ఆపరేషన్ సిందూర్ దాడి తాలూకా ఫొటోలు కావాలని కాంగ్రెస్ అడుగుతోంది. పాక్ మళ్లీ దుస్సహానికి పాల్పడితే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

### మన దేశ సామర్థ్యాలపై కాంగ్రెస్‌కు నమ్మకం లేదు

అధమ్ పూర్ బేస్‌పై దాడి అంటూ పాక్ అసత్య ప్రచారాలు చేసింది. ఆ మరుసటి రోజే నేను అక్కడి వెళ్లి మన సైనికుల్ని అభినందించారు. సుదీర్ఘ కాలం కాంగ్రెస్ దేశాన్నిపాలించింది. కానీ మనదేశ సామర్థ్యాలపై కాంగ్రెస్‌కు నమ్మకం లేదు. పాక్ తప్పుడు వార్తల్ని కాంగ్రెస్ నేతలు ఇక్కడ ప్రచారం చేశారు. ఒక్క పాక్ మిసైల్ కూడా భారత్‌ను టచ్ చేయలేదు.

### ముమూర్తం కావాలా ఏంటి?

ఆపరేషన్ మహాదేవ్‌పై ప్రధాని మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. ఆపరేషన్‌లో భాగంగా భారత్ సైనికులు పహల్గాం ఉగ్రవాదుల్ని హతమార్చింది. నిన్న టెర్రరిస్టులను ఎందుకు చంపారని విపక్షాలు అడిగాయి. ఎన్నిగంటలు ఆపరేషన్ మహాదేవ్ చేపట్టారని అఖిలేష్ యాదవ్ అడిగారు. ఉగ్రవాదుల్ని మట్టుబెట్టడానికి ఏమైనా ముమూర్తం కావాలా?

### కాంగ్రెస్‌ను పీవోకేను కోల్పోయాం

కాంగ్రెస్ విధానం వల్ల పీవోకే విషయంలో భారత్ మూల్యం చెల్లించుకుంటోంది. కాంగ్రెస్ హయాంలో భారత్ పీవోకేని కోల్పోయింది. కాంగ్రెస్ వల్లే పీవోకే మనకు కాకుండా పోయింది.నెహ్రూ చేసిన తప్పులకు భారత్ ఇప్పటికీ మూల్యం చెల్లిస్తోంది.కాంగ్రెస్ వల్ల 33వేల చదరపు అడుగుల భూభాగాన్ని భారత్ కోల్పోయింది. కచ్చతీవును శ్రీలంకకు ఇందిర గిఫ్ట్‌గా ఇచ్చింది. పీవోకేను ఎప్పుడు వెనక్కి తెస్తారని అడుగుతున్నారు. పాక్‌కు నీళ్లు అప్పగించి భారత్‌లో సంకటస్థితి సృష్టించారు. సింధూ ఒప్పందం లేకుండా భారీ ప్రాజెక్టులు వచ్చేవి. నీళ్లు కాదు.. కాలువలు తవ్వేందుకు నెహ్రూ పాక్‌కు నిధులిచ్చారు. నెహ్రూ పాక్ అనుకూల విధానాలతో నిధి మనది.. నీళ్లు మనది పెత్తనం వాళ్లదా. నీళ్ల వివాదాల పరిష్కార బాధ్యతల్ని నెహ్రూ వరల్డ్ బ్యాంక్‌కు అప్పగించారు.

### టెర్రరిస్టుల ఏరివేతలో ఆ రెండు ఆపరేషన్‌లది కీలక పాత్ర

ఆపరేషన్ సిందూర్ కు సంబంధించి హెూంమంత్రి అమిత్ షా లోక్‌సభ లో చేసిన ప్రసంగంపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ఉగ్రవాదులను ఏరివేయడంలో ఆపరేషన్ మహాదేవ్ ఆపరేషన్ సిందూర్ కీలకపాత్ర పోషించాయని ప్రధాని అన్నారు. ఆపరేషన్ సిందూర్, ఆపరేషన్ మహదేవ్ గురించి హెూంమంత్రి అమిత్ షా లోక్‌సభలో సుదీర్ఘ వివరణ ఇచ్చారని ప్రధాని మోదీ చెప్పారు. దేశ భద్రతపై భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఆయన తన ప్రసంగంలో సవివరంగా చెప్పారని ట్వీట్ చేశారు. అంతకుముందు లోక్‌సభలో అమిత్ షా ప్రసంగిస్తూ ప్రతిపక్షాల తీరుపై ధ్వజమెత్తారు. దేశం అభివృద్ధి చెందకపోవడానికి, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ ఉనికికి నెహ్రూనే కారణమని ఆరోపించారు. 1948లో భారత సైనిక దళాలు పీవోకేను చేజిక్కించుకునే స్థానంలో ఉన్నప్పటికీ అప్పటి ప్రధాని ఏకపక్షంగా కాల్పుల విరమణ ప్రకటించడంవల్ల ఆ అవకాశం చేజారిపోయిందని అమిత్ షా విమర్శించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ కూడా నెహ్రూ చర్యలను వ్యతిరేకించారని గుర్తుచేశారు. తూర్పు పాకిస్థాన్ విమోచన యుద్ధం సమయంలోనూ పీఓకేను దక్కించుకునే అవకాశం వచ్చినప్పటికీ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని చేజార్చుకుందని అన్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో భారత్ శాశ్వత సభ్యత్వాన్ని పొందలేకపోవడానికి కూడా నెహ్రూనే కారణమని అమిత్ షా ఆరోపించారు. నెహ్రూ నిర్ణయాలవల్లే మనకు ఇంకా భద్రతామండలిలో శాశ్వత స్థానం దక్కలేదని చెప్పారు. యూఎన్ఎస్‌సీలో శాశ్వత సభ్యత్వం కోసం మోదీ నేతృత్వంలోని తమ ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోందని తెలిపారు. దేశంపై ఉగ్రవాదులు కుట్రలకు పాల్పడుతుంటే చూస్తూ కూర్చోవడానికి ప్రస్తుతం ఉన్నది మన్మోహన్ సింగ్ ప్రభుత్వం కాదని, మోదీ ప్రభుత్వమని అమిత్ షా వ్యాఖ్యానించారు.

# ఆహ్వానం లేకుండా పాక్‌కు వెళ్లింది ఎవరు? సీజ్ ఫైర్ నిర్ణయం ఎవరిది?

పహల్గాం ఘటన.. పూర్తిగా భద్రతా వైఫల్యమేనని, పైగా అసత్య ప్రచారాలతో రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నాలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్‌లో మండిపడింది. ఆపరేషన్ సిందూర్‌పై చర్చలో భాగంగా.. ఇటు లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా, అటు రాజ్యసభలో ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే కేంద్రంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో రెండో రోజు చర్చలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ పాల్గొని ప్రసంగించారు. పర్యాటక ప్రాంతంలో భద్రత లేకపోవడాన్ని ప్రస్తావిస్తూ కేంద్రంపై ఆమె విమర్శలు గుప్పించారు. "ఈ అంశంపై రక్షణ శాఖ మంత్రి గంటసేపు మాట్లాడారు. అధికార కూటమి ఎంపీలు కూడా మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్, ఉగ్రవాదంపై పోరు, జాతీయ భద్రత, చరిత్ర.. ఇలా అంశాలన్నింటిపై మాట్లాడారు. కానీ, ఒక్క విషయాన్ని వదిలేశారు. అసలు ఆ దాడి ఎందుకు?.. ఎలా జరిగింది? అనేది.. ఏప్రిల్ 22వ తేదీన పహల్గాంలో కుటుంబ సభ్యుల కళ్లెదుటే 26 మంది చంపారు. అసలు ఆ ఉగ్రదాడి ఎందుకు.. ఎలా జరిగిందో మాత్రం కేంద్రం చెప్పడం లేదు. కశ్మీర్‌లో ఉగ్రవాదం ముగిసిన అంకమని, అక్కడ పర్యటించాలని ప్రభుత్వాలు కోరుతున్నాయి. కానీ.. జరిగింది మరొకటి. శుభం ద్వివేదీకి వివాహమై ఆరు నెలలే అయ్యింది. ఏప్రిల్ 22వ తేదీన అందరు పర్యాటకుల్లాగే ఆ జంట విహారంలో మునిగిపోయింది. సరిగ్గా అదే సమయంలో అడవుల్లో నుంచి వచ్చిన ఉగ్రవాదులు వాళ్లపై తెగబడ్డారు. భార్య కళ్ల ముందే శుభంను చంపేశారు. గంట వ్యవధిలో మరో 25 మందిని చంపేశారు. శుభం భార్య ఐశన్య ఓ మాట చెప్పింది.. నా కళ్ల ముందే నా ప్రపంచం చీకటి అయ్యింది. ఘటన సమయంలో అక్కడ ఒక్క భద్రతా సిబ్బంది లేరు. ఈ దేశం, ఈ ప్రభుత్వం మమ్మల్ని.. మా భద్రతను గాలికి వదిలేసింది అని. ఆమె అడిగిందే నేనూ అడుగుతున్నా..

ప్రతీరోజు 1,000 నుంచి 1,500 మంది పర్యటించే ఆ ప్రాంతంలో ఒక్క సైనికుడు కూడా కాపలాగా ఎందుకు లేడు?.

వాళ్లు ప్రభుత్వాన్ని నమ్మి అక్కడికి వెళ్తే.. ఈ ప్రభుత్వం దేవుడ్ని





మీద భారం వేసి వాళ్లను అలా వదిలేసిందా?.

ఉగ్రదాడికి రక్షణమంత్రి, ఇంటెలిజెన్స్ చీఫ్ బాధ్యత వహించారా? రాజీనామా చేశారా?.

అసలు పౌరుల ప్రాణాలకు బాధ్యత ఎవరిది?. ప్రధానిదా?, హెూం మంత్రిదా?, రక్షణ మంత్రిదా? ఎవరిది??

సెక్యూరిటీ మాట అటుంచి కనీసం ప్రాథమిక చికిత్స అందించే ఏర్పాట్లు కూడా చేయలేకపోయారు?.

ఇది నిఘా సంస్థ వైఫల్యం కాదా?.. అంటూ ప్రియాంక గాంధీ మండిపడ్డారు.

ఆర్మీనో, కేంద్రమో ఈ నిర్ణయం తీసుకోలేదు. అసలు సీజ్ ఫైర్ ప్రకటన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎలా చేస్తారు?. పాక్ భారత్ కాల్పుల విరమణ ఒప్పందం అసలు ఎలా జరిగింది?. దీనికి ప్రధాని మోదీ సమాధానం చెప్పాల్సిందే అని ప్రియాంక గాంధీ డిమాండ్ చేశారు.

ఇటు రాజ్యసభలోనూ కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే కేంద్రంపై విరుచుకుపడ్డారు. "పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ప్రపంచం మొత్తం చూసింది. తమ తండ్రి తమ కళ్ల ముందే చనిపోవడం చిన్న పిల్లలు చూశారు. అసలు పర్యాటక ప్రాంతంలోకి టెస్టులు ఎలా వచ్చారు?. పహల్గాం ఉగ్రదాడి ముమ్మాటికీ భద్రతా వైఫల్యమే. దాడి జరగకుండా కేంద్రం ఎందుకు ఆపలేకపోయింది?. ఇంటెలిజెన్స్ వైఫల్యానికి బాధ్యులెవరు?.

.. పహల్గాం ఘటనలో సంబంధం లేని అంశాలను లేవనెత్తుతున్నారు. పాకిస్తాన్‌కు విపక్షాలు మద్దతు ఇస్తున్నాయని అసత్య ప్రచారాలు చేస్తున్నారు. అసత్య ప్రచారాలతో ప్రజలను ఎక్కువ కాలం మభ్యపెట్టలేరు. కాంగ్రెస్ దేశాన్ని నిర్మించిన పార్టీ. ఆ పార్టీకి చాలా చరిత్ర ఉంది. మేం ఎప్పుడూ పాక్‌కు సపోర్ట్ చేయలేదు. ఆహ్వానించకుండా పాక్‌కు వెళ్లడం సిగ్గుచేటు. మాపై నిందలు వేస్తూ.. పాక్ నేతలను కౌగిలించుకుంటారు. మీరు తప్పు చేసి మాపై అసత్య ప్రచారాలు చేస్తారా?. ఇదేనా మీ దేశ భక్తి.

కాంగ్రెస్‌ను నిందిస్తూ ఎంత కాలం బతుకాలనుకుంటు న్నారు?. దేశ భద్రత కంటే రాజకీయాలే ఎక్కువ అయ్యాయా? పహల్గాం ఘటన తర్వాత జరిగిన ఆల్ పార్టీ మీటింగ్‌లో ప్రధాని ఎందుకు లేరు?. బీహార్ ఎన్నికల ప్రచారంలో ఎలా పాల్గొన్నారు?. ప్రధానికి దేశ భద్రత కంటే ఎన్నికల ర్యాలీలే ఎక్కువయ్యాయా?. దేశ భద్రత కంటే రాజకీయాలే ఎక్కువయ్యాయా?" అని ఖర్గే ధ్వజమెత్తారు.

ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్-భారత్ కాల్పుల విరమణను భారత విదేశాంగ శాఖ మంత్రో, ప్రధానినో, లేకుంటే రక్షణ మంత్రినో ప్రకటించలేదు. ఎక్కడో వాషింగ్టన్ నుంచి ట్రంప్ ప్రకటించారు. కాల్పుల విమరణ తన విజయమేనని ట్రంప్ ఇప్పటిదాకా 29సార్లు ప్రకటించుకున్నారు. ఈ నా ప్రసంగం ముగిసేలోపు ఆయన మరోసారి ప్రకటించుకుంటే 30వ సారి అవుతుంది. అయినా ఆ నిజాన్ని కేంద్రం ఎందుకు ఒప్పుకోవడం లేదు అని ఖర్గే ఎద్దేవా చేశారు.

## బీహార్ ఓటర్ల జాబితా సవరణలో తప్పులు జరిగితే జోక్యం చేసుకుంటాం




కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో బీహార్ ఓటర్ల జాబితా ను సవరిస్తోంది. అయితే ఈ సవరణ పేరుతో భారీగా ఓట్లను తొలగిస్తున్నారని, ఓటు నిలుపుకోవడం కోసం, కొత్తగా ఓటు హక్కు కోసం పౌరులు చూపించాల్సిన డాక్యుమెంట్ల జాబితాలో ఆధార్‌కార్డు, ఓటర్ ఐడీ కార్డులను చేర్చలేదని పలువురు సుప్రీంకోర్టులో పిటిషన్‌లు వేశారు. ఈ పిటిషన్‌లపై సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది.ఓటర్ల జాబితాను స్పెషల్ ఇంటెన్సివ్ రిజవిజన్ పేరుతో సవరించేందుకు కేంద్ర ఎన్నికల సంఘానికి అధికారం ఉన్నదని, ఈసీ చట్ట ప్రకారం పని చేస్తుందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అయితే ఈ సవరణ లక్ష్యం భారీగా కొత్త ఓటర్లను జాబితాలో చేర్చడమే ఉండాలిగానీ, భారీగా ఓటర్లను జాబితా నుంచి తొలగించడం ఉండకూడదని వ్యాఖ్యానించింది. భారీగా ఓట్లు తొలగింపునకు గురైతే మాత్రం తాము జోక్యం చేసుకుంటామని స్పష్టంచేసింది. బీహార్ ఓటర్ల జాబితా సవరణను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లపై ఆగస్టు 12, 13 తేదీల్లో విచారిస్తామని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బాగ్చిలతో కూడిన ధర్మాసనం తెలిపింది. ఆగస్టు 1న ఎన్నికల కమిషన్ సవరించిన ఓటర్ల జాబితాను ప్రచురించనుందని, పాత జాబితాలో ఉన్న అనేక మంది ఓటర్లను ఈ జాబితా నుంచి తొలగించారని, దాంతో వారంతా తమ ఓటు హక్కును కోల్పోనున్నారని పిటిషనర్‌లు సుప్రీంకోర్టుకు తెలియజేశారు. దానిపై కోర్టు స్పందిస్తూ.. సవరించిన ఓటరు జాబితాలో ఏవైనా తప్పులను గుర్తిస్తే ఆధారాలతో సహా తమ దృష్టికి తీసుకురావాలని పిటిషనర్‌లకు సూచించింది. మీరు భయపడుతున్నట్లుగా పెద్ద సంఖ్యలో ఓట్ల తొలగింపు జరిగితే వెంటనే తాము జోక్యం చేసుకుంటామని హామీ ఇచ్చింది. జాబితాలో అవకతవకలు ఉంటే ఆగస్టు 8లోగా పిటిషనర్‌లు తమకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని ధర్మాసనం సూచించింది. అదేవిధంగా వెరిఫికేషన్ డాక్యుమెంట్ల లిస్టులో ఆధార్‌కార్డుకు, ఓటర్ ఐడీకి చోటు కల్పించాలని ఈసీని ఆదేశించింది.

## తప్పంతా కేంద్ర ప్రభుత్వానిదే



**న్యూఢిల్లీ:** ఆపరేషన్ సింధూర్ అంశానికి సంబంధించి పార్లమెంట్‌లో వాడివేడి మాటల యుద్ధం జరుగుతోంది. ఆపరేషన్ సింధూర్ చర్చలో భాగంగా మంగళవారం కాంగ్రెస్ అటు రాజ్యసభ, ఇటు లోక్‌సభ వేదికగా ప్రశ్నల వర్షం కురిపిస్తోంది. ఇప్పటికే కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీలు తమ మాటలతో కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడగా, ఏఐసీసీ సీనియర్ నేత రాహుల్ గాంధీ సైతం ఆపరేషన్ సిందూర్‌పై ప్రభుత్వం తీరును తప్పుబట్టారు. లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ.. మన సైనికుల్ని యుద్ధానికి పంపి వారి చేతుల్ని కేంద్ర ప్రభుత్వం కట్టేసిందని మండిపడ్డారు. అందుకే మన యుద్ధ విమానాలు కూలాయన్నారు. రాహుల్ ప్రసంగిస్తూ.. ' భారత్-పాక్‌ల యుద్ధాన్ని ఆపానని ట్రంప్ ఇప్పటికి 29 సార్లు చెప్పారు. ట్రంప్ అబద్ధాలు చెబుతున్నప్పుడు మోదీ తిరిగి ఎందుకు ప్రశ్ని?ంచడం లేదు?, ఇందిరాగాంధీ ప్రదర్శించిన ధైర్య సాహసాల్లో 50 శాతం కూడా మోదీ చూపించలేదు. భారత సైన్యం ఎటువంటి తప్పు చేయలేదు. తప్పంతా కేంద్ర ప్రభుత్వానిదే. పహల్గామ్ సూత్రధారి పాక్ ఆర్మీ చీఫ్ మునీర్. మరి ట్రంప్‌తో కలిసి మునీర్ లంచ్ చేస్తారు. ఆయన్ని ట్రంప్ ఆహ్వానిస్తారు. ట్రంప్-మునీర్‌ల లంచ్ విషయాన్ని మోదీ ఎందకు ఖండించలేదు?, జై శంకర్ విదేశాంగ విధానం ఫెయిల్ అయ్యింది' అని రాహుల్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

## పాక్ అణ్వాయుధ బెదిరింపులకు తలొగ్గం: రాజ్‌నాథ్ సింగ్



న్యూఢిల్లీ: ఆపరేషన్ సింధూర్‌పై ఇవాళ రాజ్యసభలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చర్చను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాకిస్థాన్ చేపడుతున్న అణ్వాయుధ బెదిరింపులకు భారత్ తలవంచదు అని పేర్కొన్నారు. ఎటువంటి యుద్ధ వ్యూహాలనైనా తిప్పికొడుతుందన్నారు. ఉగ్రవాదానికి భారత్ వ్యతిరేకమన్న ఉద్దేశాన్ని చాటేందుకు ఆపరేషన్ సింధూర్ సంకేతంగా నిలుస్తుందని, కానీ గత ప్రభుత్వాలు దశాబ్దాల క్రితమే ఇలాంటి చర్యలను చేయాల్సి ఉండే అని అన్నారు. ఒకవేళ పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని రూపుమాపాలనుకుంటే, ఆ దేశానికి సహకారం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. భారత్, పాకిస్థాన్ దేశాలు ఒకేసారి స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటాయని, కానీ పాకిస్థాన్‌ను ఉగ్రవాద కేంద్రంగా భావిస్తున్నారని, ఇండియాను మాత్రం ప్రజాస్వామ్యానికి తల్లిగా భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఉగ్రవాదం నుంచి ఎటువంటి విప్లవం పుట్టదు అని, దాని వల్ల కేవలం విధ్వంసం, ద్వేషమే మిగులుతుందన్నారు. ఉగ్రవాదులేమీ ఫ్రీడం ఫైటర్లు కాదన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ ఎన్ని యుద్ధ విమానాలను కోల్పోయిదన్న విషయాన్ని విపక్షాలు ఎందుకు అడగడం లేదన్నారు. కానీ భారతీయ యుద్ధ విమానాల గురించి మాత్రమే ప్రశ్న వేస్తోందని విమర్శించారు. ఏదో ఒక రోజు పీవోకే ప్రజలు ఇండియాతో కలుస్తారని, భారతీయులమని చెప్పుకునేందుకు వాళ్లు గర్వపడుతారని రాజ్‌నాథ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు కేవలం కామా మాత్రమే పెట్టామని, ఫుల్ స్టాప్ పెట్టలేదన్నారు. కాల్పుల విరమణకు ఎందుకు అంగీకరించారని వస్తున్న ఆరోపణలపై స్పందిస్తూ.. ఆపరేషన్ సింధూర్ లక్ష్యం కేవలం పాకిస్థాన్‌ను శిక్షించడమే అని, కానీ ఆ దేశంపై యుద్ధం చేయడం తమ ఉద్దేశం కాదన్నారు. పాకిస్థాన్‌లో ఉన్న 9 ఉగ్ర స్థావరాలపై ఇండియా దాడి చేసిందని, ఆ దాడిలో ఒక్క పాకిస్థానీ పౌరుడు కూడా మరణించలేదని మంత్రి రాజ్‌నాథ్ పేర్కొన్నారు. మరో వైపు లోక్‌సభలో హెూంశాఖ మంత్రి అమిత్ షా చేసిన ప్రసంగంపై ప్రధాని మోదీ తన ఎక్స్ అకౌంట్లో ట్వీట్ చేశారు. ఆపరేషన్ సింధూర్, ఆపరేషన్ మహాదవ్‌పై ఆ ప్రసంగంలో పూర్తి వివరాలు ఉన్నట్లు పేర్కొన్నారు.


# డేటా సెంటర్ల ఏర్పాటుకు ఏపీ అనుకూలం

-మొదటిపేజీ తరువాయి

వోల్ట్ లాంటి సింగపూర్ కంపెనీలు ఇప్పటికే ఏపీలో పెట్టుబడులు, కార్యకలాపాల విస్తరణకు ఆ సంస్థలు ఎదురు చూస్తున్నాయని పేర్కొన్నారు. అలాగే పోర్టులు, గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో పెట్టుబడులతో పాటు భాగస్వామ్యాలకు ఉన్న అవకాశాలపై సీఎం చంద్రబాబుతో చర్చించినట్టు సింగపూర్ మంత్రి టాన్ సీ లెంగ్ స్పష్టం చేశారు. మరోవైపు 2014-2019లో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధికి నాటి ప్రభుత్వంతో కలిసి పని చేశామని మాస్టర్ ప్లాన్ రూపకల్పన, నిర్మాణ సహకారాన్ని అందించినట్టు తన ట్వీట్ లో పేర్కొన్నారు. అమరావతిలో స్టార్టప్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు సింగపూర్ కంపెనీలు స్విస్ ఛాలెంజ్ విధానంలో టెండర్ కూడా దక్కించుకున్నాయని గుర్తు చేశారు. అయితే 2019లో ప్రభుత్వం మారిన తర్వాత ఈ సహకారం ఆగిపోయిందని అన్నారు. సింగపూర్ కన్సార్టియం కూడా అమరావతి ప్రాజెక్టు నుంచి బయటకు వచ్చేసిందని టాన్ సీ లెంగ్ తన ట్వీట్ లో పేర్కొన్నారు. మళ్లీ ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమై ఏపీ అభివృద్ధిపై చర్చించినట్టు ఆయన వెల్లడించారు. సీడ్ క్యాపిటల్ విషయంలో సింగపూర్ కన్సార్టియం పని చేయకున్నా.. ఏపీలో పట్టణాభివృద్ధి సహా వివిధ రంగాల్లో సాంకేతిక సహకారం అందించటంతో పాటు ప్రపంచబ్యాంకు లాంటి భాగస్వాములతో కలిసి ఏపీ అభివృద్ధి ప్రణాళికల్లో కలిసి పని చేస్తామని టాన్ సీ లెంగ్ స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు, మంత్రుల బృందం సింగపూర్ పర్యటన ఫలప్రదం కావాలని కోరుకుంటున్నట్టు సింగపూర్ మంత్రి ట్వీట్ లో పేర్కొన్నారు.

**ఏపీ అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామ్యం విలువైంది**

వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల్లో ఏపీ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సిద్ధమన్న సింగపూర్ మంత్రి టాన్సీ లెంగ్ ప్రకటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు ధన్యవాదాలు తెలియచేశారు. ఏపీ ప్రజల తరపున సింగపూర్ ప్రభుత్వానికి, ఆ దేశ మంత్రి టాన్ సీ లెంగ్ కు ఎక్స్ వేదికగా సీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఏపీ సుస్థిరాభివృద్ధి కోసం ఏపీ ప్రభుత్వంతో భాగస్వామిగా ఉండడానికి సింగపూర్ ప్రభుత్వం ముందుకు రావడం సంతోషదాయకమని అన్నారు. వివిధ రంగాల్లో ఏపీ-సింగపూర్ కలిసి పని చేయడానికి టాన్ సీ లెంగ్ తో జరిపిన చర్చలు బాటలు వేశాయని సీఎం పేర్కొన్నారు. వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, ఉత్పాదక రంగం, రెన్యూవబుల్ ఎనర్జీ, పోర్టులు, డిజిటల్, ఇన్నోవేషన్, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో కలిసి పని చేసేందుకు ఈ చర్చలు దోహద పడతాయన్నారు. 90వ దశకం నుంచి సింగపూర్ ప్రభుత్వంతో తనకు సత్సంబంధాలు ఉన్నాయని తెలిపారు. ఏపీ అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామ్యం చాలా విలువైనదని సీఎం తన ట్వీట్ లో పేర్కొన్నారు. ఏపీ అభివృద్ధి ప్రయాణంలో.. ఆధునిక మౌలిక వసతుల కల్పనలో సింగపూర్ ప్రభుత్వం నుంచి సహకారం ఆశిస్తున్నామని స్పష్టం చేశారు. కొన్ని పరిణామాల వల్ల సింగపూర్ భాగస్వామ్యంతో కలిసి చేస్తున్న ప్రయాణంలో ఇబ్బందులు ఎదురయ్యాయని సీఎం అన్నారు. ఏపీలో అద్భుతమైన ప్రజా తీర్పుతో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి సంకల్పం తీసుకున్నామన్నారు. స్వర్ణాంధ్ర-2047 సాధన దిశగా అడుగులు వేస్తున్నామని సీఎం వివరించారు. వివిధ రంగాల్లో సింగపూర్ దేశ విధానాలు ఎప్పుడూ స్ఫూర్తినిస్తూనే ఉంటాయని అన్నారు. పట్టణ, గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వేసుకున్న ప్రణాళికలకు సింగపూర్ తోడైతే ప్రజల ఆశలను నెరవేర్చగలమని సీఎం తన ట్వీట్ లో ఆకాంక్షించారు. పరస్పరం గౌరవించుకుంటూ వివిధ రంగాల్లో అభివృద్ధికి సింగపూర్ ప్రభుత్వంతో కలిసి పని చేద్దామని సీఎం పేర్కొన్నారు.



# 21 మందికి స్ట్రెయిట్ వార్నింగ్

-మొదటిపేజీ తరువాయి

ఎమ్మెల్యేల అనుకూలతలు, ప్రతికూలతలను బేరీజు వేస్తూ..పనితీరులో ఎలాంటి మార్పులు చేసుకోవాలో సలహాలు, సూచనలు ఇస్తున్నారట.నియోజకవర్గాల వారీగా ప్రజలు, కార్యకర్తల అభిప్రాయాలపై సర్వే రిపోర్ట్ తెప్పించుకున్నారట. ఇప్పటివరకు 21 నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో సమావేశాలు పూర్తయ్యాయి. రోజుకు ఇద్దరు లేదా ముగ్గురు ఎమ్మెల్యేలతో మాట్లాడుతున్నారు. ఒక్కో ఎమ్మెల్యేలతో దాదాపు 45 నిమిషాల పాటు సమావేశమవుతు న్నారు. ఎమ్మెల్యేలు పనితీరు ఇంకా మెరుగుపరచుకోవాలని సూచిస్తున్నారు. ముందుగా కాస్త వెనుకబడ్డారనుకున్న ఎమ్మెల్యేలను పిలిచి మాట్లాడుతున్నారని అంటున్నారు.బాగా పని చేస్తున్న వారిని అభినందిస్తుండటంతో పాటు..లోపాలున్న చోట మొహమాటం లేకుండా సరిదిద్దుకోవాలని చెబుతున్నారు చంద్రబాబు. కొన్ని నియోజకవర్గాల్లో అవినీతి ఆరోపణలు, పార్టీ కార్యకర్తలతో సఖ్యత లేని చోట అంతా సరి చేసుకోవాలని సూచిస్తున్నారు. కాంట్రవర్సీకి కేరాఫ్‌గా ఉంటున్న కొందరు ఎమ్మెల్యేలకు క్లాస్ తీసుకున్నట్లు తెలుస్తోంది. పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని తేల్చి చెబుతున్నారు. కొందరు ఎమ్మెల్యేలు తమ ప్రోగ్రెస్ రిపోర్ట్‌ను మీడియాకు కూడా వివరిస్తున్నారు.పలువురు ఎమ్మెల్యేలకు 60 నుంచి 65 శాతం మేరకే ప్రజా సంతృప్తి ఉన్నట్లుగా రిపోర్ట్ అందడంతో వారికి స్పెషల్‌గా క్లాస్ తీసుకుంటున్నారట. ముఖ్యంగా కొత్త ఎమ్మెల్యేలకు, ఫస్ట్ టైమ్ గెలిచిన వారికి పదే పదే హితబోధ చేస్తున్నారు చంద్రబాబు. వన్ టైమ్ ఎమ్మెల్యేలుగా మిగలొద్దని చెబుతూ వస్తున్నారు. ప్రజలు, కార్యకర్తలతో మమేకం కావాలని పదేపదే చెబుతున్న చంద్రబాబు ఇప్పుడు మరోసారి క్లాస్ తీసుకుంటూ దిశానిర్దేశం చేస్తున్నారు. పనితీరులో మార్పు రావాలని, లేకపోతే అవసరమైన మార్పులు, చేర్పులు తప్పవని సీరియస్ వార్నింగ్సే ఇస్తున్నారట.ఇదే సమయంలో శాసనసభ్యులపై వస్తున్న ఆరోపణలకు సంబంధించిన వివరాలను కూడా వారి ముందు పెట్టి వివరణ తీసుకుంటున్నారట. అనవసర విషయాల జోలికి వెళ్లొద్దని, అడ్డగోలుగా బిహేవ్ చేస్తే ఎవరి విషయంలోనైనా వెనుకాడేది లేదని తేల్చి చెబుతున్నారు. గాడి తప్పినా..పార్టీ లైను క్రాస్ చేసినా యాక్షన్ తప్పదని ఎవరికీ మినహాయింపు లేదని స్పష్టం చేస్తున్నట్లు తెలుస్తోంది.త్వరలో మరికొందరి ఎమ్మెల్యేలతో వన్ టు వన్ భేటీ కానున్నారు. సింగపూర్ పర్యటన తర్వాత మిగిలిన ఎమ్మెల్యేలతో కూడా సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేయనున్నా రు. అయితే ప్రభుత్వం ఎన్ని పథకాలు ఇస్తున్నా..సర్కార్ నడుపుతున్న పెద్దలుగా ఎంత బాగా పనిచేస్తున్నా..ఎమ్మెల్యేల పనితీరు చాలా కీలకమని భావిస్తున్నారట చంద్రబాబు. లోకల్‌గా ఎమ్మెల్యేకు మంచి పేరు లేకపోయినా..ఆయన పబ్లిక్‌లో ఉండకపోయినా..క్యాడర్ సమస్యలు పరిష్కరించక పోయినా.. తేడా కొట్టొచ్చని అంచనా వేస్తున్నారట. అందుకే ముందుగానే అలర్ట్ అయి ఎమ్మెల్యేలను సెట్‌రైట్ చేసే పనిలో పడ్డారట చంద్రబాబుఇప్పుడు కూడా ఎంత అలర్ట్ చేయాలో అంత అలర్ట్ చేస్తున్నామ్. ఏం సహకారం కావాలో చెప్పండి చేస్తామంటున్నామ్. అయినా కూడా నియోజకవర్గాన్ని పట్టించుకోకుండా తిరుగుతామంటే ఇక మీ ఇష్టం. మంచి మార్కులు రాకపోతే టికెట్ కట్ చేయడానికి కూడా వెనకాడబోనని..ఇదే ఫైనల్ వార్నింగ్ చెప్తున్నారట. ఇప్పటికీ మించిపోయిందేమి లేదంటున్న బాబు..పద్ధతి మార్చుకుని బాగా పనిచేయండి..మంచి ఫ్యూచర్ ఉంటదని భరోసా ఇస్తున్నారట. బాబు హితబోధతో అయినా ఎమ్మెల్యేల తీరులో మార్పు వస్తుందా లేదా అనేది చూడాలి.

# ఆగస్టు 25 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**అమరావతి:** రాష్ట్రంలో పేద కుటుంబాలకు ఆగస్టు 25 నుంచి 31వ తేదీ వరకు క్యూఆర్ కోడ్‌తో ఉన్న స్మార్ట్ రేషన్ కార్డులు అందించనున్నట్లు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని.. జిల్లా, నియోజకవర్గ స్థాయిలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు పంపిణీ చేస్తారని వివరించారు. వెలగపూడి సచివాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 'కార్డులపై సీఎం సహా ఎవరి ఫొటోలూ ఉండవు. కుటుంబ సభ్యుల పేర్లు, ఫొటోలు మాత్రమే ఉంటాయి' అని వివరించారు. 'కొత్త రేషన్ కార్డులు, మార్పులు, చేర్పులు, తొలగింపులు కోరుతూ 16,08,612 దరఖాస్తులు అందగా.. 15,32,758 పరిష్కరించాం. 9,87,644 కుటుంబాలకు కొత్తగా రేషన్ కార్డులిస్తున్నాం. దీంతో రాష్ట్రవ్యాప్తంగా రేషన్ కార్డుల సంఖ్య 1,45,97,486కు చేరుతుంది. కార్డుల్లో సభ్యులు 4,29,79,897 మంది ఉన్నారు. కొత్త కార్డులకూ ఆగస్టు నుంచి రేషన్ ఇస్తాం' అని చెప్పారు.




**లబ్ధిదారుల ఖాతాల్లోకే 'దీపం' సొమ్ము**

'దీపం పథకం కింద ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీలో భాగంగా తొలి విడతలో రూ.764 కోట్ల రాయితీతో 97.59 కుటుంబాలకు ఉచిత సిలిండర్ ఇచ్చాం. రెండో సిలిండర్‌ను ఇప్పటి వరకు 93.46 లక్షల మంది తీసుకున్నారు. వీరికి రాయితీగా రూ.747 కోట్లు జమ చేశాం. ఇంకా గ్యాస్ కంపెనీల వద్ద రూ.35 కోట్లు ఉన్నాయి. 86 వేల మంది లబ్ధిదారులకు సంబంధించి బ్యాంకు ఖాతాలు సరిగా లేకపోవడంతో సొమ్ము జమ కాలేదు. సచివాలయ సిబ్బంది ద్వారా వారికి అవగాహన కల్పిస్తాం' అని మంత్రి మనోహర్ తెలిపారు. 'డిజిటల్ వాలెట్ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా సిలిండర్ రాయితీ సొమ్మును జమ చేసే ప్రక్రియను పంజాబ్ నేషనల్ బ్యాంక్ సహకారంతో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాం. 4,281 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా.. 2,580 మంది యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. 1,184 మంది ఉపయోగించుకున్నారు. వాలెట్‌లో జమ చేసిన సొమ్మును సిలిండర్ కొనుగోలుకు తప్పితే.. ఇతర అవసరాలకు వాడుకోలేరు. మూడో సిలిండర్ పంపిణీ సందర్భంగా పూర్తిస్థాయిలో పరిశీలిస్తాం. నాలుగో సిలిండర్ ఇచ్చే నాటికి.. అందరికీ అమల్లోకి తెస్తాం' అని వివరించారు.

**పవన్ కల్యాణ్ సినిమా ప్రమోట్ చేయడం మా బాధ్యత**

'పవన్ కల్యాణ్ మా పార్టీ అధ్యక్షుడు. ఆయన నటించిన హరిహర వీరమల్లు సినిమాను ప్రమోట్ చేయడం మా బాధ్యత. అది చారిత్రక ఫిక్షన్ సినిమా. అందరూ చూడాల్సిన అవసరం ఉంది. అందులో తప్పేంటి' అని మంత్రి మనోహర్ విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు

# ఆదాయం తగ్గిందా.. లెక్కలు ఏం చెబుతున్నాయ్

**విజయవాడ :** పాలనలో ఒక్కొక్కరిది ఒక్కో విధానం. కొందరు అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందించడం ద్వారా ఆర్థిక లావాదేవీలు పెరిగి ప్రభుత్వ ఆదాయం పెంచుకోవాలని చూస్తారు. మరికొందరు నేరుగా ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా నగదును అందించి.. వారిలో ఆర్థిక అభివృద్ధి పెంచాలని చూస్తారు. తద్వారా వారికి కొనుగోలు శక్తి పెరిగి పనుల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందని భావిస్తారు. అయితే ఇందులో మొదటి అంశాన్ని ప్రస్తుత సీఎం చంద్రబాబు ఎంచుకున్నారు. రెండో మార్గాన్ని మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి అమలు చేశారు. అయితే చంద్రబాబు ఆలోచనలు దూర దృష్టితో ఉంటాయి. భవిష్యత్తు తరాల ప్రయోజనాలు, వారికి ఉత్తమ ఉపాధితో పాటు ఉద్యోగాలు అందించేందుకు ప్రయత్నిస్తూ ఉంటారు. అందులో భాగమే ఐటీ రంగం. అయితే ఇక జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను విపరీతంగా అమలు చేయడం ద్వారా ప్రజల్లో డబ్బు చలామని పెంచారు. తద్వారా ప్రజల్లో కొనుగోలు శక్తిని పెంచారు. అయితే ఇంత చేసిన ఏపీలో ఆర్థికాభివృద్ధి పెరగకపోవడం, ప్రభుత్వ ఆదాయం జరగకపోవడం ఆందోళన కలిగించే విషయం ఏపీలోకూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. జగన్మోహన్ రెడ్డి అధికారం కోల్పోయి కూడా ఏడాది అవుతోంది. అయితే 2025 ? 26 ఆర్థిక సంవత్సర మొదటి త్రైమాసికంలో ఏపీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తీవ్రంగా దిగజారిందని జగన్ ఆరోపించారు. గణాంకాలతో సహా పేర్కొన్నారు. ట్విట్టర్ వేదికగా పోస్ట్ చేశారు. రాష్ట్ర ఆర్థిక స్థిరత్వం ప్రమాదంలో ఉందని జగన్ అభిప్రాయపడ్డారు. అయితే జగన్ కంట్రోల్ అండ్ ఆడిటర్ జనరల్ కాగ్ నివేదికలతో సహా వెల్లడించడం విశేషం. ఇదేనా సంపద పెంచడం అంటూ జగన్మోహన్ రెడ్డి ఎద్దేవా చేశారు. దీంతో ఇది వైరల్ అంశంగా మారింది. గత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంతో పోల్చితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం లో.. రాష్ట్ర సొంత ఆదాయం కేవలం 3.47% మాత్రమే. కేంద్రం నుంచి వచ్చిన నిధులు అన్నీ కలిపి చూస్తే ప్రభుత్వ ఆదాయంలో మొత్తం 6.14%

## పార్టీ తరఫున త్వరలో యాప్ విడుదల చేయబోతున్నాం

**తాడేపల్లి:** వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సమావేశం వేదికగా ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంచలన ప్రకటన చేశారు. కూటమి ప్రభుత్వ వేధింపుల నమోదు కోసం త్వరలో ఓ అప్లికేషన్(యాప్) తీసుకురాబోతున్నట్లు వెల్లడించారు. సోమవారం వైఎస్సార్‌సీపీ పీఏసీలో ఆయన మాట్లాడుతూ.. "పార్టీ తరఫున త్వరలో యాప్ విడుదల చేయబోతున్నాం. ప్రభుత్వ వేధింపులు జరిగినా, అన్యాయం జరిగినా.. వెంటనే యాప్‌లో నమోదు చేయొచ్చు. ఫలానా వ్యక్తి లేదంటే ఫలానా అధికారి అన్యాయంగా ఇబ్బంది పెడితే ఆ వివరాలు ఎంట్రీ చేయాలి. దానికి తగిన ఆధారాలను కూడా జత చేయొచ్చు(అప్‌లోడ్). అటుపై.. ఆ ఫిర్యాదు ఆటోమేటిక్‌గా వైఎస్సార్‌సీపీ డిజిటల్ సర్వర్లోకి వచ్చేస్తుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ ఫిర్యాదులపై కచ్చితంగా పరిశీలన ఉంటుంది. బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం జరిగేలా చూస్తాం అని హామీ ఇచ్చారాయన. చంద్రబాబు ఏదైతే విత్తారో.. అదే చెట్టవుతుంది. అన్యాయానికి గురైన వారు ఎవరైనా సరే ఈ యాప్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చని.. తప్పు చేసిన వారందరికీ సినిమా చూపించడం ఖాయం అని జగన్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

## పవన్ కల్యాణ్ న్యూ ప్లాన్

-మొదటిపేజీ తరువాయి

ఎటువైపు వెళ్తున్నాయనేది పరిశీలించడానికి డ్రోన్ టెక్నాలజీ వినియోగిస్తున్న క్రమంలో... అవి వెళ్లే అవకాశం ఉన్న మార్గాల్లోని గ్రామాలవారిని అప్రమత్తం చేయడంలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామాలవారీగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి వాటికి ఎప్పటికప్పుడు ముందస్తు హెచ్చరికలు పంపించాలని దిశానిర్దేశం చేశారు. ఏనుగుల కదలికలు, హెచ్చరిక సందేశాలు పంపించడాన్ని డీఎఫ్ఓ. కార్యాలయాలు, పీసీసీఎఫ్. కార్యాలయం పర్యవేక్షించాలని ఆదేశించారు. వీటితోపాటు ఏనుగుల గుంపు పొలాల మీదకి రాకుండా, అటవీ ప్రాంతంలోకి పంపించే చర్యలను పకడ్బందీగా చేపట్టాలని పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

## ఆగస్టు 8 నాటికి.. హైకోర్టు, అసెంబ్లీ కాన్సెప్ట్ డిజైన్లు

-మొదటిపేజీ తరువాయి

మూడేళ్లలో వీటిని పూర్తి చేయాలనే లక్ష్యంతో అడుగులు వేయనున్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని..: ఇటీవలి వర్క్‌షాప్‌లో హైకోర్టు, అసెంబ్లీ భవనాలకు సంబంధించి సవివర నమూనాల కోసం కసరత్తు జరిగింది. బేస్‌మెంట్, గ్రౌండ్ ఫ్లోర్, ఏడు అంతస్తులతో నిర్మించనున్న హైకోర్టులో కోర్టు హాళ్లు, న్యాయమూర్తుల ఛాంబర్లు, జీపీల ఛాంబర్లు, వెయిటింగ్ హాళ్లు, మ్యూజియం, తదితర వాటికి సంబంధించి తయారు చేసిన నమూనాలపై హైకోర్టు రిజిస్ట్రార్‌తో సీఆర్డీఏ అధికారులు పలు దఫాలు సంప్రదింపులు జరిపారు. 103.76 ఎకరాల విస్తీర్ణంలో నిర్మితమవుతున్న అసెంబ్లీ భవనంలో స్పైక్ నమూనా, పార్కింగ్, గ్యాలరీలు, లిఫ్ట్‌ల నిర్మాణం ఎలా ఉండాలన్న దానిపై గుత్తేదారు సంస్థలకు చెందిన స్ట్రక్చరల్ ఇంజినీర్లు, ఆర్కిటెక్ట్‌లతో ఫోస్టర్స్ సంస్థ చర్చించి, తుది రూపు ఇచ్చింది. అన్ని భవనాలకు సహజసిద్ధమైన వెలుతురు వచ్చేలా ఆకృతులు రూపొందిస్తున్నారు. భారత్‌లో సంస్థ భాగస్వాములైన జెనిసిస్, హాఫీజ్ కాంట్రాక్టర్‌లతో సుదీర్ఘంగా చర్చలు సాగాయి.

**ఆర్ఎఫ్‌పీ పిలిచిన సీఆర్డీఏ**

1,575 ఎకరాల్లో విస్తరించిన అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్ (ఏజీసీ)లో శాసనసభ, సచివాలయం, హైకోర్టు, రాజ్‌భవన్, ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, న్యాయమూర్తులు, అఖిల భారత సర్వీసు అధికారులు, ప్రభుత్వ ఉద్యోగుల నివాస సముదాయాలు రానున్నాయి. ఏజీసీ మధ్యలో ఉద్యానాలు, కాలువలతో సుందరంగా కనిపించేలా నమూనాలు సిద్ధమవుతున్నాయి. ఏజీసీకి ఫోస్టర్స్ సంస్థ ప్రాథమికంగా నమూనా రూపొందించింది. కేవలం నీరు, పచ్చదనమే కనిపించేలా నీలి, హరిత (బ్లూ-గ్రీన్) కాన్సెప్ట్‌ను మరింత సూక్ష్మంగా రూపొందించేందుకు ల్యాండ్‌స్కేప్ ఆర్కిటెక్ట్ ఎంపిక కోసం సీఆర్డీఏ ఆర్ఎఫ్‌పీ (రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్) పిలిచింది. ఆగస్టు 13వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు టెండర్ల దాఖలుకు అవకాశమిచ్చారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు సాంకేతిక బిడ్లు తెరవనున్నారు. దాదాపు 7 కి.మీ. పొడవు, కి.మీ. వెడల్పుతో కృష్ణా నది నుంచి శాఖమూరు రిజర్వాయర్ వరకు కాలువ తవ్వనున్నారు. ఇది ఏజీసీ మధ్య నుంచి వెళ్తుంది. ఇందులో పడవలు కూడా వెళ్లేలా, కాలువ దాటేందుకు కాలిబాట వంతెనలతో డిజైన్ చేయనున్నారు. దీనికి రెండు వైపులా పార్కులు అభివృద్ధి చేయనున్నారు. పశ్చిమ వైపున్న మార్గానికి వెస్ట్ పార్క్ రోడ్డు, తూర్పున ఉన్న రహదారికి ఈస్ట్ పార్క్ రోడ్డుగా పేర్లు నిర్ణయించారు.

## తల్లినీ చెల్లినీ కోర్టుకు లాగడం.. వారి ఆస్తులు కొట్టేయడం జగన్ విజయమా?

అమరావతి: సరస్వతి పవర్ షేర్ల వివాదంలో వైకాపా అధ్యక్షుడు జగన్ వ్యవహరిస్తున్న తీరు ఆయన డబ్బుపిచ్చికి, దుర్బుద్ధికి, విపరీత మనస్తత్వానికి నిదర్శనమని హోంమంత్రి వంగలపూడి అనిత దుయ్యబట్టారు. 'ఎక్కడైనా తండ్రి చనిపోతే.. తల్లి, చెల్లి బాధ్యతల్ని కుమారుడు తీసుకుని, వారి బాగోగులు చూస్తారు. ఆస్తిలో వాటా ఇవ్వకుండా తల్లిని, చెల్లిని జగన్ కోర్టుకు లాగారు. నైతిక విలువల్లేని ఆయన.. ప్రజాజీవితంలో ఉండేందుకు ఏ విధంగా అర్హుడు? తండ్రి పంచిన ఆస్తిని చెల్లికి దక్కకుండా అడ్డుపడటం.. తల్లి, చెల్లిపై ఎన్‌సీఎల్‌టీలో కేసు వేయడం, అక్కడేదో గొప్ప విజయం సాధించినట్లు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటు' అని అనిత మంగళవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు.

**తల్లి షేర్లు కొట్టేసేందుకు కుట్ర**

'రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడే సరస్వతి పవర్‌లో విజయమ్మ షేర్ హోల్డర్. అప్పట్లోనే పల్నాడు జిల్లాలో భూములు కేటాయించారు. జగన్ ప్రభుత్వం ఏర్పడ్డాక లీజు గడువు పొడిగించుకోవడంతో పాటు, కృష్ణా నుంచి నీటి సరఫరాకు ఉత్తర్వులిచ్చారు. 2019 ఎన్నికలకు ముందు వికాట్ అనే సంస్థ భారతి సిమెంట్‌లో 51 శాతం షేర్లు రూ.5 వేల కోట్లతో కొనుగోలు చేసింది. మిగతా 49 శాతం షేర్లలో జగన్‌కు, షర్మిలకు సమాన వాటా ఉన్నప్పటికీ... ఆమెకు ఇవ్వకుండా అడ్డుకున్నారు. ఆస్తుల పంపకం సమయంలో సరస్వతి పవర్‌లో విజయమ్మకు 100 శాతం వాటా ఇచ్చి, దానికి బదులు బెంగళూరులోని ఆస్తుల్ని జగన్ చేజిక్కించుకున్నారు. ఇప్పుడు షేర్లు మొత్తం తనకే కావాలంటూ కుటుంబసభ్యుల్నీ రోడ్డుపైకి లాగారు' అని అనిత దుయ్యబట్టారు. 'సరస్వతి పవర్‌లో జగన్‌కు చెందిన 74,26,294 షేర్లు, ఆయన భార్య భారతికి ఉన్న 40,50,000 షేర్లను అన్ కండిషనల్ గిఫ్ట్ డీడ్ రూపంలో 2021 జులై 26న విజయమ్మకు బదిలీ చేశారు. క్లాసిక్ రియాలిటీలో 12 లక్షల షేర్లను ఒక్కోటీ రూ.27 చొప్పున రూ.40 కోట్లకు పైగా వెచ్చించి విజయమ్మ కొనుగోలు చేశారు. ధనదాహంతో వాటినీ దక్కించుకునేందుకు జగన్‌రెడ్డి నీచమైన చర్యలకు పాల్పడ్డారు' అని అనిత పేర్కొన్నారు. తల్లి షేర్ సర్టిఫికెట్లను ఆమెకు తెలియకుండా జగన్ తీసేసుకోవడమే కాకుండా, తాను గిఫ్ట్ డీడ్ మాత్రమే రాశానని, షేర్లు బదిలీ చేయలేదని వాదనకు దిగారని, షేర్లు ఇవ్వబోనంటూ తల్లినే బెదిరించారని అనిత విమర్శించారు. 'జగన్ తీరుతో విజయమ్మ... సరస్వతి పవర్ కంపెనీ బోర్డును ఆశ్రయించారు. తాను మొదటి నుంచీ వాటాదారునని, తనకు గిఫ్ట్‌డీడ్ చేశారని, తన దగ్గరున్న పత్రాలు కనిపించకుండా పోయాయని ఆమె బోర్డుకు తెలిపారు. 2024 జులై 2న జరిగిన బోర్డు సమావేశంలో... విజయమ్మకే ఆ షేర్లు చెందుతాయని నిర్ధరించారు. దీనిపై 2024 సెప్టెంబరు 3న ఎన్‌సీఎల్‌టీలో జగన్ కేసు వేశారు. గిఫ్ట్ డీడ్‌లో సాక్షి సంతకం చేసిన షర్మిలను పార్టీని చేశారు' అని అనిత పేర్కొన్నారు. 'ఎన్‌సీఎల్‌టీలో జగన్ తరఫున వాళ్ల పార్టీ ఎంపీ నిరంజన్‌రెడ్డి వాదించారు. షేర్లు జగన్‌కే చెందుతాయని ఎన్‌సీఎల్‌టీ తీర్పు చెప్పింది. దీన్నేదో ఘన విజయంగా జగన్ ప్రచారం చేసుకుంటున్నారు. జగన్ తీరు సిగ్గుచేటు' అని అనిత దుయ్యబట్టారు.

## కేబినెట్ షఫ్లింగ్ పై ఆశలు రెడ్డమ్మకు అవకాశం...

**కడప :** కూటమి ప్రభుత్వంలో మంత్రివర్గ విస్తరణ. ఇప్పుడు అందరి నోటా వినిపిస్తున్న మాట. క్యాబినెట్ షఫ్లింగ్ ఎప్పుడో..ఎంతమందిని తప్పించి..మరెంతమంది కొత్తవారిని తీసుకుంటారో తెలియదు కానీ..మంత్రివర్గ విస్తరణ జరిగితే తమకు బెర్త్ పక్కా అంటూ ఊహల్లో తెలియాడుతున్నారు ఆశావహులు. ఉమ్మడి కడప జిల్లా నుంచి ఇద్దరి పేర్లు క్యాబినెట్ రేసులో సౌండ్ రీసౌండ్ చేస్తున్నాయ్.

## సంపాదకీయం

# మానవతా బంధాలకు నీరాజనాలు

స్నేహం... ఓ చిన్న మాట. కానీ, ఆ మాట వెనుక అంతులేని అనుబంధం, అవ్యాజమైన ప్రేమ, నిస్వార్థపు భావన, ఆప్యాయత, ఆదరణ, ఓటమి సమయంలో అండగా నిలిచే బలం ఉన్నాయి. మనిషి జీవన యాత్రలో కలిసే అనేక సంబంధాల మధ్య, స్నేహబంధం ప్రత్యేకమైన స్థానం కలిగి ఉంటుంది. ఈ బంధాన్ని గౌరవించేందుకు, అందులోని విలువలను చాటేందుకు, ప్రతి సంవత్సరం జూలై 30న అంతర్జాతీయ స్నేహ దినోత్సవం ప్రపంచ వ్యాప్తంగా జరుపు కుంటారు. ఈ దినోత్సవానికి పురాతన చరిత్ర ఉన్నదను కోవలసిన అవసరం లేదు. అయితే, ఈ భావన మాత్రం ఎంతో పాతది. మానవ సమాజం ప్రారంభమైన నాటి నుంచి అనుబంధాలు, మానవ సంబంధాలు, సహజ మిత్రత్వం మానవత్వ నిర్మాణానికి మూలాధారంగా నిలిచాయి. అయితే ఈ భావనకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు రావడంలో ప్రముఖ పాత్ర వహించిన వ్యక్తి డాక్టర్ రామోన్ ఆర్టెమియో బ్రాచో. ఆయన 1958లో పారాగ్వే దేశంలో "విశ్వ స్నేహ క్రూసేడ్" ఉద్యమాన్ని ప్రారంభించారు. స్నేహాన్ని ఓ సామాజిక శాంతి సాధనంగా చూడాలన్న ఆయన ఆశయం ప్రపంచ దేశాలకు ప్రభావితం చేసి, చివరకు ఐక్యరాజ్య సమితి 2011లో జూలై 30వ తేదీని "అంతర్జాతీయ స్నేహ దినోత్సవం"గా అధికారికంగా ప్రకటించింది. అంతర్జాతీయ స్నేహ దినోత్సవం యొక్క మూల భావన "స్నేహాన్ని ఓ మానవ సంబంధంగా కాక, మానవతా దృక్పథంగా చూడాలి" అన్నది. ఈ రోజు ప్రపంచ దేశాలన్నీ తమ తమ సంస్కృతుల ప్రకారం ఈ దినోత్సవాన్ని జరుపు కుంటున్నాయి. కొన్ని దేశాల్లో, ముఖ్యంగా భారత దేశంలో, ఆగస్టు నెల మొదటి ఆదివారం ఫ్రెండ్‌షిప్ డేగా నిర్వహించడం విశేషం. విద్యార్థులు, యువత ఈ రోజు స్నేహ బంధాలను పటిష్ఠం చేసుకునే ప్రయత్నం చేస్తారు. ఫ్రెండ్ షిప్ బ్యాండ్లు, గిఫ్ట్‌లు, సందేశాలు, సోషల్ మీడియా పోస్ట్‌లు –ఇవన్నీ ఈ రోజు భాగమైన అంశాలు. అయితే ఈ ఉత్సవానికి ఉన్న లోతైన అర్థం అలాంటి బయటి ఆకర్షణల కన్నా మరింత బలమైనది. మానవ సంబంధాలు – ముఖ్యంగా స్నేహ బంధాలు – మన ఆరోగ్యాన్ని, మన మనోధైర్యాన్ని, మన భావోద్వేగ స్థితిని ప్రభావితం చేస్తాయి. అనేక వైద్య పరిశోధనలు దీన్ని ధృవీకరించాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం, నమ్మదగిన స్నేహితుల ఉనికి మనలో ఒత్తిడిని తగ్గించడమే కాక, జీవన నిబద్ధతను పెంచుతుంది. డిప్రెషన్, ఆత్మహత్యల ఊహ వంటి మానసిక సమస్యలను తగ్గించడంలో గాఢమైన మైత్రీ బంధాలు గొప్ప పాత్ర పోషిస్తాయి. స్నేహం యొక్క తాత్వికతను అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తే, ఇది మనిషి మానసిక పురోగతికి మార్గం. ఇది ఒక మనిషిని మరొకరిని అర్థం చేసుకునే స్థాయికి చేర్చుతుంది. మన భిన్నతల్ని అంగీకరించేందుకు ప్రేరణ ఇస్తుంది. ఇందులో లాభనష్టాల లెక్కలు ఉండవు. బదులుగా దయ, కనికరం, సహనంతో కూడిన బంధం ఉంటుంది. ఇలాంటి స్నేహ బంధానికి మన భారతీయ సంస్కృతిలో అత్యున్నత స్థానం ఉంది. వేదాలలో "మిత్రస్య చక్షుః" అనే శ్లోకం ద్వారా, సమస్త జీవ జాలాన్ని మిత్రంగా చూడాలన్న తత్త్వాన్ని ప్రతిపాదించారు. మహా భారతంలో కృష్ణుడు అర్జునుడికి స్నేహితుడిగా మారడమే కాక, గురువుగా, మార్గదర్శిగా, రథ సారథిగా మారాడు. అదే సందర్భంలో కర్ణుడు – దుర్యోధనుడు మధ్య ఉన్న నిబద్ధతా ఆధారంగా, నమ్మకంతో కూడిన స్నేహానికి గుర్తుగా నిలిచింది. రామాయణంలో హనుమంతుడు రాముని పట్ల చూపిన భక్తి, మమకారం – ఇవన్నీ స్నేహానికి ఆదర్శ రూపాలు. ఇక బౌద్ధ ధర్మంలో "మైత్రి" అనే భావన శత్రుత్వ నిర్మూలనకు మార్గంగా చెప్పబడింది. అహింసా, సమభావం, క్షమ అనే దృక్పథాలు మైత్రికి చిత్తశుద్ధిని కలిగిస్తాయి. జైన సిద్ధాంతాల లోనూ, గురునానక్ బోధనల లోనూ మిత్రతకు ఉన్న ప్రాధాన్యత ఎంతో గొప్పది. ఈ ఆధునిక యుగంలో మనకు వందలాది ఫోన్ నెంబర్లు ఉంటాయి. వేలాది సోషల్ మీడియా ఫాలోవర్లు ఉంటారు. కానీ నిజంగా మన హృదయాన్ని అర్థం చేసుకునే వ్యక్తి మాత్రం అరుదైనవారే. సాంకేతికత మన మధ్య భౌతిక దూరాలను తగ్గించినప్పటికీ, మన మధ్య హృదయ దూరాలను పెంచింది. మనం మాట్లాడే మాటలు ఎక్కువైనప్పటికీ, మనం పంచుకునే భావనలు తగ్గి పోయాయి. ఇదే సమయంలో – మనం ఈ అంతర్జాతీయ స్నేహ దినోత్సవాన్ని – మన మధ్య ఉండే అవ్యక్తమైన బంధాలను పునః స్థాపించేందుకు, బలపరిచేందుకు ఉపయోగించు కోవాలి. ప్రపంచంలో ఎన్నో సంఘటనలు, మానవతా విషాదాలు మనకు చెబుతున్న విషయమేమిటంటే – స్నేహం లేని జీవితం రోబో లాంటి జీవితం. అల్లాహాబాద్ రైల్వే స్టేషన్‌లో కుప్పకూలి మృతి చెందిన ఓ వృద్ధుని పక్కన నెలల పాటు కలిసి జీవించిన మిత్రుడు కన్నీటి సందేశమై నిలిచిన ఉదంతం, పదేళ్ల జైలుశిక్ష అనుభవించిన వ్యక్తికి బయటపడి ఎదురైన తొలి పలకరింపు పాత మిత్రుడి నుంచే రావడం –ఇవన్నీ జీవితంలో స్నేహం యొక్క ప్రాధాన్యాన్ని నిలువెత్తు నిరూపించే సంఘటనలే. ఈ దినోత్సవాన్ని సందర్భంగా ప్రతి ఒక్కరూ ఆత్మ శోధన చేసుకోవాలి – మన స్నేహితులకు చివరిసారి మనం నిజమైన కృతజ్ఞత ఎప్పుడిచ్చాము? వారికి అవసరమై ఉన్నప్పుడు మనం ఎక్కడ ఉన్నాం? మన జీవన ఒత్తిడుల్లో మరిచి పోయిన మిత్ర బంధాలను తిరిగి కనుగొనడానికి ఈ రోజు ఒక ఆవకాశంగా మారాలి. ఒక చిన్న సందేశం, ఒక పాత ఫొటోను షేర్ చేయడం, ఒక హఠాత్ కాల్ – ఇవన్నీ మన బంధాలను తిరిగి వెలిగించ గలదు. మనుషుల మధ్య ద్వేషాన్ని తగ్గించాలంటే, మానవతా విలువలను నిలబెట్టాలంటే – మిత్రతను మన సంస్కృతిలో భాగంగా మార్చాలి. ఒక మంచి స్నేహితుడిని పొందడం అదృష్టం మాత్రమే కాదు, ఆ సంబంధాన్ని నిలబెట్టడం మన బాధ్యత. అట్టడుగు వర్గాల నుంచి, ఉన్నత పదవుల్లో ఉన్నవారిదాకా – ఈ రోజు ప్రతి ఒక్కరిలో ఒక గుర్తింపు కలిగించాలి – స్నేహం ఒక అవసరం మాత్రమే కాదు, మనుషుల మధ్య శాశ్వత శాంతికి నాంది. ఈ రోజు మనందరికీ ఒక పిలుపు. మనం కలుసుకున్న ప్రతి ఒక్కరి జీవితం మన వల్ల ఆనందంగా మారితే, అదే స్నేహానికి నిండు అర్థం. మానవతను నిలబెట్టే మార్గం ఇదే. ప్రేమ, సహనం, అవగాహన – ఇవన్నీ కలిసే రూపమే స్నేహం. ఈ రోజు అందరికీ ఒక మధురమైన గుర్తుగా, ఒక స్ఫూర్తిగా నిలవాలి. స్నేహం ఉన్న చోటే జీవితం ఆశాజనకంగా మారుతుంది. ఆ బంధాన్ని మరువకండి – మానవతా విలువలను ఆప్యాయంగా నిలబెట్టండి.

# బహుముఖ ప్రజ్ఞాశాలి పులికంటి కృష్ణారెడ్డి



పులికంటి కృష్ణారెడ్డి (జూలై 30, 1931 – నవంబర్ 19, 2007) నటుడిగా, రచయితగా, కథకునిగా, కవిగా, రంగస్థల కళాకారునిగా, బుర్రకథ కళా కారునిగా తెలుగు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయారు. సాహిత్య పత్రికను స్థాపించి, సంపాదకత్వం వహించి, పత్రిక నిర్వహణ కోసం ఒక ముద్రణాలయాన్ని స్థాపించి, పత్రిక ద్వారా ఎందరో కవులకు, రచయితలకు ప్రోత్సాహం అందించిన ఘనత ఆయనది. జానపద వాఙ్మయం మీద, నాటకరంగం మీద ఆయనకు మంచి పట్టు కలిగి ఉండేవారు. 1931, జూలై 30 న చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం జక్కిదోన గ్రామంలో పులికంటి గోవిందరెడ్డి, పాపమ్మ దంపతులకు రైతు కుంటుంబంలో జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం జక్కిదోనలోనే సాగింది. ఉన్నత పాఠశాల విద్యకోసం తిరుపతిలోని తిరుపతి దేవస్థానం హిందూ ఉన్నత పాఠశాల (నేటి ఎస్వీ ఉన్నత పాఠశాల) లో చేరారు. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివేటప్పుడు రైల్వే ఉద్యోగానికి ఎంపికయ్యారు. 13 సంవత్సరాల పాటు భారతీయ రైల్వేలో ఉద్యోగం చేసిన ఆయన నాటకాల మీద మక్కువతో దాన్ని వదులు కున్నారు. నాటకాలు వ్రాయడంలో, వేయడంలో ఆయన గురువు నాగేశం కాగా కవిత్వంలో ఓనమాలు నేర్పింది చేబ్రోలు సుబ్రహ్మణ్యశర్మ. ఆయన దాదాపు 200 కథలు, 60 వచన కవితలు, 5 దృశ్యనాటికలు, 6 శ్రవ్యనాటికలు, పది బుర్రకథలు, 4 సంగీత రూపకాలు, జానపద శైలిలో 43 అమ్మిపదాలు, 60 లలిత గేయాలు రాసారు. రాయలసీమ జీవన వ్యథల్ని దాదాపు 200 కథలుగా వెలువరించిన ఈయన గూడుకోసం గువ్వలు, పులికంటి కథలు, పులికంటి దళిత కథలు, పులికంటి కథావాహిని సంపుటాలను తెచ్చారు. ఇతని కథలు ఇంగ్లీషు, తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషలలోకి అనువదించ బడ్డాయి. తిరుపతి పరిసర ప్రాంత జనజీవనాన్ని ప్రతిబింబించే నాలుగ్గాళ్ళ మండపం ఈయనకు ఎక్కువ పేరు తెచ్చింది. ఆయన రాసిన అమ్మిపాటలు నండూరి ఎంకిపాటలకు దీటుగా నిలిచాయి. ఆయన ఎన్నో జాతీయ కవిసమ్మేళనాలలో పాల్గొని తన కవితాగానంతో శ్రోతలను మంత్రముగ్ధుల్ని చేసేవారు. ఆయన మంచి రంగస్థల నటుడిగా పేరు సంపాదించారు. నాటకర చయితగా రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ మెప్పును పొందారు. తిరుపతి లలిత కళా సమితి నాటికల పోటీలలో పలు మార్లు పాల్గొని బహుమతులు పొందారు. మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి ఆయన్ను నటనాగ్రేసరుడు అని కొనియాడారు. ఆయన బుర్రకథ గాయకుడు కూడా. కమ్మని గానంతో, చమత్కార వ్యాఖ్యానంతో సాగే ఆయన బుర్రకథలను విని మధురాంతకం రాజారాం వంటి ప్రసిద్ధులు పరవశించి పొగడ్తలతో ముంచెత్తారు. ఆయన మంచి వక్త కూడా. జానపద వాఙ్మయం మీద, నాటకరంగం మీద ఆయనకు మంచి పట్టు ఉండేది. ఆయన తిరుపతి కేంద్రంగా కామధేను అనే సాహిత్య పత్రికను కొన్ని సంవత్సరాలు సంపాదకత్వం వహించి నడిపారు. ఈ పత్రిక నిర్వహణ కోసం ఒక ముద్రణాలయాన్ని స్థాపించారు. ఈ పత్రిక ద్వారా కవులకు, ఇతర రచయితలకు ప్రోత్సాహం కలిగించారు. ఆ పత్రిక ద్వారా ఆయన చేసిన సాహిత్యసేవ గణనీయమైనది. ఆకాశవాణి, దూరదర్శన్ లలో ఆడిషన్ కమిటీ సభ్యుడిగా, సలహాదారునిగా కొంతకాలం వ్యవహరించారు. నటుడిగా, రచయితగా కవిగా పలుబిరుదులు, సన్మానాలు అందుకున్నారు. అగ్గిపుల్ల' నవలకు చక్రపాణి అవార్డు లభించింది. ఆయన రచనలపై పరిశోధనలు చేసి నలుగురు పీహెచ్‌డీ, ముగ్గురు ఎంఫిల్ పట్టాపొందారు. శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం 2005లో ఆయనను గౌరవ డాక్టరేట్ ఇచ్చి సత్కరించింది. తన సాహితీ, కళారంగాల కృషికిగాను ఎన్నో ఆవార్డులు, రివార్డులు పొందిన ఆయన పులికంటి సాహితీ సత్కృతి సంస్థను స్థాపించి ఏటా సాహిత్య, కళా రంగాలలో విశేష కృషి చేసిన వారిని సత్కరించారు. ప్రముఖులపై వివిధ సందర్భాలలో పులికంటి రాసిన వ్యాసాలను పులికంటి హృదయ చిత్రాలు పేరుతో పుస్తకంగా తెచ్చారు. చిత్తూరు నుండి శ్రీకాకుళం వరకు ఏ వేదిక ఎక్కినా "రాయలసీమ చిన్నోణ్ణి రాళ్ళమద్దె బతికేవాణ్ణి – రాగాలే ఎరుగక పోయ్‌నా అనురాగానికి అందేవాణ్ణి" అంటూ గొంతెత్తి పాడి అందరి మన్ననలను అందుకున్న ప్రతిభామూర్తి పులికంటి కృష్ణారెడ్డి. తిరుపతిలో 2007 నవంబరులో జరిగిన తెలుగు భాషా బ్రహ్మోత్సవాల సందర్భంగా సన్మాన గ్రహీతల్లో కృష్ణారెడ్డి కూడా ఉన్నారు. అయితే ఆ లోపే, 2007, నవంబర్ 19 న పులికంటి కన్ను మూశారు.

# తెలంగాణ ఏర్పాటు నేపథ్యం..



1956లో భాషా ప్రాతిపదికపై రాష్ట్రాల పునర్విభజన జరిగిన అనంతరం కొన్నాళ్ళకే మళ్ళీ వేర్పాటు ఉద్యమాలు తలెత్తాయి. 1969లో మర్రి చెన్నారెడ్డి నేతృత్వంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం ఉధృత రూపం దాల్చింది. అప్పుడు ప్రత్యేక తెలంగాణ నేపథ్యంలో ఏర్పడిన తెలంగాణ ప్రజా సమితి పార్టీ 1971లో 11 లోకసభ స్థానలలో విజయం సాధించింది. ఇందిరా గాంధీ వ్యూహాత్మక చర్యల ఫలితంగా స్వార్థ రాజకీయ ప్రయోజనాల క్రమంలో తెలంగాణ ప్రజా సమితి కాంగ్రెస్ లో విలీనం అయింది. అలా విద్యార్థుల భాగస్వామ్యంతో ఉధృతంగా లేచిన తెలంగాణ ఉద్యమం నీరుగారిపోయింది. తర్వాత 2001, ఏప్రిల్ 27న కె.చంద్రశేఖర్ రావు ప్రత్యేక తెలంగాణ లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీని ఏర్పాటు చేశారు. 2009 నవంబర్ 29న తాజా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మొదలు పెట్టిన ఆమరణ దీక్ష మలి దశ ఉద్యమంలో కీలక ఘట్టంగా నిలిచి, ఢిల్లీ పాలకుల చేత రాష్ట్ర ఏర్పాటు ప్రకటనకు మూలమైన నేపథ్యం, నివేదిక కూడా ఇచ్చాయి. స్వరాష్ట్రం కోసం 2009 డిసెంబరు 3వ తేదీన ప్రాణ త్యాగం చేసిన తొలి అమరుడు కాసోజు శ్రీకాంతచారి. ప్రొఫెసర్ కోదండరాం ఆధ్వర్యంలో ఏర్పడిన తెలంగాణ రాజకీయ ఐక్యకార్యాచరణ సమితి ఆధ్వర్యంలో వివిధ రూపాల ఉద్యమాలను రూపొందించారు, సకల జనుల సమ్మె, మిలియన్ మార్చ్ వీటిలో చెప్పుకోదగినవి. చివరికి కేసీఆర్ దీక్ష ప్రారంభించిన 12 రోజులకు.. సరిగ్గా డిసెంబర్ 9.. 2009న కేంద్రం దిగి వచ్చి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రారంభమైందని అధికారికంగా ప్రకటించింది. ఈ నిర్ణయంపై సీమాంధ్ర ప్రాంతంలో నిరసనలు మిన్నంటి సమైక్యాంధ్ర ఉద్యమము ఏర్పాటుకు పరిస్థితులు దారితీసాయి. 2011 నుంచి తెలంగాణ ఉద్యమ నాయకత్వం "ఐక్య కార్యాచరణ సమితి" ద్వారా వివిధ రూపాలలో విద్యార్థులు, ఉద్యోగ సంఘాలు చురుకుగా పాల్గొన్నారు. 2010లో తెలంగాణ అంశంపై శ్రీకృష్ణ కమిటిని నియమించగా ఆ కమిటి 6 ప్రతిపాదనలు చేసింది. తెలంగాణ అంతటా ఉద్యోగులు, కార్మికులు 2011లో 42 రోజుల సమ్మె చేశారు. 2013, జూలై 30న ప్రత్యేక తెలంగాణకై కాంగ్రెస్ వర్కింగ్ కమిటి తీర్మానం చేసింది. యూపీఏ భేటీలో చైర్‌పర్సన్ సోనియా గాంధీ, ప్రధాని మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శులు దిగ్విజయ్‌సింగ్, గులాంనబీ ఆజాద్, ఎన్సీపీ అధ్యక్షుడు శరద్‌పవార్, ఆర్ఎల్డీ నేత అజిత్‌సింగ్, నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరుక్ అబ్దుల్లా, ముస్లిం లీగ్ నేత ఇ. అహ్మద్ తదితరులు కాంగ్రెస్ తీర్మానానికి మద్దతు తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన డిమాండ్ సుమారు 60 ఏళ్లుగా కొనసాగుతున్న అంశాన్ని సమావేశంలో ప్రస్తావిస్తూ, హైదరాబాద్ రాజధానిగా పది జిల్లాలతో కూడిన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. సీడబ్ల్యూసీ నిర్ణయాని కనుగుణంగా తెలంగాణ బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. తెలంగాణను పది జిల్లాలతో హైదరాబాద్‌తో కూడిన రాష్ట్రాన్నే ఏర్పాటు చేస్తామని, పదేళ్ల పాటు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉంటుందని, ఈలోగా సీమాంధ్రలో ఎక్కడ అనుకూలంగా ఉంటుందో చూసి అక్కడే నూతన రాజధానిని ఏర్పాటు చేస్తామని, ఇందుకోసం అవసరమైన అన్ని చర్యలను కేంద్రం తీసుకుంటుందన్నారు. సమస్యలు పరిష్కరించు కునేందుకు గాను క్యాబినెట్ సబ్ కమిటీ కూలంకషంగా చర్చించి విధి విధానాలు ఏర్పాటు చేస్తుందని తీర్మానించారు. యూపీఏ, సిడబ్ల్యూసిల్లో ఏకగ్రీవంగా తీర్మానం చేసిన ప్రతిని కేంద్రానికి పంపిస్తామని, కేబినెట్ కమిటీ రూపొందించిన అంశాలను న్యాయశాఖకు పంపిస్తారని, ఆ తర్వాత బిల్లు రూపొందు తుందని, ఆ బిల్లును క్యాబినెట్ ఆమోదించి రాష్ట్రపతికి పంపిస్తామని పేర్కొన్నారు. 2013 జూలై 31 న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు నిర్ణయం తీసుకుందని కాంగ్రెస్ పార్టీ ప్రకటించడంతో, సమైక్యాంధ్ర ఉద్యమం మరల రగిలించి. నాటి కాంగ్రెస్ ఎంపీలు ఎంపీలు గుత్తా సుఖేందంరెడ్డి, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, రాజయ్య, డాక్టర్ వివేక్ తదితరులు, పార్లమెంటు సమావేశాల్లో సోనియా గాంధీ సమక్షంలోనే తీవ్ర ఆందోళనలు చేశారు. 2013 అక్టోబరు 3న కేంద్ర మంత్రి మండలి ఆమోదించింది. 2014, ఫిబ్రవరి 18న తెలంగాణ ఏర్పాటు బిల్లుకు భారతీయ జనతా పార్టీ మద్దతుతో లోకసభ ఆమోదం లభించింది. ఫిబ్రవరి 20న రాజ్యసభ ఆమోదం పొందింది. 2014 మార్చి 1న బిల్లుపై రాష్ట్రపతి ఆమోదం లభించింది. 2014 జూన్ 2 న తెలంగాణ దేశంలో 29వ రాష్ట్రంగా నూతనంగా అవతరించింది. కేసిఆర్ నేతృత్వంలోని తెరాస తొలి మలి ప్రభుత్వాలు ఏర్పాటు చేయగా, ఇటీవలి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారం హస్తగతం చేసుకుని, రేవంత్ రెడ్డి నాయకత్వంలో మూడవ ప్రభుత్వం పరిపాలన సాగిస్తోంది.

# రాజాసింగ్ దారి ఎటు వైపు...

తెలంగాణ రాజకీయాల్లో కొత్త మలుపుగా గోషామహల్ నియోజక వర్గ బీజేపీ ఎమ్మెల్యే తిండోళి రాజాసింగ్ రాజీనామా చేశారు. జూన్ 30, 2025న తన పదవికి, పార్టీకీ రాజీనామా చేస్తున్నట్టు వెల్లడించిన ఆయన ఈ ప్రకటనతో రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపారు. ఎన్నో దశాబ్దాలుగా హిందుత్వ ఉద్యమానికి గొంతుకగా నిలిచిన ఆయన పార్టీకి గుడ్ బై చెప్పడం పలు రాజకీయ వ్యాఖ్యానాలకు దారి తీసింది. ఈ నిర్ణయానికి కారణాలు, దాని రాజకీయ పరిణామాలు, బీజేపీలో కనిపిస్తున్న అంతర్గత సంక్షోభ లక్షణాలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. రాజీనామా లేఖలో ఆయన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ముఖ్యంగా బీజేపీ తెలంగాణ శాఖకు రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్. రామచందర్ రావు నియామకాన్ని ఆయన విమర్శించారు. ఈ నియామక ప్రక్రియలో తనతో సంప్రదించక పోవడమే కాకుండా, పార్టీ అనుసరిస్తున్న మారుతున్న ధోరణులు కార్యకర్తల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. "ఇది పార్టీ వ్యతిరేక చర్య కాదు... బలహీనతలను ప్రశ్నించే స్వరూపం" అని లేఖలో స్పష్టంగా రాసారు. తాను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హిందుత్వ మార్గానికి అనుగుణంగా కొనసాగుతానని ప్రకటించినప్పటికీ, రాష్ట్రంలో పార్టీ నడుస్తున్న మార్గం తన భావజాలానికి విరుద్ధమని వెల్లడించారు. బీజేపీ జాతీయ నాయకత్వం ఈ రాజీనామాను తీవ్రంగా తీసుకుంది. మరుసటి రోజే పార్టీ శాసన శాఖాపరమైన నైతిక నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్టు అభిప్రాయ పడుతూ, రాజాసింగ్‌పై తాత్కాలిక నిషేధం విధించింది. ఇది పార్టీకి పలు మాధ్యమాల్లో దెబ్బతీసిన పరిణామంగా నిలిచింది. కేంద్రానికి అత్యంత సమర్పితంగా ఉండే మిత్ర పక్షాల్లో ఇలాంటి స్వతంత్ర వ్యాఖ్యలు, తిరుగు బాట్లను సహించ బోమని స్పష్టంగా పేర్కొంది. ఈ చర్య బీజేపీలో భిన్న స్వరాలకు స్థానం ఉందా అన్న చర్చకు దారితీసింది. తెలంగాణ బీజేపీలో ఈ పరిణామం పట్ల స్పందనలు మిశ్రమంగా ఉన్నాయి. ఒక వర్గం నేతలు రాజాసింగ్‌ను నైతికంగా సమర్థించగా, మరొక వర్గం మాత్రం ఇది పార్టీకి అవమానకరంగా మిగిలిందని అభిప్రాయ పడింది.

# పాఠశాలలకు వెళ్లే ఆడపిల్లలు ఏడిపిస్తే తాటతీస్తా

**లక్కిరెడ్డిపల్లి జూలై 29 (ప్రజా జ్యోతి)** పాఠశాలలకు వెళ్లే ఆడపిల్లలను కొంతమంది ఆగతాయిలు ఏడిపిస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకొని తాటతీస్తామని లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ రవీంద్రబాబు పేర్కొన్నారు మంగళవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో 9 0 ఇంటర్మీడియట్ విద్యార్థులకు సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ మోడల్ స్కూల్ , జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ల వద్దకు వెళ్లి ఆడపిల్లలను కొంతమంది ఆకతాయిలు ఏడిపిస్తున్నారని అలాంటివారిని అదుపులోకి తీసుకొని కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు రవీంద్ర నగర్ మర్రిచెట్టు వద్ద కొంతమంది ఆకతాయిలు ద్విచక్ర వాహనంలో వచ్చి ఆడపిల్లలను ఏడిపిస్తున్నారని వారి సమాచారం పోలీసులకు అందిస్తే వెంటనే వారిని అదుపులో తీసుకొని కఠించాలని తీసుకుంటామన్నారు ఆడపిల్ల చదువుకోవాలని ఆయన ఆడపిల్లలకు ధైర్యాన్ని నింపారు ప్రతి ఒక్కరూ బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఇలాంటి ఆకతాయిలకు భయపడి పాఠశాలను మానుకోవద్దని ఆడపిల్లలతో హితవు పలికారు ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజ్కుమార్ అధ్యాపకులు రాజశేఖర షర్ఫుద్దీన్ రామ్మోహన్ శంకర్ రెడ్డి పీవీ సుబ్బారెడ్డి విద్యార్థులలో పాల్గొన్నారు



ఫోటో రైట్ అప్ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ రవీంద్రబాబు

# గండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాలను శుభ్రం చేయించండి

**కాకినాడ జిల్లా జగ్గంపేట ప్రజా జ్యోతి రిపోర్టర్ స్వామి** టిడిపి నాయకులకు విన్నవించుకున్న డాక్టర్ నరేష్ గండేపల్లి గ్రామంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొల్లంరెడ్డి రామకృష్ణ, గ్రామ టిడిపి నాయకులతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ కు, నాయకులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నరేష్ హాస్పటల్ కు ఓపి బాగా పెరిగిందని హాస్పిటల్ కి జనం బాగా వస్తున్నారని, సరిపడే మందులు ఇంజక్షన్లు వస్తున్నాయని తెలియజేశారు.ప్రహరీ లేకపోవటం వలన రాత్రిపూట అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాగే తుప్పలు బాగా పెరగడం వల్ల పాములు రావడానికి అవకాశం ఉందని, వర్షం పడినప్పుడు రోడ్డు లేకపోవడం వలన రోగులు లోపలికి రావడానికి నానా అవస్థలు పడుతున్నారని నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. ఫోన్లో ఎండిఓ ని అలాగే ఏపీఓ ని సంప్రదించి తుప్పలు తొలగించడానికి పురమాయించడం జరిగింది. మొదటిగా రాకపోకలకు ఇబ్బంది లేకుండా అవసరమైన గ్రావెల్ ను వెంపాటి సతీష్ పోయిస్తానని హామీ ఇచ్చారు. ప్రహరీ నిర్మించడానికి అవసరమైన నిధులను మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహన రావు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూని అడుగుతానన్నారు. ఈ కార్యక్రమంలో గండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మాజీ చైర్మన్ పోతుల బుల్లి దొర, వెంపాటి రాజు, వెంపాటి సతీష్, పైల వెంకన్న, మాచిన బాబురావు, పసుమర్తి సుబ్రహ్మణ్యం,ఏక పరదేశి నాయుడు ,పెనుగాడి నాగరాజు కొమ్ముకూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు





# హిందూ పరిరక్షణకు అందరూ పాటుపడాలి

**లక్కిరెడ్డిపల్లి: జూలై 29 ( ప్రజా జ్యోతి)** దేశ రక్షణకు, హిందూ పరి రక్షణకు, హిందవుల ఐక్యతకు, సదా అందరిలో సద్భావం కల్పించటం కోసం అహర్నిశలు కృషి చేయాలని అదే సంకల్పంతో ముందుకు సాగాలని వి హెచ్ పి మాన్యశ్రీ సత్యం అన్నారు. దేశంలోని హిందువుల ఐక్యతే వి హెచ్ పి ఆశయమని హిందువులందరూ ఐక్యంగా ముందుకు సాగాలని ఆయన పేర్కొన్నారు. విశ్వహిందూ పరిషత్-దక్షిణాంధ్ర వర్షారంభ ప్రాంతీయ, సమావేశాలు జూలై 26, 27 తేదీలలో నెల్లూరు జిల్లా, కేంద్రంగా జరిగినవి. ఈ సమావేశాలలో కేంద్ర పెద్దలు, విశ్వహిందూ పరిషత్ పెద్దలు రాఘవులు , సత్య రవికుమార్ , కోటేశ్వరరావు పాల్గొనీ హిందువులందరూ ఒకటిగా ఉండాలని వారు ఈ సందర్భంగా మాట్లాడారు. అనంతరం అన్నమయ్య జిల్లా, విశ్వహిందూ పరిషత్ - బజరంగ్ దళ్ నందు నూతన బాధ్యతలు స్వీకరించారు. కె .వీరారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వి. వేణుగోపాల్, బజరంగ్ దళ్ జిల్లా సంయోజక్, యు. నరేంద్ర, జిల్లా, బజరంగ్ దళ్ సాహసంయోజక్ డి. వెంకటరెడ్డి, విశ్వహిందూ పరిషత్. జిల్లా సత్సంగ్ సహ ప్రముఖ్ వై.విశ్వనాథ్ వి హెచ్ పి జిల్లా, ప్రసార, ప్రచార సహ ప్రముక్ ఎస్. మల్లికార్జున్ వి హెచ్ పి జిల్లా సేవ సహ ప్రముఖ్ పి.సుబ్బయ్య, జిల్లా బజరంగ్ దళ్, సహ సంయోజక్ ఏ ఎస్ రంగనాయకులు, వి హెచ్ పి జిల్లా సహ కోశాధికారి గా బాధ్యతలు స్వీకరించారు అని వి హెచ్ పి సత్సంగ సహ ప్రముఖ విశ్వనాథ్ తెలిపారు.







# రచ్చబండ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి


మండల ఇంచార్జ్ యనమల మదన్మోహన్

**లక్కిరెడ్డిపల్లి, జూలై 29 (ప్రజా జ్యోతి)** సుపరి పాలనను తొలి అడుగ లోనిడోర్ టు డోర్ కార్యక్రమంలో భాగంగా లక్కిరెడ్డిపల్లి లో రచ్చబండ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా యువజన మరియు క్రీడా శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొంటున్నారని మండలం ఇన్చార్జి యనముల మదన్ మోహన్ తెలియజేశారు. మండలంలో జరిగిన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభిస్తున్నట్టు తెలియజేశారు. మండలం చింతకుంటపల్లి దగ్గర భారీగా రచ్చబండ కార్యక్రమంలో మండల ప్రజలతోపాటు మండిపల్లి అభిమానులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా మండల ఇంచార్జ్ యనమల మదనమోహన్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల మార్కెట్ యార్డ్ చైర్మన్ డాక్టర్ ఎస్ఎండి షఫీ నాయక్, మాజీ జెడ్పిటిసి రెడ్డియ్య యాదవ్, జయ రాములు, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ కొండూరు వెంకట రామరాజు, సిద్ధక వెంకటరామిరెడ్డి, దేవేంద్రారెడ్డి, గురు స్వామి సోడి వెంకటేశ్వర యాదవ్, బుల్లెట్ రాజు, పాపయ్య, కావలి ఆంజనేయులు, సయ్యద్ మసూద్, డీలర్ అన్వర్ దండే శ్రీను, ముక్తార్ అహ్మద్ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు,ప్రజలు పాల్గొన్నారు.



# అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**గుంతకల్లు జూలై 29 (ప్రజా జ్యోతి):** అభివృద్ధి సంక్షేమమే ద్యేయంగా కూటమి ప్రభుత్వం పాలక సాగుస్తున్నదని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. మంగళవారం గుంతకల్లు పట్టణంలోని 14వ వార్డు మరియు 16 వార్డు నందు సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆయన సోదరుడు గుమ్మనూరు నారాయణ స్వామి కూటమి నాయకులతో కలిసి నిర్వహించారు.ఈ సందర్భంగా 14 ,16 వ వార్డు ప్రజలు బాణ సంచాలు కాలుస్తూ ఎమ్మెల్యేకు మరియు ఆయన సోదరుడికి ఘన స్వాగతం పలికి శాలువాలు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి చర్యలు చేపడుతున్నాడన్నారు. అధికారంలోకి వచ్చిన సంవత్సరం కాలంలో అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నా రు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ కూటమి ప్రభుత్వ కార్యక్రమాం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమం లో 14వ వార్డు మరియు 16 వార్డు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





## మదనపల్లి వన్ టౌన్ సిఐ సస్పెండ్

**అన్నమయ్య జిల్లా జూలై 29 (ప్రజా జ్యోతి)** మదనపల్లె ఒకటవ పట్టణ సిఐ ఏరిసావల్లిని సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. మదనపల్లెలో ఇటీవల చోటుచేసుకున్న కొన్ని ఘటనలపై సీఐ చురుకుగా స్పందించకపోవడం, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వంటి అభియోగాలపై సీఐ ని జిల్లా ఎస్పీ సస్పెండ్ చేశారు. జిల్లా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ నుంచి ఇచ్చిన పని అతిక్రమించిన వారిపై చర్యలకు వెనుకాడాడని తెలిసింది..



## అర్జీలు ఇచ్చిన ప్రతి పేదవాడికి న్యాయం జరుగుతుంది.

స్వగ్రామం ప్రజాదర్బార్ కార్యక్రమంలో

మంత్రి మండిపల్లి

**చిన్నమండెం జూలై 29(ప్రజాజ్యోతి)** మంగళవారం రోజు ఉదయం రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు తన స్వగ్రామం బోరెడ్డిగారిపల్లి లో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి తక్షణమే అక్కడికక్కడే అధికారులకు ఫోన్ చేసి సకాలంలో సమస్యలను పరిష్కరించి, ప్రజలను ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిప్పుకోవద్దని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో భాగంగా కొంతమంది అధికారులు, నేతలు మరియు ప్రజలు మంత్రికి దుశాలవలు పుష్పగుచ్ఛంలతో సత్కరించి సన్మానించారు..




## పేద కుటుంబానికి సముద్ర ఫ్లెక్స్ అధినేత గణేష్ సమకూర్చిన నిత్యవసర వస్తువులు అందజేసిన భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు పాలచర్ల నాగేంద్ర చౌదరి




**కాకినాడ జిల్లా జగ్గంపేట ప్రజా జ్యోతి రిపోర్టర్ స్వామి** స్థానిక సముద్ర ఫ్లెక్సీ ప్రింటింగ్ కార్యాలయం వద్ద సముద్ర ఫ్లెక్స్ అధినేత గణేష్ ఆర్థిక సాయంతో పేద కుటుంబానికి నిత్యవసర వస్తువులు సమకూర్చగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ యువ నాయకులు పాలచర్ల నాగేంద్ర చౌదరి ముఖ్య అతిథిగా హాజరై శ్రీను కుటుంబానికి నిత్యవసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు, మానవసేవే మాధవ సేవగా భావించి అనేక సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్న యువ నాయకులు ఆధ్యాత్మిక సేవకులు పాలచర్ల నాగేంద్ర చౌదరిని స్ఫూర్తిగా తీసుకుని ఈరోజు చిరు ప్రయత్నం గా ఈ పేద కుటుంబానికి అన్ని రకాల నిత్యవసరస్తులు నాగేంద్ర చౌదర చేతుల మీదుగా అందజేయడం జరిగిందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో సుంకర సతీష్, సీనియర్ రిపోర్టర్ రాజు, సముద్ర ఫ్లెక్స్ ప్రింటింగ్ స్టాఫ్, గణేష్ ట్రెండ్ సర్కిల్ తదితరులు పాల్గొన్నారు

## శ్రీ శ్రీ శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దివ్య సన్నిధిలో జిల్లా న్యాయమూర్తి



**గుంతకల్లు జూలై 29 (ప్రజాజ్యోతి):** ప్రముఖ దేవాలయం శ్రీ శ్రీ శ్రీ లక్ష్మీనారాయణ స్వామి రాతి దేవాలయాన్ని జిల్లా న్యాయ మూర్తి ఉషశ్రీ దర్శించుకున్నా రు. న్యాయ సూత్రాలకే కట్టుబడిన న్యాయం కి స్వామి వారి చెంత ఆధ్యాత్మిక తేజస్సు ను పొందారు.ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ రాతి దేవాలయం అద్భుతం అని కొనియాడారు. స్వామి వారి సన్నిధిలో మానసిక ప్రశాంతత ఆధ్యాత్మికత అమోఘమన్నారు. అనంతరం అర్చకులు కేశవ ఆశీర్వచనా లు అందజేసి స్వామివారికి తీర్థప్రసాదాలు అందించారు. స్వామివారి చెంత కొనసాగు తున్న అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కేశవ,తలారి తేజ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఎంఎస్ కాలువ తూము ద్వారా నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం,

గుమ్మనూరు నారాయణ స్వామి


**గుంతకల్లు జూలై 29 (ప్రజా జ్యోతి):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు ఆదేశాల మేరకు జల హారతి కార్యక్రమంలో భాగంగా మంగళవారం కసాపురం గ్రామం వద్ద ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆయన సోదరుడు గుంతకల్లు టిడిపి మండల ఇన్చార్జి గుమ్మనూరు నారాయణ స్వామి హంద్రీనీవా కాలువకు గంగా పూజ చేసి తూము ద్వారా నీటిని విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ ఈ తూము ద్వారా వేల ఎకరాలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందుతుందని,ఈ హంద్రీనీవా నీరు పాత కొత్తచెరువు, వైటీ చెరువు,గుత్తి చెరువులకు నీరు చేరుతుంది. రాష్ట్రంలో మంచి వర్షాలతో పాటు జలాశయాలు నదులు చెరువులు నిండుకుండలా ఉన్నాయి అని,వ్యవసా య రైతులకు కూటమి ప్రభుత్వం ఆగస్టు 2వ తేదీన కేంద్ర ప్రభుత్వం అందించే 2000 రాష్ట్ర ప్రభుత్వం 5000 మొత్తం 7000 రూపాయలు నేరుగా వారి ఖాతాలలో జమ చేస్తుంది అనే అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రభుత్వ హాస్టల్ సమస్యలు పై దృష్టి సారించండి సార్

– తిరుపతి జిల్లా లో ప్రభుత్వ హాస్టల్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ గారికి వినతిపత్రం ఇచ్చిన ఎస్ఎఫ్ఐ నాయకులు

**జూలై 29 తిరుపతి జిల్లా ప్రతినిధి (ప్రజాజ్యోతి)** తిరుపతి జిల్లాలో ప్రభుత్వ హాస్టల్స్ ప్రారంభం అయి 2 నెలలు గడుస్తున్న సమస్యలు అలాగే ఉన్నాయి అని తక్షణమే వాటిపై దృష్టి సారించి పేద విద్యార్థుల చదువులు సజావుగా కొనసాగేలా చేయాలనీ తిరుపతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ గారికి జిల్లా లోని హాస్టల్ సమస్యలు అన్ని వివరంగా రాసి వినతిపత్రం ఇచ్చిన నాయకులు. పుత్తూరు బీసీ హాస్టల్ ప్రైవేట్ భవనం లో కొనసాగుతున్నాయి అని, ప్రైవేట్ యాజమాన్యం బిల్డింగ్ కాళీ చేయాలనీ చెప్పడం తో విద్యార్థులు అయోమయం లో ఉండిపోయారు అని, తక్షణమే ప్రభుత్వం సొంత భవనాలు కేటాయించి నిర్వహించాలని తెలిపారు. పాకాల లో ఎస్సి, బీసీ ఎస్ఎమ్మెచ్ కళాశాల హాస్టల్ లేక అనేక మంది విద్యార్థులు అవస్థలుపడుతున్నారు అని తెలిపారు. చంద్రగిరి బీసీ బాలికల హాస్టల్ లోనే కళాశాల విద్యార్థినిలను కొనసాగాడం తో సరిపడినంత గదులు లేక విద్యార్థినీలు ఒకే గదులో 20-25 మంది ఉండేటు వంటి పరిస్థితి నెలకొంది అని తెలిపారు. సత్యవేడు ఎస్సి నియోజగవర్గం అయినప్పటికీ అక్కడ ఎస్సి కళాశాల హాస్టల్ బిల్డింగ్ పాతబడి పోయి బీసీ హాస్టల్ లో తలదాచుకునే పరిస్థితి ఉందని, బీసీ కళాశాల హాస్టల్ పాత భవనం లో పెంకులు గల గదుల్లో ఉంటూ వర్షం వస్తే ఆ పెంకులు ఊడి విద్యార్థుల తలలు ఎక్కడ పగిలిపోతాయో అంటూ బిక్కు బిక్కు గా భయపడుతూ ఉండేటు వంటి పరిస్థితి ఉందని తక్షణమే సత్యవేడు లోని హాస్టల్ ను సందర్శించి వారి తీవ్రమైన పరిస్థితి చూసి సమస్యలు ను పరిష్కరించాలని వారు కోరారు. సూళ్లూరుపేట, వేంకటగిరి, నాయుడుపేట లో విద్యార్థులకు సరిపడ హాస్టల్ లేక దూరప్రాంతాల విద్యార్థులు అవస్థలుపడుతున్నారు అని అన్నారు. తిరుపతి విద్యా కేంద్రం అయినందున విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది అని తిరుపతి నగరంలో కేవలం 8 హాస్టల్ లో 2000 మందికి మాత్రమే హాస్టల్ వసతి ఉందని, బయట పీజీ లకు కట్టుకోలేక అనేక మంది విద్యార్థులు పార్ట్ టైం జాబ్ చేస్తూ విద్యాపై కేంద్రికరించడం లేదని తక్షణమే తిరుపతి లో హాస్టల్ సంఖ్య పెంచి అడ్మిషన్స్ పెంచాలని కోరారు. తిరుపతి జిల్లా లోని



సాంఘిక, సంక్షమ హాస్టల్ సమస్యలు తో తీవ్రంగా విద్యార్థులు అవస్థలుపడుతున్నారు అని తక్షణమే ఈ సమస్యలు పై దృష్టి సారించి క్షేత్ర స్థాయిలో రిపోర్ట్ తెపించుకొని తక్షణమే పరిష్కరించాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శి లు అక్బర్, భగత్ రవి, జిల్లా ఉపాధ్యక్షులు వినోద్ కుమార్, జిల్లా నాయకులు శివ లు జిల్లా కలెక్టర్ గారికి వినతిపత్రం ఇచ్చారు.

# హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు ట్రంకుపెట్టే లు వెంటనే ఇవ్వాలి

:వైస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశీయాదవ్

**గుంతకల్లు జూలై 29 (ప్రజాజ్యోతి):** హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు ట్రంకుపెట్టేలు ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని వైస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశీయాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హాస్టల్లో బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం గుంతకల్లు పట్టణంలో ఉన్నటువంటి కేజీబీవీ హాస్టల్ ను వైయస్సార్ సిపి విద్యార్థి విభాగం నాయకులు సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా వంశీ యాదవ్ మాట్లాడుతూ పాఠశాలలు మొదలై రెండూ నెలలు పూర్తి కావస్తున్న. ఇప్పటివరకు హాస్టల్ విద్యార్థులకు ఇవ్వాల్సిన దోమతెరలు, దుప్పట్లు,ట్రాంకుపెట్టెలు అందించలేని దుస్థితిలో ఈ రాష్ట్ర ప్రభుత్వం ఉంది.విద్య కోసం వేలాది కోట్ల రూపాయ లు విడుదల చేసాం అని ప్రభుత్వం కల్లబొల్లి మాటలు చెబుతుంది తప్ప ఏ ఒక్క విద్యార్థి కూడా మంచి చేసిన పాపాన పోలేదు.హాస్టల్ విద్యార్థులకు "దుప్పట్లు" లేక దోమలతో చాలా ఇబ్బందులు పడుతున్నటువంటి పరిస్థితి హాస్టల్లో ఏర్పడింది.హాస్టల్ విద్యార్థులకి దుప్పట్లు ట్రంకు పెట్టెలు ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేని ప్రభుత్వం ఇంకెవరికి న్యాయం చేస్తుందని వైయస్సార్ విద్యార్థి భాగంగా మేము డిమాండ్ చేశారు. హాస్టల్ విద్యార్థులకు ఇచ్చే కాస్మోటిక్ చార్జీలను పెంచాలి, ప్రతి హాస్టల్లో మౌలిక సదుపా యాలను మెరుగుపరచాలి, విద్యార్థులకు నాణ్యత కలిగిన ఆహారాన్ని అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటి కైనా స్పందించి విద్యార్థులకు న్యాయం చేస్తుందని మేము విన్నపిస్తూ లేనిపక్షంలో వైయస్సార్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలకు కూడా శ్రీకారం చుడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గుంతకల్లు పట్టణ విద్యార్థి విభాగం అధ్యక్షులు మణికంఠ, ఉపాధ్యక్షులు అశోక్,విద్యార్థి నాయకులు శీన,లడ్డు పవన్,శివ తదితర నాయకులు పాల్గొన్నారు.



# సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమానికి అపూర్వ స్పందన..







చంద్రన్న పాలనలో ప్రతి ఇంట్లో ఆనందాల వెలుగులు..
ఏడాది పాలనపై అడుగడుగునా ప్రజల ఆనందోత్సాహం.
మల్లవరంలో సుపరిపాలన తొలి అడుగు రచ్చబండ కార్యక్రమంలోఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**కాకినాడ జిల్లా జగ్గంపేట ప్రజా జ్యోతి రిపోర్టర్ స్వామి** తూర్పుగోదావరి జిల్లా గోకవరం జులై 29:కూటమి ప్రభుత్వ పాలన పై ప్రజల్లో ఉన్న నమ్మకానికి నిదర్శనంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సుపరపాలనలో తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం జగ్గంపేట నియోజకవర్గం గోకవరం మండలం మల్లవరం గ్రామంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు. ముందుగాగ్రామంలోని ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ చేయవలసిన కార్యక్రమాలను తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం మహా న్యూస్ వారు నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు మాట్లాడుతూ మల్లవరం గ్రామానికి అన్ని రకాలుగా అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ముఖ్యమంత్రి చంద్రబాబులకు రుణపడి ఉంటామని ప్రతి ఇంట్లో కూడా వాళ్ళ ఇద్దరి ఫోటోలు పెట్టుకోవాలని అన్నారు. ముఖ్యంగా త్రాగునీరు అందించే ఏర్పాట్లు చేయాలని పశువుల ఆసుపత్రి ఈ గ్రామంలో ఏర్పాటు చేయాలి అన్నారు. విద్యుత్తు సమస్యను పరిష్కరించాలని, డ్రైనేజీ లు నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ ఎలక్ట్రికల్ ఏఈ కి విద్యుత్ సమస్య పది రోజుల్లోనే పరిష్కరించాలని ఆదేశించారు. సంవత్సర కాలంలో మంచినీటి సమస్య పూర్తిస్థాయిలో పరిష్కరిస్తానని జలజీవన్ మిషన్ ద్వారా శుద్ధి చేసిన మంచినీరు అందిస్తానని అన్నారు. ప్రతి సమస్యను అక్కడ ఉన్న అధికారులకు ఆదేశించి పరిష్కరించాలన్నారు. గ్రామంలో మూడు కోట్ల యాభై లక్షలు రూపాయలతో అభివృద్ధి చేయడమే కాకుండా 130 కోట్ల రూపాయలతో మల్లవరం ఎత్తిపోతల పథకాన్ని తీసుకొచ్చి 17% పనులు పూర్తి చేయడం జరిగిందని తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం ఆ ప్రాజెక్టు నిర్వీర్యం చేసిందని భూపతిపాలెం గురుకుల పాఠశాల ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ హబ్ గా తయారు చేస్తానని తను నాలుగుసార్లు ఎమ్మెల్యేగా నాలుగు ఇరిగేషన్ ప్రాజెక్టులు తీసుకొచ్చి మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, అడపా భరత్ బాబు, ఉంగరాల రాము, కన్నబాబు, పోతుల మోహనరావు, మారిశెట్టి భద్రం, సర్పంచ్ విడుదల లక్ష్మి అర్జున్ రావు, ఎంపీటీసీ మరిసే అరుణ అప్పారావు, సత్యం రాజా, గొర్రెపల్లి శ్రీను, జీవి నాయుడు, పంచాయతీ పాలకవర్గం టిడిపి కార్యకర్తలు, మల్లవరం గ్రామ మహిళలు ప్రజలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గుంతకల్లు,గార్లదిన్నె లలో జరిగిన 3 చైన్ స్నాచింగ్ కేసులను చేదించిన వన్ టౌన్ సిఐ మనోహం

ఒక దొంగ అరెస్ట్, 7,50,000/- రూపాయల విలువ చేసే 71 గ్రాముల మూడు బంగారు చైన్లు మరియు దొంగతనం చేయడానికి ఉపయోగించిన హొండా షైన్ మోటర్ సైకిల్ రికవరీ.

**గుంతకల్లు జులై 29 (ప్రజా జ్యోతి):** జూన్ 7వ తేదీన గుంతకల్లు పట్టణంలో ఆలూరు రోడ్డు సాయిబాబా గుడి ఎదురుగా నివాసం ఉంటున్న రాయల పుష్పావతి బంగారు చైనును అదేవిధంగా జూలై 17 వ తేదీన గుంతకల్లు పట్టణంలోని విజయనగర్ కాలనీ ఎల్ఐసి ఆఫీస్ దగ్గర బోయ మల్లీశ్వరి కి చెందిన బంగారు చైను ను మరియు గార్లదిన్నె మండలం గుడ్డాల పల్లి గ్రామం వద్ద ఒక మహిళ మెడలో నుండి బంగారు చైను ను గుర్తు తెలియని వ్యక్తి మోటర్ సైకిల్ పై వచ్చి బలవంతంగా లాక్కొని వెళ్లడం జరిగినది.సదరు కేసుల కోసం గుంతకల్లు డీఎస్పి ఎ. శ్రీనివాస్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందా లను ఏర్పాటు చేయగా మంగళవారం ఉదయం గుంతకల్లు పట్టణంలోని, కొనకొండ్ల రోడ్డు,భీమా పార్క్ దగ్గర సదరు కేసుల్లో దొంగత నం చేసిన కంబదూరు మండలం,వెంకటాంపల్లి గ్రామానికి చెందిన ఎనుముల మారుతి ప్రసాద్ ఉన్నాడని గుంతకల్లు ఒకటవ పోలీస్ స్టేషన్ సిఐ బి. మనోహర్, సిసిఎస్ ఇన్స్పెక్టర్లు శేషగిరి, జైపాల్ రెడ్డి ఎస్ఐ వలీభాష లకు రాబడిన ఖచ్చితమైన సమాచారం మేరకు యస్సై కొండయ్య మరియు వారి సిబ్బంది కలసి అక్కడికి వెళ్ళగా సదరు ఎనుముల మారుతి ప్రసాద్ ను అరెస్టు చేసి అతని వద్దనున్న 07,50,000/- రూపాయల విలువచేసే 71 గ్రాముల బరువు గల 3 బంగారు చైన్లు మరియు దొంగతనానికి ఉపయోగించిన ఒక మోటార్ సైకిల్ ను స్వాధీన పరచుకోవ డమైనది.ఎనుముల మారుతి ప్రసాద్ ను అరెస్టు చేసి రాజశ్రీ ఇంచార్జ్ గుంతకల్లు జ్యుడీషి యల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచడమైనది అని ఒకటవ పట్టణ సి ఐ బి మనోహర్ తెలిపారు. ముఖ్య గమనిక గుంతకల్లు ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాలు,అసాంఘీక కార్యకలాపాలు మట్కా, గ్యాంబ్లింగ్, క్రికెట్ బెట్టింగ్ లాంటి



ఎలాంటి సమాచారం తెలియజేసిన సమాచారం ఇవ్వండి. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతా ము.అసాంఘిక కార్యకలాపా లు జరిపే వారి పైన చట్టపర మైన చర్యలు తీసుకుంటామని సీఐ మనోహర్ తెలిపారు.

## జాతీయ జంతువు(పెద్దపులి)ని కాపాడుకుందాం.




**పోడూరు, జులై 29,ప్రజాజ్యోతి న్యూస్(రిపోర్టర్ కేకే ఆర్ వెంకట్ ).** భారత దేశ జాతీయ జంతువు అయిన పెద్ద పులి ని కాపాడవలసిన బాధ్యత అందరిపైనా ఉందని హెచ్ యం కొల్లాబత్తుల సూర్య కుమార్ అన్నారు.పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం చింతలగరువు పాఠశాలలో అంతర్జాతీయ పులుల దినోత్సవం ని చింతలగరువు స్కూల్ నందు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్య కుమార్ మాట్లాడుతూ మన దేశ జాతీయ జంతువు ఆయిన పులి జాతి అంతరించిపో కుండా కాపాడుకోవడానికి విచక్షణా రహిత వేటను, అడవులను నరికి వేయడం వంటివి దుశ్చర్యలను మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు మట్టా నాగరాజు, యస్ యం సి సభ్యులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.


## బాబు షురిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించిన వైసీపీ నేతలు.



**పోడూరు, జులై 29,ప్రజాజ్యోతి న్యూస్(రిపోర్టర్ కేకే ఆర్ వెంకట్ ).** పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం తూర్పుపాలెం వైసీపీ క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రౌరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశాల మేరకు మంగళవారం బాబు షురిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం పోడూరు మండలం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్పీటీసీ సభ్యులు గుంటూరి పెద్దిరాజు ముఖ్య అధితి లుగా పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు కావస్తున్నా సూపర్ సిక్స్ హామీ అట్టర్ ఫ్లాప్ అయ్యిందని, వెంటనే ఇచ్చిన హామీలు అమలు చేసి హిట్ చేసుకోవాలని సలహా ఇచ్చారు.ఈ కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షులు పిల్లి నాగన్న, మండల ఎంపీపీ సబ్బితి సుమంగళి, పోతుమూడి రామచంద్రరావు గుబ్బల వీరబ్రహ్మం,గుడాల చంటి,విపత్తి ప్రభాకర్, చెట్టి బత్తుల సువర్ణ రాజు, గొట్టుముక్కల సునీల్ వర్మ, కుచర్లపాటి పద్మనాభ రాజు, ఇళ్ల శ్రీనివాస ప్రసాద్,పడాల అబ్బు,బోసు పాముల శ్రీను, దొంగ పెద్దిరాజు,పాల ఏడుకొండలు, గెద్దాడ ఏకలవ్య,పైడి ఏసుబాబు, బుడితి భీమారావు, గొట్టుముక్కల రమేష్, కార్యకర్తలు,అభిమానులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ విద్యా విధాన దినోత్సవం.

**పోడూరు / పాలకొల్లు, జులై 29,ప్రజజ్యోతి న్యూస్(రిపోర్టర్ కేకే ఆర్ వెంకట్ ).** అద్దేపల్లి సత్య నారాయణ మూర్తి ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాల పాలకొల్లు నందు మంగళవారం ఇన్స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ కార్యక్రమాలలో భాగంగా జాతీయ విద్యా విధానం 2020 దినోత్సవం ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమంలో జాతీయ విద్యా విధానం -2020 అనే అంశంపై కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ తిరువీధుల రాజరాజేశ్వరి రిసోర్స్ పర్సన్ గా విద్యార్థినీ విద్యార్థులకు జాతీయ విద్యా విధానం లో సంస్కరణల గురించి ముఖ్యంగా వాల్యూ ఎడ్యుకేషన్, స్కిల్ బేస్డ్ ఎడ్యుకేషన్, బ్లూమ్స్ టాక్సోనమీ మొదలైన అంశాలపై అవగాహన కల్పించారు . ఈ కార్యక్రమంలో కళాశాల ఐఐసీ ప్రెసిడెంట్,వైస్ ప్రిన్సిపల్ టి కృష్ణ ,ఐఐసి వైస్ ప్రెసిడెంట్,ఐ క్యు ఏసి కోఆర్డినేటర్ కె భద్రాచలం , ఎకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ వి యామిని, జువాలజీ విభాగాధిపతి, ఐఐసీ కన్వీనర్ డాక్టర్ ఎం రామకృష్ణ, తెలుగు విభాగాధిపతి డాక్టర్ బూసి వెంకటస్వామి, ఐఐసీ మెంబర్ డాక్టర్ వి విజయలక్ష్మి, ఇతర అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.




## ప్లాస్టిక్ నివారణ పై అధికారులనిఘాఎక్కడ?

విచ్చలవిడిగా ప్లాస్టిక్ వాడకం




**తాళ్లపూడి, జూలై29, ప్రజాజ్యోతి న్యూస్** మండలం కేంద్రమైన తాళ్లపూ డిలో ప్లాస్టిక్ వాడకం విపరీ తంగా పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు ఆందోళన చెందుతు న్నారు. అధికారులు ఎన్ని హెచ్చరికలు చేసినా తాళ్లపూడి మార్కెట్ లో ఫాస్ట్ ఫుడ్, కర్రీ పాయింట్స్, పానీ పూరి, కిరాణా, మరియు టీ దుకా ణాలలో ప్లాస్టిక్ కవర్ల వాడకం మాత్రం ఆగడం లేదని ప్రజలు ఆందోళన చెందుతు న్నారు. వేడి వేడి టీ కవర్లో పార్సిల్ అలాగే వేడి వేడి కూరలు కవర్లలో ప్యాక్ చేయడం వాటిని ప్రజలు తిని అనారోగ్య పాలు రావడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా సంబంధి త అధికారులు ప్లాస్టిక్ కవర్లను నిషేధించే విధంగా చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూద్దాం

## బాధితులకు భరోసా అందిస్తాం

– చమర్తి జగన్ మోహన్ రాజు గారు

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన - చమర్తి



**రాజంపేట జూలై 29 (ప్రజాజ్యోతి)** నేడు ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థికసాయం మంజూరైన లబ్ధిదారులకు చెక్కులను తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు శ్రీ చమర్తి జగన్ మోహన్ రాజు గారు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చమర్తి జగన్ మోహన్ రాజు గారు మాట్లాడుతూ బాధితులకు భరోసా అందిస్తామని,రాష్ట్రం అప్పుల ఊబిలో ఉన్న వాటన్నిటినీ పక్కనపెట్టి పేదల కోసం ఇప్పటివరకు ?400 కోట్లకు పైగా ఖర్చు చేసామన్నారు.ఎవరైనా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో సంప్రదిస్తే తప్పకుండా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంజూరు చేయిస్తామన్నారు.అతికారి శ్రీనివాసులు1,36,000, నర్సాపురం మల్లేశ్వరి 40,000,కొండూరు అమర్నాథ్ రాజు 15,000,దండు లక్ష్మీ ప్రసన్న 33,000, కొండూరు కృష్ణవేణి 24,746, బాలిపోగు వెంకటేష్ 30,000,రాజేశ్వరి బేబీ ఆఫ్ 30,843,కుర్రపాటి శ్రీ రంగయ్య75,000, హస్తి పెద్ద సుబ్బరాజు 80,100, గున్నప్పనేని నరసింహులు 69,614 రూపాయలను ముఖ్యమంత్రి సహాయనిధి కింద చెక్కులను అందుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గన్నే సుబ్బ నరసయ్య నాయుడు,కౌన్సిలర్ చంద్రమౌళి , బార్ అసోసియేషన్ అధ్యక్షులు హనుమంతు నాయుడు,సిద్ధవటం నాగముని రెడ్డి,

# కూటమి తోనే అభివృద్ధి , సంక్షేమం

- విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు
- ఎన్నడూ లేని విధంగా పెంచిన ఫించన్లు అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిది
- అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు
- పి. ఏ.సి.ఎస్ అధ్యక్షులు వండాన మురళీ

**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం అందించే దిశగా కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తుందని పి.. ఏ.సి.ఎస్ అధ్యక్షులు వండాన మురళీ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న నేపథ్యంలో పొందూరు మండలం పిల్లల వలస గ్రామంలో సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమాన్ని సర్పంచ్ బుడుమూరు పోలినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వండాన మురళీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్ళి ఏడాది కాలంలో కూటమి అందించిన సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజలను ఆదుకోవడానికి చంద్రబాబు ఎల్లవేళలా ముందంజలో ఉంటారని అన్నారు. కూటమి ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వం అని పేదల కోసం నిరంతరం పరితపించే నాయకుడు చంద్రబాబు అని కొనియాడారు. ఎటువంటి రాజకీయ కక్ష సాధింపులు లేకుండా పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు ప్రతీ ఒక్కరికీ అందించిన ఘనత కూటమి ప్రభుత్వం దేనని పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వం ఫించన్లు పెంచడానికి ఐదేళ్లు పట్టిందని కానీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అధికారం చేపట్టగానే ఒక్కసారిగా పెంచిన ఫించన్లను అందించిందన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ బుడుమూరు పొలినాయుడు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు తన పాలనతో ఇది మంచి ప్రభుత్వం అని రుజువు చేసుకున్నారన్నారు. ఒక వైపు రాష్ట్ర అభివృద్ధి దిశగా చర్యలు చేపడుతూ మరో వైపు ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్నారన్నారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ,ఉచిత బస్సు ప్రయాణం పథకాలు అమలు కానున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గురుగుబెల్లి కృష్ణ మూర్తి , నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.



# విద్యుత్ రంగ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి:

ఏపీ చీఫ్ సెక్రటరీ కె. విజయానంద్

**బాపట్ల జూలై 29 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** విద్యుత్ ఫీడర్ల విభజన, పునరుద్ధీకరణ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కె. విజయానంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం బాపట్ల కలెక్టరేట్‌లో విద్యుత్ శాఖపై సమీక్ష నిర్వహించిన ఆయన, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.జిల్లాలో మంజూరైన 62 పనులలో 16 పూర్తయ్యాయని, 20 పనులు పురోగతిలో ఉన్నాయని, కానీ 15 పనులు ప్రారంభించకపోవడం సరికాదని గుత్తేదారులను ప్రశ్నించారు. 33 కెవి సబ్ స్టేషన్‌లో ఓవర్‌లోడ్ అవుతున్న ఫీడర్లలో 9 పనులు పూర్తయ్యాయని, మిగిలిన మూడు పనుల ప్రారంభం ఆలస్యం అవుతుండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తీర ప్రాంతాల్లో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను కొత్తవాటితో భర్తీ చేయాలని సూచించారు.స్మార్ట్ మీటర్లు వేగంగా ఏర్పాటు చేయాలని కోరిన సీఎస్, లక్ష్యంగా



ఉన్న 71,025 మీటర్లలో ఇప్పటివరకు 50,108 మీటర్లు మాత్రమే బిగించారని తెలిపారు. విద్యుత్ అంతరాయంపై ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను ప్రాధాన్యతతో పరిశీలించి పరిష్కరించాలని చెప్పారు. ఇంకా, గృహ వినియోగదారుల నుంచి 102 కోట్ల రూపాయలు, ఇతర పరిశ్రమల నుంచి 100 కోట్ల రూపాయల బకాయిలు ఉన్నాయని వెల్లడించారు. బిల్లుల వసూళ్లలో నూరు శాతం లక్ష్యాన్ని చేరుకునేలా మూడు రోజుల్లో చర్యలు తీసుకోవాలని సూచించారు.సౌర విద్యుత్




వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, పీఎం కుసుమ్ పథకం ద్వారా బాపట్ల జిల్లాలో 8,844 రైతులకు సౌర పంపుసెట్లు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.ఈ సమావేశంలో బాపట్ల జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి, ఏపీ సీపీడీసీఎల్ సిఎండి పి. పుల్లారెడ్డి, సంయుక్త కలెక్టర్, డిఆర్ఓ గంగాధర్ గౌడ్, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# చంద్రబాబు చేస్తున్న మోసాలు - రాష్ట్ర ప్రజలకు శాపాలు :

పెనుమంట్ర మండల ఎంపీపీ కర్రీ వెంకటనారాయణ రెడ్డి (వాసు).

**పోడూరు జులై 29 ప్రజాజ్యోతి ప్రతినిధి :** చంద్రబాబు నాయుడు చేస్తున్న మోసాలు నేడు రాష్ట్ర ప్రజలకు శాపాలుగా మారాయని పెనుమంట్ర మండల ఎంపీపీ, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు కర్రీ వెంకటనారాయణ రెడ్డి( వాసు రెడ్డి)అన్నారు.రాష్ట్ర మాజీ గృహ నిర్మాణ శాఖ మంత్రి, వైఎస్ఆర్సిపి నాయకులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశాల మేరకు మంగళవారం వైయస్సార్సీపి పార్టీ క్యాంపు కార్యాలయంలో బాబు షూరిటీ మోసం గ్యారంటీ రీ కాల్ మేనిఫెస్టో కార్యక్రమం ఎంపీపీ కర్రీ వెంకటనారాయణ రెడ్డి ( వాసు రెడ్డి ), పెనుమంట్ర మండల వైఎస్ఆర్సిపి కన్వీనర్ గూడూరు దేవేంద్రుడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి కర్రి వెంకటనారాయణరెడ్డి( వాసు రెడ్డి) మాట్లాడుతూ గడిచిన సార్వత్రిక ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు నాయుడు,పవన్ కళ్యాణ్ చేయడానికి వీలు లేని,చేయడం చేతకాని అమలు చేయడం కుదరవని తెలిసి కూడా సూపర్ సిక్స్ హామీలు వాటితో పాటు మరో 143 హామీలను ఇచ్చి రాష్ట్ర ప్రజలను తీవ్రంగా మోసం చేశారని విమర్శించారు.కేవలం అధికారం కోసమే చంద్రబాబు నాయుడు,పవన్ కళ్యాణ్ ఆలోచించుకుని హామీలను ఇచ్చారు తప్పితే రాష్ట్ర ప్రయోజనాల కోసం, ప్రజల సంక్షేమం కోసం ఏమాత్రం ఆలోచన చేయలేదని అన్నారు.నేడు రాష్ట్రంలో ఎంత అరాచకం,అన్యాయం,అక్రమలతో కూడుకున్న పరిపాలన సాగుతుందో రాష్ట్ర ప్రజలు క్షుణ్ణంగా గమనిస్తున్నారని తెలియజేశారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు అమలు చేసిన ఈ రెండు పథకాలు అరా కొరగా అమలు చేశారు తప్పితే పూర్తిస్థాయిలో డబ్బులు జమ కాలేదని అన్నారు.రాబోయే రోజుల్లో జగన్మోహన్ రెడ్డిని ఎదుర్కొనే సత్తా చంద్రబాబు నాయుడుకి, పవన్ కళ్యాణ్ కి లేదని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు పరిపాలనలో నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అయోమయ స్థితిలో అప్పులు మయంగా మారిందని, అభివృద్ధి సంక్షేమం కుంటిపడిందని, ముఖ్యంగా మహిళలను, నిరుద్యోగ యువతీ యువకులను,



రైతులను,కార్మికులను,ఎస్సీ,ఎస్టీ బీసీలను మోసం చేసి అరాచక పరిపాలన కొనసాగిస్తున్నారని అన్నారు. అంతేకాకుండా వైఎస్ఆర్సిపి నాయకులు పై అక్రమ కేసులు పెట్టి వేధించడం ప్రజాస్వామ్యానికి హానికరం అన్నారు.ఈ కార్యక్రమంలో పోడూరు మండలం జడ్పిటిసి సభ్యులు జి పెద్దిరాజు, పి రామచంద్రారావు, జి రమేష్, జి చంటిబాబు, జి ఏకలవ్య, ఎస్ విష్ణుకుమార్ రెడ్డి, టి ప్రియాంక, కె వేణుబాబు, కె పద్మనాభ రాజు, జి ప్రసాద్, డి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ బాబ్జి పుట్టినరోజు వేడుకలలో అలరించిన అష్టావధానం.

**పాలకొల్లు. ప్రజా జ్యోతి రిపోర్టర్. కొట్టి రామం. జూలై 29.** పాలకొల్లులో ప్రముఖ వైద్యులు, సేవా తత్పరులు విద్యా దాత, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ త్సవటపల్లి సత్యనారాయణమూర్తి ( డాక్టర్ బాబ్జి) పుట్టినరోజు వేడుకలను ఆయన అభిమానులు ఉల్లంపర్రు మాంటిస్సోరి హైస్కూల్, సబితా జూనియర్ కాలేజి ఆవరణలో సోమవారం రాత్రి ఘనంగా జరిపించారు. తొలుత అంతర్వేది నుండి వచ్చిన స్వామీజీ బాబ్జికి ఆశీస్సులు అందిస్తూ 82సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారికి సహస్ర చంద్రోదయం దర్శనం పూర్తవుతుందని అన్నారు. సహస్ర చంద్రోదయం దర్శనం పూర్తి చేసుకున్న వారు నెల రోజులపాటు నియమ నిష్ఠల తో ఆలయంలో చేసే పూజా కార్యక్రమాలతో దైవత్వం వస్తుందని అన్నారు. బాబ్జి ఎంతో నియమ నిష్టలతో ఇందుకు సంబంధించిన పూజా కార్యక్రమాలు జరిపారన్నారు. ఈ సందర్భంగా సబితా జూనియర్ కాలేజీ వారు పట్టణంలోని వివిధ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు డాక్టర్ బాబ్జి జ్ఞాపికలు, ప్రశాంసా పత్రాలు అందజేశారు. అనంతరం జరిగిన అష్టావధానం కార్యక్రమం ఆహుతులందరినీ ఎంతగానో అలరించింది. అష్టావధానాన్ని అవధాన కళాధర, యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు నిర్వహించగా అవధానంకు సంచాలకులుగా దాయన సురేష్ చంద్రజీ వ్యవహరించారు. అవధాన ప్రక్రియలో వృచ్ఛకులుగా నిషిద్ధాక్షరం అంగర మానస, సమస్య చల్లా అన్నపూర్ణేశ్వరరావు, దత్త పది వి వి ఎస్ రాజు, వర్ణన పెన్మత్స సత్యనారాయణ రాజు వ్యక్తాక్షరి యర్రంశెట్టి వెంకటరత్నం, అశువు కొట్టి భాస్కర రావు, గీతావధానం గొర్తి సుబ్రహ్మణ్యం శాస్త్రి అప్రస్తుత ప్రసంగం చక్రవధానుల రెడ్డప్ప ధవేజీ నిర్వహించారు. అష్టావధానంలో అడుగడుగునా అడ్డుతగులుతూ రెడ్డప్ప ధవేజీ వేస్తున్న అప్రస్తుత చమక్కులతో దానికి అవధాని ఉమామహేశ్వర స్వామి




చతురోక్తుల సమాధానాలతో, సంచాలకులు చంద్రజీ హాస్య వ్యాఖ్యానాలతో సభలో అధ్యంతం నవ్వులు విరబూసాయి.రెడ్డప్ప ధవేజీ తన అప్రస్తుత ప్రసంగంలో అవధానిని ఉద్దేశించి మీరు ఎప్పుడైనా బెల్ట్ షాపుకు వెళుతుంటారా అని అడుగగా నా బెల్టు తెగిపోయినప్పుడు కొత్త బెల్టు తీసుకోవటానికి మాత్రమే బెల్టు షాపుకు వెళతాను అని బదులిచ్చారు.అవలక్షణం అంటే ఏమిటి అని అడుగగా ఇలా మధ్య మధ్యలో దూరడం అని బదులిచ్చారు. తొండ ముదిరి ఊసరవెల్లి అవుతుందంటారు కదా మరి లెక్చరర్ ముదిరితే అంటూ అడిగిన ప్రశ్నకు ప్రొఫెసర్ అవుతారన్నారు. రాజధాని అంటే కేంద్ర స్థానము అంటారు. మరి అవధాని అంటే అడిగిన ప్రశ్నకు అవధాని అంటే అంటే చెడును తొలగించడానికి మంచిని బోధించడానికి కేంద్ర స్థానం అన్నారు. ఉపరాష్ట్రపతి మీకు ఇస్తే ఎలాగుంటుంది అని అడుగగా ఇప్పుడు అవధానాలు చేస్తున్నాను అప్పుడు సహస్రావధానాలు చేయవలసి ఉంటుందని బదులిచ్చారు. మోదీ బాగా మోగిస్తున్నారు మోత ఏమంటారు అని అడుగగా మోతతో పాటు ప్రజలకు మోదం కలిగిస్తున్నారని అవధాని బదులిచ్చారు. అవదాన ప్రక్రియలో పాల్గొన్న పృచ్ఛకులందరూ తమ తమ ప్రక్రియలను సమర్ధవంతం గా నిర్వహించారు. సంచాలకులు మాట్లాడుతూ తెలుగు సాహిత్య చరిత్రలో అవధానం గొప్పదని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరినీ డాక్టర్ బాబ్జి, మద్దాల వాసు సత్కరించారు.

## =ఆసుపత్రి 5 కోట్ల14 లక్షలతో నాసిరకం నిర్మాణం.

= మరమ్మత్తులకు ఆదేశించిన అధికారులు.



**పామిడి జూలై 29 ప్రజా జ్యోతి. రిపోర్టర్ మధు..** గత ప్రభుత్వం ప్రజల వైద్య ఆరోగ్య నిమిత్తం చుట్టూ ఐదు మండలాలలో లేని విధంగా 30 పడకల నూతన ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రము నిర్మాణం కొరకు దాదాపు 5 కోట్ల14 లక్షల రూపాయలు మంజూరు చేయగా అప్పట్లోగుత్తేదారులు ,అధికారులు కుమ్మక్కై నాణ్యతలేని నిర్మాణం చేయడంతో ఇప్పుడు వర్షం వస్తే రోగులు చికిత్స పొందుతున్న వార్డులు, గదులు అంతా కారడం (లీకేజీ)తో రోగులు భయాందోళనలకు గురి అవుతున్నారు. విషయం తెలుసుకున్న ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రధాన సభ్యులు చిలకల రాజగోపాల్ వెంటనే స్పందించి ఆసుపత్రి నిర్మాణమంతటా పరిశీలించగా పైకప్పు ఫ్లోరింగ్,కూరింగ్ నాణ్యత లోపించినందున ఇలా కారడమే (లీకేజ్) గాక గోడలు కూడా బీటలు చీలికలు ఏర్పడ్డాయని, గమనించిన ఆయన వెంటనే గుంతకల్లు శాసనసభ్యుడు గుమ్మనూర్ జయరాం దృష్టికి తీసుకొని పోయారు. ఆయన తక్షణ చర్యగా స్పందించి జిల్లా ఉన్నతాధికారులతో మంతనాలు జరరుపగా వారు గుత్తేదారున్ని పిలిపించి తిరిగి మరమ్మత్తులు చేయవలసిందిగా ఆదేశాలిచ్చారు. ఆసుపత్రి పైకప్పు అంతయు పగలగొట్టి నూతనంగా ఫ్లోరింగ్ చేయడం పనిని మంగళవారం ప్రారంభించారు. చిలకల రాజగోపాల్ సేవాభావంతో ఆస్పత్రి అభివృద్ధి పట్ల చేస్తున్న కృషికి ప్రజలు అభినందనలు చెబుతున్నారు.

## ముమ్మరంగా త్రాగునీటి పైప్ లైన్ మరమ్మత్తు పనులు



**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్ :** పొందూరు మెహర్ పంచాయతీ ఆవరణంలో పంచాయతీ ఈ. ఓ మోహన్ బాబు ఆధ్వర్యంలో సిరిపురం గడ్డ వద్ద ముమ్మరంగా పైప్ లైన్ మరమ్మత్తు పనులు చేపట్టారు. మంచినీటి పైప్ లైన్లు మరమత్తులకు గురి కావడంతో ఈ. ఓ పర్యవేక్షణ లో.సిబ్బంది శరవేగంగా పనులు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఈ. ఓ మోహన్ బాబు మాట్లాడుతూ పట్టణంలో నీటి సరఫరాకు అంతరాయం కలగకుండా ,ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసేందుకు ఈ పనులు చేపడుతున్నామన్నారు. గెడ్డ లో నీరు ఉండటం వలన ఇంజన్ తో తొడించి మరమ్మత్తు పనులు చేయించడం జరిగిందన్నారు. పాడైపోయిన నీటి సరఫరా వ్యవస్థను మరింత మెరుగు పరుస్తూ , నీటి వృధాను తగ్గించడమే ఉద్దేశ్యమని తెలిపారు. ప్రజలకు ఎల్లవేళలా త్రాగునీటి ఇబ్బందులు లేకుండా స్వచ్ఛమైన నీటిని అందించేందుకు ఎప్పటికపుడు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

## అభ్యర్థులైన పేదలకు ఇంటి పట్టాలకు భూములకు హద్దులు చూపించాలి



**కలసపాడు ప్రజా జ్యోతి (జూలై 29)** కలసపాడు మండలం పుల్లారెడ్డి పల్లె పంచాయతీలో పుల్లారెడ్డి పల్లె దళితులు గత 2007 సంవత్సరంలో రాజశేఖర్ రెడ్డి గవర్నమెంట్ లో పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేసి ఉన్నారు వీరికి ఇంటి పట్టాలు ఇవ్వకుండా ఆఫీసుల చుట్టూ తిప్పుకుంటున్నారు తప్ప వారికి న్యాయం చేయలేదు సిపిఎం మండల కార్యదర్శి గురయ్యా పెర్కొన్నారు ఇప్పటికీ వారికి న్యాయం చేయాలని ఎమ్మార్వో మధురవాణి కి అర్జీ ఇవ్వడం జరిగినది అడగడం జరిగినది అదేవిధంగా2007 సంవత్సరము భూములు అసైన్మెంట్ భూములకు 600 మందికి పట్టాలు మంజూరు చేసినారు తప్ప ఇంతవరకు సబ్ డివిజన్ చేసి ఇవ్వలేదు ఇప్పుడు ఎమ్మార్వో మధురవాణి మాట్లాడుతూ ఇన్ని సంవత్సరములు ఏమి చేస్తున్నారు దానికి ప్రజలు మాకు ఎంతమంది అధికారులు వచ్చిన మాటలు చెప్పడం తప్ప ఎవరు మాకు న్యాయం చేయలేదు అన్నారు ఇప్పటికైనా చేయకపోతే మేము ప్రజలను ప్రజల సహకారంతో ఆందోళన చేపడతామన్నారు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మండల కార్యదర్శి సుదర్శన్ ఆవాజ్ మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగూర్ వల్లి అధ్యక్షుడు హుస్సేన్ పీరా మరియు ప్రజలు పాల్గొన్నారు.

## బద్వేల్ లీడ్ క్యాప్ సంస్థకి ఇచ్చిన స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా చూస్తాం

రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గన్నేపాటి మల్లేష్



**గోపవరం జూలై 29 (ప్రజా జ్యోతి న్యూస్)** మంగళవారం నాడు బద్వేల్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో లిడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ గొడుగునూరు రాజశేఖర్ అధ్యక్షతన సమావేశం జరిగింది ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లేష్ మాట్లాడుతూ బద్వేల్ మండలం చెన్నంపల్లి పొలం సర్వేనెంబర్ 15 80 బార్బీ లో మూడు ఎకరాల 64 సెంట్లు లిడ్ కాప్ సొసైటీ కి కేటాయించడం జరిగిందని ఆ స్థలంలో మాదిగ విద్యార్థులకు లిట్ క్యాబ్ సంబంధమైన చెప్పులు తయారీ బ్యాగులు చర్మాలు శుద్ధి చేయడం ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయుటకు ఉపయోగపడే ఈ స్థలాన్ని కొందరు వ్యక్తులు కబ్జా చేసి కట్టడాలు కట్టడం జరిగింది కట్టడాలు కట్టిన ఎవరినైనా ఉపేక్షించే పద్ధతి లేదని త్వరలోనే మూడు ఎకరాలు 64 సెంట్లు భూమిని కొలతలు వేయించి త్వరలో లెదర్ ఇండస్ట్రీ ఏర్పాటు చేయుటకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు, ఈ కార్యక్రమంలో లిడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ గొడుగునూరు రాజశేఖర్ దళిత నాయకులు ముండ్లపాడు పిచ్చయ్య కేశవయ్య దళిత వేదిక జిల్లా అధ్యక్షులు ఓబయ్య బాలయ్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో గుడ్ టచ్ - బ్యాడ్ టచ్ అవగాహన



**బాపట్ల జూలై 29 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ ఆదేశాలతో బాపట్ల జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో మంగళవారం పోలీస్ అధికారులు, శక్తి బృందాలు సంయుక్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయి. విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు, డ్రగ్స్ ముప్పు, మహిళా భద్రత చట్టాలు, శక్తి యాప్ వినియోగంపై సమాచారం అందించారు. బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మధ్య తేడాను స్పష్టంగా వివరించి, అసహజ ప్రవర్తన ఎదురైతే తక్షణం స్పందించాల్సిన అవసరాన్ని తెలిపారు. శక్తి యాప్ డౌన్‌లోడ్, ఉపయోగాలు వంటి అంశాలను ప్రాక్టికల్ డెమోతో చూపించారు. సైబర్ మోసాలు, ఆన్‌లైన్ గేమ్స్ ప్రమాదాలు, డ్రగ్స్ వలన కలిగే అనర్థాలు వంటి కీలక అంశాలపై విద్యార్థుల్లో చైతన్యం కలిగించామని అధికారులు తెలిపారు.

# మన ప్రభుత్వం మంచి ప్రభుత్వం

సుపరిపాలన తొలి అడుగు లో చమర్తి

**రాజంపేట జూలై 29 (ప్రజాజ్యోతి)** మన ప్రభుత్వం మంచి ప్రభుత్వం అని,దుబారా కంటే ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్న కూటమి ప్రభుత్వానికి అందరూ అండగా ఉండాలని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు తెలియజేశారు.మంగళవారం సిద్ధవటం మండలం మహబూబ్ నగర్ లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలోమన ప్రభుత్వం మంచి ప్రభుత్వం సుపరిపాలన తొలి అడుగు లో చమర్తి సిద్ధవటంబీమన ప్రభుత్వం మంచి ప్రభుత్వం అని,దుబారా కంటే ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్న కూటమి ప్రభుత్వానికి అందరూ అండగా ఉండాలని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు తెలియజేశారు.మంగళవారం సిద్ధవటం మండలం మహబూబ్ నగర్ లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శనివారపు మోహన్ రెడ్డి , మండల క్లస్టర్ ఇంచార్జి, దశరథ రామానాయుడు, రాష్ట్ర బీసీ సెల్ కార్య నిర్వహణ కార్యదర్శి, కాడే శ్రీనివాసు నాయుడు, ఎక్స్ ఎంపీపీ, నరసింహారెడ్డి, నియోజవర్గం మైనార్టీ నాయకులు, డాక్టర్ వీరభద్రుడు, టిడిపి మాజీ మండల పార్టీ అధ్యక్షులు సామా శ్రీనివాసులు, మాజీ కన్వీనర్, మామిడి సుబ్బారెడ్డి, సర్పంచ్ ప్రతినిధి, ప్రతాప్ నాయుడు, ఎక్స సర్పంచ్, సుబ్బారెడ్డి, బొడిచర్ల శ్రీనివాసులు, పుత్త విజయ్, ప్రసాద్ నాయుడు, హరి ప్రసాద్, శేఖర్ రెడ్డి, సుబ్బయ్య, రమణ యాదవ్, కృష్ణ యాదవ్, పాలకొండ యాదవ్, మహేశ్వర్ రెడ్డి, చెన్నకేశవులు, ఓబుల్ రెడ్డి, మురళి రాయల్, సాదా వెంకటేష్, రామకృష్ణ, నరసింహులు, తదితరులు టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ఆత్మహత్యాయత్నం చేసిన యువతిని రక్షించిన మేదరమెట్ల పోలీసులు

అభినందించిన జిల్లా ఎస్పీ తుషార్ దూడి




**బాపట్ల జూలై 29 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన యువతి వేగంగా స్పందించిన మేదరమెట్ల పోలీసులు విజయవాడలో గుర్తించి సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. కొరిశపాడు మండలం మేదరమెట్లకు చెందిన 25ఏళ్ల యువతి ప్రేమ వివాహానికి కుటుంబ సభ్యుల నిరాకరణతో మనస్థాపానికి గురై, సూసైడ్ నోట్ వదిలి బయటకు వెళ్లింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్పీ ఆదేశాలపై చీరాల డీఎస్పీ, అద్దంకి సీఐ మల్లికార్జున, మేదరమెట్ల ఎస్సై రఫీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు సిసి కెమెరాల ఆధారంగా గాలించారు విజయవాడ బస్టాండ్ వద్ద యువతిని గుర్తించిన పోలీసులు ఆమెను క్షేమంగా తీసుకురాగా, కౌన్సెలింగ్ అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. యువతి జీవితం రక్షించడంలో చూపిన వేగం, సాంకేతిక వినియోగంపై మేదరమెట్ల పోలీసులను జిల్లా ఎస్పీ తుషార్ దూడి అభినందించారు. క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు శాశ్వత నష్టాన్ని మిగులుస్తాయన్న ఆయన, యువత శాంతంగా ఆలోచించాలని తెలిపారు అత్యవసర సమయంలో, 112 లేద 100 నెంబర్లకు కాల్ చేయవచ్చని జిల్లా ఎస్పీ తెలియజేశారు

# యువత డ్రగ్స్ కు దూరంగా ఉండాలి

అన్నమయ్య జిల్లా
మహిళలు చిన్న పిల్లల భద్రతకు శక్తి టీం
రోడ్డు భద్రత నియమాలు పాటించాలి
డ్రగ్స్ కు బానిసైతే ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని యువతను
హెచ్చరించిన అదనపు ఎస్పీ (పరిపాలన) శ్రీ యం.వెంకటాద్రి గారు.

**రాయచోటి జులై 29 (ప్రజాజ్యోతి)** మాదక ద్రవ్యాల వలన కలిగే దుష్ప్రభావాలను యువతకు వివరించి, వారిని చైతన్యపర్చి, మాదక ద్రవ్యాలపై పోరాటం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) శ్రీ.యం.వెంకటాద్రి గారు పిలుపు నిచ్చారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ, శ్రీ.వి.విద్యాసాగర్ నాయుడు ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు, కార్యక్రమాన్ని జూలై 29న రాయచోటి పట్టణంలోని శ్రీ సాయిశుభ కళ్యాణ మండపంలో దాదాపు 650 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు ఎస్పీ గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ శ్రీ యం.వెంకటాద్రి గారు మాట్లాడుతూ – మాదక ద్రవ్యాలను నియంత్రించే విధంగా చట్టపరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. గంజాయి వ్యాపారాలు సాగిస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు చేపడుతున్నామని, మాదక ద్రవ్యాల అలవాటుకు యువత దూరంగా ఉండాలని, బంగారు జీవితాలను నాశనం చేసుకోవద్దని యువతను కోరారు. యువత మాదక ద్రవ్యాలకు ఆకర్షితులు కాకుండా, వాటికి అలవాటు పడిన వారిని మాదక ద్రవ్యాలకు దూరం చేసేందుకు, వారిలో చైతన్యం నింపేందుకు, జిల్లా ఎస్పీ శ్రీ .వి.విద్యాసాగర్ నాయుడు ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు, జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. వ్యసనాలకు బానిసలైతే కుటుంబ సభ్యులకు భారంగా మిగులుతామన్నారు. కావున, ప్రతీ ఒక్కరు మాదక ద్రవ్యాల నియంత్రణకు కృషి చెయ్యాలన్నారు. తోటి స్నేహితుల ఒత్తిడి, ప్రోత్సాహాలకు లొంగిపోకుండా మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, యువతకు పిలుపునిచ్చారు. సమాజంలో యువత పాత్ర క్రియాశీలకమైనదన్నారు. కళాశాలల్లో చేరిన తరువాత యువతపై తల్లిదండ్రుల ప్రత్యక్ష పర్యవేక్షణ కొరవడుతుందని, కొత్తగా ఏర్పడిన స్నేహితులు, పరిచయాలతో యువతను ప్రక్క దారి పట్టించే అవకాశం ఉంటుందన్నారు. డ్రగ్స్ సరదాగా తీసుకున్నపుడు ప్రారంభంలో తాత్కాలికంగా ఆనందాన్ని ఇచ్చినప్పటికీ, తరువాత కాలంలో సరదా, అలవాటుగా, వ్యసనంగా మారుతుందన్నారు. స్నేహితుల ఒత్తిడితో డ్రగ్స్ అలవాటైతే, ప్రాణాలు కోల్పోవలసి వస్తుందన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వ్యక్తులు శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తుందన్నారు. అంతేకాకుండా, మాదక ద్రవ్యాలకు అలవాటుపడిన వారు తమ ఆర్థిక అవసరాల కొరకు అప్పులు చేస్తూ, వాటిని తీర్చేందుకు చిన్న చిన్న దొంగతనాలకు పాల్పడుతూ, పోలీసులకు చిక్కి, న్యాయపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటూ, తమ జీవితాలను జైళ్ళలో గడుపుతున్నారన్నారు. నేరస్థులుగా మారిన వారిపై రౌడీ షీట్స్ తెరిచి పోలీసు నిఘా ఉంటుందని, వారు ఏ ఉద్యోగంలో చేరినా, విదేశాలకు వెళ్ళాలనుకున్నా పోలీసు వెరిఫికేషనులో వారి నేరచరిత్ర బయటపడుతుందని, తద్వారా ఉపాధి, అవకాశాలు కోల్పోతారన్నారు. గంజాయి ఎంత తీవ్రమైన నేరమన్న విషయాన్ని ప్రతీ ఒక్కరూ గుర్తించాలన్నారు. మహిళలు, చిన్నపిల్లల భద్రతకు 'శక్తి' టీమ్ మహిళలు మరియు చిన్నపిల్లల భద్రతకు సంబంధించి 'శక్తి' టీమ్ నిరంతరం కృషి చేస్తుంది. ఈ టీమ్ ఆపదలో ఉన్న మహిళలకు, పిల్లలకు అండగా ఉండి, వారికి తక్షణ సహాయాన్ని అందిస్తుంది. ఏదైనా ప్రమాదం లేదా వేధింపులు ఎదురైనప్పుడు, శక్తి టీమ్ కి సమాచారం అందించడం ద్వారా సత్వరమే చర్యలు తీసుకోబడతాయి. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి. ప్రతి ఒక్కరూ తమ భద్రతకు, ఇతరుల భద్రతకు రోడ్డు భద్రతా నియమాలను తప్పకుండా పాటించాలి. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు పెట్టుకోవాలి. ట్రాఫిక్ లైట్లను గౌరవించి, నిబంధనల ప్రకారం నడుచుకోవాలి. నిర్ణీత వేగంతోనే వాహనాలను నడపాలి. అతి వేగం ప్రమాదకరం. మద్యం సేవించి వాహనం నడపడం అత్యంత ప్రమాదకరం, చట్టరీత్యా నేరం. పాదచారులు రోడ్డు దాటేటప్పుడు జీబ్రా క్రాసింగ్‌లనే ఉపయోగించాలి. మీ భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలంటే, మీరు చదువుతో పాటు మీ భద్రత పట్ల కూడా శ్రద్ధ వహించాలి. ముఖ్యంగా, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఆన్‌లైన్‌లో తెలియని లింక్‌లను క్లిక్ చేయవద్దు, మీ వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ



పంచుకోవద్దు. మీ జీవితం ఎంతో విలువైనది. మీరు క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే, మీతో పాటు మీ కుటుంబానికి, సమాజానికి కూడా మంచి జరుగుతుంది. ఏ ఆపద వచ్చినా భయపడకుండా, తక్షణమే మీ పెద్దలకు లేదా పోలీసులకు తెలియజేయండి. మీ భద్రతకు మేము ఎప్పుడూ ఉన్నామంటూ పేర్కొన్నారు.

**జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీ.ఎస్.రవి గారు మాట్లాతూ**

సమాజంలో పెరుగుతున్న మాదక ద్రవ్యాల వినియోగం వలన చాలా కుటుంబాలు, యువత నాశనమవుతున్నారన్నారు. సమాజానికి హాని కలిగించే మాదకద్రవ్యాల నియంత్రణ, నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పని చేస్తున్నాయన్నారు. జిల్లా పోలీసుశాఖ యువతలో చైతన్యం తీసుకొని వచ్చేందుకు మంచి ఉద్దేశ్యంతో, ఈ కార్యక్రమాన్ని అమలు చేయడం జరిగిందన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని, మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ ధృఢ సంకల్పంతో పనిచేసి మాదక ద్రవ్యాలు అక్రమ రవాణా, అమ్మకం, వినియోగం గురించి ఏదైనా సమాచారం తెలిస్తే సమాచారాన్ని పోలీసువారికి అందించాలన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు తనవంతు సంపూర్ణ సహకారాన్ని అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కళాశాలల విద్యాధికారి శ్రీ ఎస్.రవి గారు, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ, శంకర మల్లయ్య, రాయచోటి ట్రాఫిక్ సిఐ, విశ్వనాథరెడ్డి, ఎస్ఐలు లోకేష్, వెంకటేష్, గాయత్రి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ యం.ప్రకాష్, ప్రతిభ కళాశాల కరస్పాండెంట్ ఏ.శివ గంగిరెడ్డి, రాజు విద్యాసంస్థల ప్రధాన ఉపాధ్యాయులు వై.గంగన్న, వివిధ కళాశాలల అధ్యాపకులు, జిల్లాలోని శక్తి టీం సభ్యులు, పోలీసు సిబ్బంది, వివిధ కళాశాలల ఇంటర్మీడియట్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎటువంటి గ్రూపులు లేకుండా అందరం కలిసికట్టుగా పనిచేసి విజయం సాధిద్దాం

సుపరిపాలన ఒంటిమిట్టలో కూటమి అభ్యర్థిని గెలిపిస్తుంది
ప్రతి కార్యకర్త ఉప ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి
రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు



**రాజంపేట జూలై 29 (ప్రజాజ్యోతి)** సమిష్టిగా పనిచేసి ఒంటిమిట్ట మండల జడ్పిటిసి ఎన్నికల్లో కూటమి అభ్యర్థికి ఘన విజయాన్ని అందిద్దామని రాజంపేట పార్లమెంటు టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు పిలుపునిచ్చారు. మంగళవారం ఒంటిమిట్టలో టిడిపి నాయకులు కార్యకర్తలతో సమావేశమైన ఆయన పలు సూచనలు సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నాయకుడు కార్యకర్త ఉప ఎన్నిక ద్వారా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఘనవిజయం కట్టబెట్టి చంద్రబాబునాయుడు గారికి, లోకేష్ గారికి కానుకగా అందించాలని, ప్రతి ఒక్కరూ గ్రామస్థాయిలో మనం చేసిన మంచిని వివరిస్తూ ప్రజలు పోలింగ్ బూత్ కి వచ్చి మన అభ్యర్థికి ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలని, ప్రతిష్టాత్మకంగా తీసుకొని మాటలు కాకుండా చేతల్లో మన సత్తా చూపించినప్పుడే విజయం సాధించగలుగుతామని ఆయన తెలియజేశారు.

## సి ఆర్ జెడ్, నిబంధనల ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటాం:



**బాపట్ల జూలై 29 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** బాపట్ల మండలం అడవిపాలెం సమీపంలోని సిమౌత్ ప్రాంతంలో తీరప్రాంత నియంత్రణ (సిఆర్ జెడ్) నిబంధనలను ఉల్లంఘించి జరిగిన ఆక్రమణపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి హెచ్చరించారు. ఈ అంశంపై మంగళవారం కలెక్టరేట్‌లో సిమౌత్ జాయింట్ యాక్షన్ కమిటీతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నిబంధనలు పాటించకుండా ప్రకృతి సమతుల్యతకు భంగం కలిగించే పనులకు అవకాశమే లేదని తెలిపారు.సిమౌత్‌ను ఎల్–ఆకారంలో పునరుద్ధరించేందుకు అవసరమైన స్థలాన్ని గుర్తించేందుకు సంబంధిత శాఖలు సర్వే చేసి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సి ఆర్ జెడ్ జెండాలు తొలగించిన వారిపై విచారణ జరిపి, నిబంధనలు అతిక్రమించిన ప్రైవేట్ వ్యక్తిపై తక్షణ చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. ఈ సమావేశంలో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ గంగాధర్ గౌడ్, ఆర్డీవో గ్లోరియ, డీఎస్పీ రామాంజనేయులు, ఎమ్మార్వో, రెవెన్యూ, మత్స్యకార, మైనింగ్, డ్రైనేజ్, పోలీస్ శాఖల అధికారులు, మత్స్యకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోండి

: సీఎస్ విజయానంద్

బాపట్లలో ఫీడర్ పనులను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి



**బాపట్ల జూలై 29 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** విద్యుత్ సరఫరాలో ప్రజలకు ఎటువంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఆదేశించారు. మంగళవారం బాపట్ల జిల్లాలో పర్యటించిన ఆయన, సూర్యలంక రోడ్‌లోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన అనంతరం ఆర్‌డిఎస్ఎస్ పథకం కింద ఏర్పాటు చేసిన విద్యుత్ ఫీడర్లు, బ్రేకర్ల నిర్వహణను ప్రత్యక్షంగా పరిశీలించారు. బాపట్ల టౌన్–1లోని 33,11 కెవి ఉపకేంద్రంలో స్మార్ట్ మీటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, మైక్రో కంట్రోలర్ల పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. పటేల్‌నగర్, శృంగారపురంలో విద్యుత్ లోడును తగ్గించేందుకు విసిబి బ్రేకర్ల ఏర్పాటుకు 20.10 లక్షలు ఖర్చు చేసి 1.5 కి.మీ. విద్యుత్ లైన్ వేయడం జరిగిందని తెలిపారు.అనంతరం వేటపాలెం మండలంలోని చల్లారెడ్డిపాలెం మీదుగా దేసాయిపేట–రామన్నపేట మధ్య 6.5 కి.మీ ఫీడర్ పనులను పరిశీలించిన ఆయన, వీటికి రూ.75 లక్షలు వ్యయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ జె. వెంకట మురళి, సీపీడీసీఎల్ సిఎండి పుల్లారెడ్డి, విద్యుత్ శాఖ అధికారులు, ఆర్డీవో గ్లోరియా మున్సిపల్ కమిషనర్ జి రఘునాథరెడ్డి జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిత్యం కుక్క కాటుకు ప్రజలు బలవుతున్న చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు

వీధి కుక్కల నియంత్రణకై డివైఎఫ్ఐ ఆందోళన

**బద్వేల్ జూలై 29 (ప్రజా జ్యోతి న్యూస్)** బద్వేలు పట్టణంలో విచ్చలవిడిగా సంచరిస్తూ చిన్నారులు, పాదచారులపై దాడులు చేస్తున్న వీధి కుక్కలను నియంత్రించాలని కోరుతూ భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) బద్వేలు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బద్వేల్ ఆర్టీసీ బస్టాండ్, నెల్లూరు గేటు వద్ద గల భగత్ సింగ్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో విచ్చలవిడిగా గుంపులు గుంపులుగా వీధి కుక్కలు సంచరిస్తూ వివిధ పనుల కొరకు వీధులలో తిరుగుతున్న ప్రజలపై పిల్లలపై వీధి కుక్కలు పెద్ద ఎత్తున దాడి చేసి గాయపరుస్తున్నప్పటికీ వీధి కుక్కలను నియంత్రించడంలోగాని, కుక్కలను పట్టణ వెలుపలకి తరలించడానికి అవసరమైన చర్యలు చేపట్టడంలో మున్సిపల్ పాలకవర్గం, అధికారులు వైఫల్యం చెందారని, మున్సిపల్ అధికారులకు పట్టణ ప్రజలపై అధిక పన్నులు విధించడంలో మరియు ముక్కు పిండి పన్నులు వసూలు చేసి మున్సిపల్ ఖజానాకు జమ చేసుకోవడంలో ఉన్న శ్రద్ధ ప్రతినిత్యం కుక్క కాటుకు బలై ఎన్నో ఇబ్బందులు గురవుతున్న పట్టణ ప్రజల ఆరోగ్యం పై శ్రద్ధ లేదని, కుక్క కాటుకు గురైన సందర్భంలో హడావిడి కంటి తుడుపు చర్యలు తప్ప శాశ్వత ప్రాతిపదికన వీధి కుక్కలను నియంత్రించుటకు అవసరమైన చర్యలను చేపట్టడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా పట్టణ ప్రజలు కుక్కకాటు వలన వచ్చే రేబిస్ వ్యాధి బారిన పడకుండా మున్సిపల్ పాలకవర్గం మున్సిపల్ అధికారులు వీధి కుక్కల శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి మున్సిపల్



కార్యాలయం దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 13వ వార్డు కౌన్సిలర్ షేక్ మహమ్మద్ హస్సన్,డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష –కార్యదర్శులు షేక్ మస్తాన్ షరీఫ్, షేక్ ఆదిల్,రూరల్ అధ్యక్షులు ముడమాల ఓబుల్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు పత్తూరు యువరాజ్, రాజు, షరీఫ్, షేక్ కరీముల్లా, నాయబ్ రసూల్, షేక్ షాదక్, షేక్ నాయబ్, పఠాన్ హుస్సేన్ భాష, షేక్ బాబావల్లి, షేక్ హుస్సేన్, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి :

వైసీపీ ఆధ్వర్యంలో తూర్పు పాలెం క్యాంప్ కార్యాలయంలో మండల విస్తృతస్థాయి సమావేశం

మాజీమంత్రి శ్రీ రంగనాథరాజు ఆదేశాల మేరకు బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం

ముఖ్య అతిథులుగా జడ్పిటిసి సభ్యుడు గుంటూరి పెద్దిరాజు ఎంపీపీ సుమంగళి

ప్రజల పక్షాన పోరాడే దిశగా చైతన్యవంతుల్ని చేయాలన్న పెద్దిరాజు

**ప్రజాజ్యోతి (జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ) న్యూస్ పోడూరు జూలై 29 :** కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని వైసిపి పోడూరు మండల కన్వీనర్ పిల్లి నాగన్న అన్నారు. తూర్పు పాలెం పార్టీ గ్రామ కార్యాలయంలో మంగళవారం బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లి నాగన్న మాట్లాడుతూ మోసపు మాటలతో రాష్ట్ర ప్రజలను మోసగిస్తున్నారు అన్నారు. ఎన్నికల హామీలను ప్రజలకు అమలు చేయడంలో కూటం ప్రభుత్వం విఫలమైందన్నారు. వైసిపి పార్టీ ప్రజల పక్షాన పోరాడుతుందని అన్నారు. ప్రతి నాయకుడు శక్తి వంచన లేకుండా కార్యక్రమంలో పాల్గొవాలన్నారు. జడ్పిటిసి గుంటూరు పెద్దిరాజు మాట్లాడుతూ ప్రజలను చైతన్యవంతులుగా చేసేందుకే ఏడాది కూటమి పాలనలో మోసం గ్యారెంటీ కార్యక్రమం పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు చెరికోట శ్రీరంగనాథరాజు సూచనల మేరకు వైసిపి ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన ప్రతి ఇంటికి ప్రచారం చేపడతామన్నారు. ఈ కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షులు పిల్లి నాగన్న, పోడూరు మండల జడ్పిటిసి గుంటూరి పెద్దిరాజు, మండల ఎంపీపీ సబ్బెతి సుమంగళి పోతుమూడి



రామచంద్రరావు, గుబ్బల వీరబ్రహ్మం గుడాల చంటి విప్పర్తి ప్రభాకర్, చెట్టు బత్తుల సువర్ణ రాజు గొట్టుముక్కల సునీల్ వర్మ, కుచర్లపాటి పద్మనాభరాజు, ఇల్ల శ్రీనివాస ప్రసాద్ పడాల అబ్బు, బోసు పాముల శ్రీను దొంగ పెద్దిరాజు పాల ఏడుకొండలు, గెద్దాడ ఏకలవ్య, పైడి ఏసుబాబు బుడితి భీమారావు, గొట్టుముక్కల రమేష్, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున హాజరై మాట్లాడారు.

# విద్యార్థులకు ఆర్టీసీ బస్సు ప్రారంభోత్సవం







వెల్దుర్తి మండలం నుండి క్రిష్ణగిరి మోడల్ స్కూల్ కళాశాల

**( ప్రజా జ్యోతి రిపోర్టర్) జూలై 29** కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం స్థానికంగా మంగళవారం రోజు వెల్దుర్తి నుండి క్రిష్ణగిరి మోడల్ స్కూల్ విద్యార్థుల బస్సు ప్రారంభోత్సవం నందు విద్యార్థిని విద్యార్థులు మాట్లాడుతూ బస్సు సౌకర్యం కల్పించిన జిల్లా కలెక్టర్ రంజిత్ భాష గారికి మరియు పత్తికొండ శాసనసభ్యులు కేఈ శ్యాంబాబు గారికి, ఏపీఎస్ఆర్టీసీ రీజినల్ మేనేజర్ టి. శ్రీనివాసులు, డిపో మేనేజర్ కేవిఎల్ఎస్ శర్మ, అసిస్టెంట్ మేనేజర్ ఎల్డీ సృజన వారికి విద్యార్థినీ విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సన్నివేశంలో క్రిష్ణగిరి మోడల్ స్కూలు విద్యార్థిని విద్యార్థుల బస్సు ను మంగళవారం రోజు టిడిపి నాయకులు జిల్లా నాయకుడు సుబ్బారాయుడు, మాజీ ఎంపీపీ ఎల్ఈ జ్ఞానేశ్వర్ గౌడ్, టిడిపి మండల అధ్యక్షుడు బలరాం గౌడ్, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్. నిర్మల కుమారి, సిపిఐ పార్టీ మండల అధ్యక్షుడు టి కృష్ణ , చిన్నమాదులు ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు డి సోమన్న విద్యార్థిని విద్యార్థులు ,తల్లిదండ్రులు పాల్గొని హనుమాన్ జంక్షన్ వ్యవస్థాపకుడు రామాంజనేయులు గారిచే ప్రత్యేక పూజలు నిర్వహించి అందరూ కలిసి జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఈ సన్నివేశంలో టిడిపి నాయకులకు మరియు పాఠశాల ప్రిన్సిపాల్ కి, వామపక్ష పార్టీ నాయకులకు విద్యార్థినీ విద్యార్థులచే పూలమాల శాలవతో సన్మానం భావించారు. ఈ సన్నివేశంలో విద్యార్థిని విద్యార్థుల బస్సు కొరకు కృషి చేసిన ఎస్ గంగాధర్ నాయుడు కి మరియు ఎన్ సూర్యచంద్రకి విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పూలమాల శాలువాతో సన్మానం గావించారు. తదితర వామపక్ష పార్టీ నాయకులకు ,పత్రిక విలేకరులకు మరియు మీడియా మిత్రులు సహకరించిన వారందరికీ విద్యార్థినీ విద్యార్థులు మరియు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆగస్టు 5న వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆందోళనలు

సీపీఐ 24వ జిల్లా మహాసభలను విజయవంతం చేయండి ... పి రామచంద్రయ్య





**( ప్రజా జ్యోతి రిపోర్టర్) కర్నూలు జూలై 29** రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న స్మార్టు మీటర్లుకు వ్యతిరేఖంగా వామపక్షపార్టీల ఆధ్వర్యంలో అగస్టు 5 న రాష్ట్రవ్యాప్తంగా జరుగు ఆందోళనలను విజయవంతం చేయాలని, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి రామచంద్రయ్య పిలుపునిచ్చారు మంగళవారం నాడు సిపిఐ జిల్లా సమితి సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యుడు విరుపాక్షి అధ్యక్షతన జరిగింది ఈ సమావేశంలో పాల్గొన్న రామచంద్రయ్య మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్త ఆందోళన విజయవంతం చేయడంతో పాటు ఆగస్టు 9,10 తేదీలలోకర్నూలు లో జరుగు సీపీఐ 24 వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ శ్రేణులకు పిలుపు నిచ్చారు. జిల్లా కౌన్సిల్ సమావేశం లో మొదట సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ మునెప్ప సంతాప తీర్మాణం ప్రవేశపెట్టగా సమితి సభ్యులందరూ రెండు నిముషాలు మౌనం పాటించి సంతాపం తెలియచేశారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రామచంద్రయ్య మాట్లాడుతూ ఎన్నికల ముందు టీడీపీ నాయకుడు నారా లోకేష్ స్మార్ట్ మీటర్ల వ్యతిరేఖించడమే కాకుండా పగుల కొట్టాలని చెప్పారని ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. రైతులకు అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సుప్రయాణం, మహిళ అకౌంట్లలో నెలకు 1500రూ ఇస్తానని రకరకాల హామీ ఇచ్చి ఏది కాలమైన ఇంత వరకు అమలు చేయలేదన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో పాలకులు విఫలం చెందారన్నారు. జిల్లా మహాసభల సందర్భంగా ఆగస్టు 9న కర్నూలు నగరంలో పెద్దఎత్తున ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ప్రదర్శనలో అగ్రభాగాన రెడ్ షార్ట్ వాలెంటీర్లు, ఎర్రచీరలు ధరించిన మహిళలు అగ్రభాగన నిలుస్తారన్నారు. ప్రదర్శనలో ముందు బాగాన వివిధ రూపాలలో ఉన్న కళారూపాయలు, ప్రజానాట్యమండలి కళాకారుల గేయాలు, డప్పుచప్పుళ్ళతో పట్టణం నినాదాలతో మారు మొగాలి అన్నారు . సీపీఐ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య, ఆహ్వానసంఘం అధ్యక్షులు కె జగన్నాధంలు మాట్లాడుతూ మహాసభల సందర్భంగా పట్టణం మొత్తం ఎర్రజెండాలు, తోరణాలతో ఎరుపుమయం చేయడమే కాకుండా ప్రదర్శనలో కదంతొక్కాలన్నారు. మహాసభల విజయవంతంకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. బహిరంగ సభ అనంతరం సాయంత్రం జరుగు ప్రతినిధుల సభకు జిల్లాలోని పార్టీ నాయకులు, వివిధ ప్రజాసంఘాలకు, విద్యార్థి, యువజనసంఘాలు, ఏపీ మహిళా సంఘంకు చెందిన వారు సుమారు 300 ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ప్రతినిధుల మహాసభల్లో జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి వలసల నివారణకు శాశ్వత పరిష్కారం కోసం మహాసభల్లో జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం నివాసస్థలం లేని నిరుపేదలకు గ్రామీణప్రాంతంలో మూడుసెంట్లు, పట్టణ ప్రాంతంలో రెండు సెంట ఇండ్ల స్థలాల సాధన జిల్లాలో మౌలిక వసతుల కల్పన కోసం వేల కోట్ల రూపాయలు నిధులు కేటాయించాలని సమగ్రంగా చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యచరణ రూపొందించడానికి జిల్లా మహాసభలు వేదిక కానున్నాయని కావున ఈ మహాసభల విజయవంతం కోసం సమితి సభ్యులందరూ సైనికుల్లా పనిచేయాలని వారు పిలుపునిచ్చారు ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆవుల శేఖర్, నక్కి లెనిన్ బాబు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ మునెప్ప, పూర్వపు జిల్లా కార్యదర్శి భీమ లింగప్ప, సీనియర్ నాయకులు మనోహర్ మాణిక్యం, జిల్లా కార్యవర్గ సభ్యులు నబి రసూల్, రామకృష్ణారెడ్డి,రాజా సాహెబ్, మద్దిలేటి శెట్టి, రంగన్న, భాస్కర్ యాదవ్, జి చంద్రశేఖర్, శ్రీరాములు, సిపిఐ నగర సహాయ కార్యదర్శిలు సి మహేష్, డి శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సోమన్న, షాపీర్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు సుదర్శనం, రాజీవ్, రామాంజనేయులు, రాజు, సులోచనమ్మ, రామంజి,, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు

# నెల్లూరులో మున్సిపల్ కార్మికులపై పోలీసుల లాఠీఛార్జీ అమానుషం

**బద్వేల్ జూలై 29 (ప్రజా జ్యోతి న్యూస్)** ఈనెల 12వ తేదీ అర్ధరాత్రి నుండి నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోగల 9వ వార్డును వర్క్ అవుట్ సోర్సింగ్ పేరిట ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగించే చర్యలను విడనాడాలని మున్సిపల్ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా వేదాయపాలెం వద్ద శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులను పోలీసులు అక్రమ అరెస్టులు చేసి,లాఠీచార్జ్ చేయడాన్ని నిరసిస్తూ పాత మున్సిపల్ కార్యాలయం మాస్టర్ పాయింట్ వద్ద బద్వేలు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్( సిఐటియు) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ కోశాధికారి కాలువ శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల ఉపాధికి ఎసరు తెచ్చే విధంగా నెల్లూరు నగరంలో ప్రారంభించిన వర్క్ ఔట్సోర్సింగ్ విధానాన్ని అపాలని, మున్సిపల్ కార్మికులు గత 17రోజులుగా శాంతియుతంగా పోరాడుతున్నారు. నిర్ధాక్షిణ్యంగా నెల్లూరు మున్సిపల్ కార్మికులపై పోలీసు జులం ప్రదర్శించి సోమవారం మగ పోలీసులు మహిళా కార్మికులపై విరుచుకుపడి దొరికినవారిని దొరికినట్లు కొట్టడం, దుర్భాషలాడటం, మహిళలు చెప్పుకోలేని ప్రాంతాలలో శరీరంపై లాఠీలు, బూటు కాళ్లతో దుర్మార్గంగా దాడి చేయటాన్ని బద్వేలు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు)పట్టణ కమిటి ఖండిస్తున్నది. మాది మంచి ప్రభుత్వమని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పాలనలో దళిత, గిరిజన తెగలకు చెందిన మున్సిపల్ కార్మికులపై దాడికి తెగబడటం సిగ్గు చేటని,గతంలో 2014 నుండి 2019 మధ్య అధికారం చెలాయించిన తెలుగుదేశం పార్టీ పాలనలో 279 జి.ఓ ద్వారా వర్క్ ఔట్సోర్సింగ్ విధానాన్ని తెచ్చిందని, దీనికి వ్యతిరేకంగా ఆనాడు కార్మికులు నాలుగున్నర సంవత్సరాల పాటు రాజీలేని పోరాటం చేశారని గుర్తు చేశారు.ఆ సందర్భంగా తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఐదుగురు కార్మికులను పొట్టన పెట్టుకున్నదని,రాష్ట్రంలో కార్పొరేట్ సంస్థలకు పెద్ద పీట వేస్తూ ప్రపంచ బ్యాంకు విధానాలను అమలు చేయటంతోపాటు మోడీ సర్కార్ తెచ్చిన పట్టణ సంస్కరణలను మన రాష్ట్రంలో అమలు చేసి కార్మికులను, ప్రజలను కష్టలా సుడిగుండంలోకి నెట్టే తెలుగుదేశం కూటమి ప్రభుత్వ విధానాలను ప్రజలందరూ తిరస్కరించాలని,నెల్లూరులో విచక్షణారహితంగా మహిళా




కార్మికులపై దాష్టికానికి పాల్పడిన మగ పోలీసులు, లాఠీఛార్జీని ప్రోత్సహించిన సి.ఐ శ్రీనివాసరావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులపై కక్ష్య సాధింపు చర్యలు, నిర్బంధం మానుకోకపోతే రాష్ట్రవ్యాపితంగా ఉద్యమాన్ని ఉదృతం చేయాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు దియ్యాల హరి, ఉపాధ్యక్షులు, గంటా శ్రీనివాసులు, దియ్యాల దేవమ్మ,కార్యదర్శి నాగరపు సత్యరాజు, కమిటీ సభ్యులు తేళ్ల కిరణ్,ఇండ్ల చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా ఆచంట సొసైటీ ప్రమాణ స్వీకారం.



**పోడూరు / ఆచంట, జులై 29,ప్రజాజ్యోతి న్యూస్ (రిపోర్టర్ కేకే ఆర్ వెంకట్ ).** ఆచంట మృత్యుంజయ సొసైటీని త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం మంగళవారం అట్టహాసంగా జరిగింది. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అధ్యక్షుడిగా కడలి భాస్కరరావు, సభ్యులుగా బలుసు శ్రీరామమూర్తి, తోరం ప్రసాదు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ సొసైటీ ద్వారా నూతన పాలకవర్గం రైతులుకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు చిలుకూరి సీతారాం, జనసేన అధ్యక్షుడు జవ్వాది బాలాజీ, బిజెపి మండల అధ్యక్షుడు ఎన్ శ్రీనుబాబు, కూటమి నాయకులు తమ్మినీడి రామకృష్ణ వరప్రసాద్, జక్కంశెట్టి సత్యనారాయణ,కేతా మీరయ్య, బీర నరసింహమూర్తి, సొసైటీ కార్యదర్శి యాండ్ర విష్ణు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పేకాటపై దాడి ముగ్గురు అరెస్టు, నగదు స్వాధీనం

ఒమ్మంగి శివారులో ప్రత్తిపాడు పోలీసుల చర్య



**కాకినాడ జూలై 29 ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్** ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి శివారులో పేకాట ఆడుతున్న వారిపై ఎస్సై లక్ష్మికాంతం నేతృత్వంలో పోలీసులు దాడి నిర్వహించి ముగ్గురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుండి రూ.10,760 నగదును స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం ఆధారంగా పోలీసులు దాడికి పాల్పడ్డారు. పేకాట, గుండాట, కోడిపందాలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించబోమని, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై లక్ష్మికాంతం హెచ్చరించారు.

## బీసీ హాస్టల్ సందర్శన మౌలిక సదుపాయాలపై విద్యార్థి విభాగం డిమాండు



**బాపట్ల జూలై 29 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతి)** బాపట్ల పట్టణంలోని బీసీ హాస్టల్ను వైయస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర స్థాయి నేతలు సందర్శించారు. జిల్లా అధ్యక్షుడు యల్లావుల సోహిత్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ షేక్ పర్వేజ్ నేతృత్వంలో హాస్టల్ పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెస్ బిల్లులు, కాస్మోటిక్ ఛార్జీలు పెండింగ్లో ఉన్నవి విడుదల చేసి, పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచాలని కోరారు. బాపట్ల బీసీ హాస్టల్కు సొంత భవనం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారులు తక్షణం స్పందించాలని విద్యార్థి విభాగం నేతలు డిమాండ్ చేశారు.

## బాపట్ల అభివృద్ధిపై సీఎస్కు వినతి ఇచ్చిన ఎమ్మెల్యే నరేంద్ర వర్మ



**బాపట్ల జూలై 29 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** బాపట్ల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ముఖ్య కార్యదర్శి (సీఎస్) విజయానంద్కు ఎమ్మెల్యే నరేంద్ర వర్మ వినతిపత్రం అందజేశారు. బాపట్లలో సీఎస్ పర్యటన సందర్భంగా కలెక్టరేట్లో భేటీ అయిన ఎమ్మెల్యే, ఎకో టూరిజం అభివృద్ధి, ఎత్తిపోతల పథకాలు, ట్రాన్స్ఫార్మర్లు, సాగునీరు అవసరాలపై వివరంగా చర్చించారు. సూర్యలంకను సమగ్ర పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అటవీ శాఖ భూమిని పర్యాటక శాఖకు కేటాయించాలని ఆయన కోరారు. ఇప్పటికే,97 కోట్ల రూపాయలు కేటాయించిందని, మరింత అభివృద్ధికి ప్రభుత్వం స్పందించాలని అభ్యర్థించారు. కర్లపాలెం మండలం కట్టావాద రైతుల సమస్యలను సీఎస్ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే, సాగునీటి కోసం అవసరమైన విద్యుత్ను అందించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే ప్రతిపాదనలపై సీఎస్ విజయానంద్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## వైఎస్సార్సీపీ అధినేతను కలిసిన ముదునూరి మురళీకృష్ణం రాజు



**కాకినాడ జూలై 29 ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్** తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిని నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు, ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్సీపీ నేత ముదునూరి మురళీకృష్ణం రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలు, స్థానిక సమస్యలు, అభివృద్ధి అంశాలపై జగన్తో చర్చించినట్లు మీడియాకు తెలియజేశారు .

## బదిలీపై వెళ్లిన అధికారులను సన్మానించిన సర్పంచ్ సూతి వీరకృష్ణ ప్రసాద్



**కాకినాడ జులై 29 ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్** ఏలేశ్వరం మండలం తిరుమాలి గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ సేనాపతి అజయ్ కుమార్,ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఆత్మకూరి మణికంఠను సర్పంచ్ సూతి వీర కృష్ణప్రసాద్ ఘనంగా సన్మానించారు .తిరుమాలి సచివాలయంలో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై రామవరం,బురుగుపూడి గ్రామాలకు వెళ్తున్న స్థానిక సర్పంచ్ సూతి వీర కృష్ణ ప్రసాద్ గ్రామ నేతల చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు.స్థానిక నేతల సమక్షంలో పుష్పగుచ్చాన్ని ఇచ్చి శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా సర్పంచ్ సూతి ప్రసాద్ మాట్లాడుతూ తిరుమాలి గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఇప్పటివరకు చేసిన సేవలను కొనియాడారు.ఉద్యోగ బాధ్యతలో బదిలీలు సహజమని అన్నారు.బదిలీపై వెళ్లే గ్రామంలో కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు .ఈ కార్యక్రమంలో చిన్న ప్రసాద్ యర్రా బుల్లి వీర్రాజు,బద్ది బాబి,కానూరు దుర్గాప్రసాద్, కానూరు బ్రహ్మానందం, చవ్వాకుల నాగబాబు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# గాంధీ భగవాన్ రాజు చేతులమీదుగా వీధి దీపాలు ప్రారంభం.

పంచాయతీ కార్యదర్శి పాల శారద శ్రీనివాస్ సహకారం మరువలేనిది.



**పాలకొల్లు జులై 29 ప్రజాజ్యోతి ప్రతినిధి :** పాలకొల్లు మండలం పూలపల్లి గ్రామ పంచాయితి పరిధిలో కుళాయి చెరువు వద్ద ఉన్న కాలనికి గ్రామ పంచాయితి నిధులతో పది కరెంటు స్తంభాలను ఏర్పాటు చేసి ప్రజలకు కరెంటు సదుపాయం,వీధి దీపాలు ఏర్పాటు చేశారు.కాగా వీధి లైట్లును సోమవారం మాజీ ఏఎంసి చైర్మన్, టిడిపి సీనియర్ నాయకులు గొట్టు ముక్కల గాంధీ భగవాన్ రాజు చేతుల మీదుగా స్విచ్ ను వేసి ప్రారంబించారు. ఈ సందర్భంగా గాంధీ భగవాన్ రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పరిపాలన సంక్షేమం అభివృద్ధి పరుగులు పెడుతున్నాయని,అలాగే పాలకొల్లు నియోజకవర్గంలో నీటిపారుదల శాఖ మంత్రి, నిమ్మల రామానాయుడు సహకారంతో అవసరమైన ప్రతి అభివృద్ధి పనిని చేసుకోగలుగుతున్నామని తెలియజేశారు.అలాగే ప్రజలకు వెలుగునిచ్చే వీటి దీపాలను నా చేతుల మీదగా ప్రారంభించడం అదృష్టంగా భావిస్తున్నానని,అలాగే వీధి దీపాలు ఏర్పాటు చేసే విషయంలో పంచాయతీ కార్యదర్శి పాల శారద శ్రీనివాస్ సహకారం మరువలేనిదని అన్నారు.ఈ కార్య క్రమంలో గ్రామ తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు వి వి శ్రీహరి రాజు, గుబ్బల ప్రసాద్, నాగరాజు చాంద్ రాజు,లక్ష్మణ్, రామకృష్ణ, జనసేన నాయకులు నూకల శ్రీను, రఘు లలిత,పంచాయతీ కార్యదర్శుల జిల్లా అధ్యక్షులు,పూలపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి పాల శారద శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నా గురువు పితాని సాక్షిగా సొసైటీ అభివృద్ధి కోసం కష్టపడి పని చేస్తా

: పెనుగొండ పట్టణ సొసైటీ చైర్మన్ నక్క వేధవ్యాస శాస్త్రి.



**పెనుగొండ జులై 29 ప్రజాజ్యోతి ప్రతినిధి :** నాకు అత్యంత ఇష్టమైన వ్యక్తి, నా గురువు,రాజకీయ దురంధరుడు, ప్రజా సంక్షేమ శారది మాజీమంత్రి, శాసనసభ హక్కుల కమిటీ చైర్మన్,ఆచంట నియోజకవర్గం శాసనసభ్యులు పితాని సత్యనారాయణ సాక్షిగా పెనుగొండ గ్రామ రైతుల అభివృద్ధి ధ్యేయంగా కష్టపడి పని చేస్తానని పెనుగొండ పట్టణ సొసైటీ చైర్మన్ నక్క వేదవ్యాస శాస్త్రి అన్నారు మంగళవారం ఆప్తులు, కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు,అభిమానులు,ముఖ్యం గా ముఖ్య అతిథి, రాజకీయ పండితుడు అన్నిటికీ మించి నక్క వేదవ్యాస శాస్త్రి ని అభిమానించి ఇష్టపడే పితాని సత్యనారాయణ సమక్షంలో అంగరంగ వైభవంగా కని విని ఎరుగని రీతిలో మునుపెన్నడు ఎవరు చేయలేని పద్ధతిలో పెనుగొండ పట్టణ సొసైటీ అధ్యక్షులు( చైర్మన్)గా నక్క వేదవ్యాస శాస్త్రి ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో గొప్ప అరుదైన, గౌరవప్రదమైన సొసైటీ అధ్యక్షులుగా నన్ను ఎంపిక చేయటంలో చొరవ చూపించిన నా గురువు పితాని సత్యనారాయణ కు నా మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు.అలాగే సొసైటీ అభివృద్ధికి, రైతుల ఆర్థిక ఎదుగుదలకు పార్టీలకు కులమతాలకు అతీతంగా కష్టపడి పనిచేసి వినుకొండ గ్రామ సొసైటీకి మంచి పేరు తీసుకొస్తానని అన్నారు. ఇదే కార్యక్రమంలో భాగంగా సొసైటీ డైరెక్టర్లుగా వేంద్ర మురళి, కానూరి వెంకట సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారం చేసిన త్రిసభ్య కమిటీ సభ్యులకు గ్రామ ప్రజ,నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. తదనంతరం శాసనసభ్యులు పితాని సత్యనారాయణకు భారీ పూలమాలను వేసి ఘనంగా సన్మానించారు.

## రాజకీయ విలువలను బిఆర్ఎస్ పార్టీ దిగజార్చుతుంది

**షాద్ నగర్ :** బీజేపీ వంకర టింకర సమాధానాలు మానేసి బిసి బిల్లు ప్రవేశపెట్టాలి.పార్టీ మెప్పు కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి ని వ్యక్తిగతంగా విమర్శించడం సిగ్గు చేటని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడు తూ... మంచి సంస్కృతి కి, విలువలకు, పోరాటానికి నిలయమైన తెలంగాణ గడ్డ అన్నారు. తెలంగాణ తెచ్చుకున్నది మీ లాంటి వారి రౌడీ ఇజం చూడటానికి కాదన్నారు. బిఆర్ఎస్ అధికారం కోసం చేసే ఆకృత్యాలు ప్రజలకు కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుం దన్నారు. తెలం గాణ వచ్చింది ఒక్క పార్టీ వల్లనో కాదన్నారు. ఎందరో బలిధానాల ఫలితమే తెలంగాణ అన్నారు. బి ఆర్ ఎస్ నాయకులు చేసే ఆకృత్యలపై న్యాయపరంగా పోరాడతామన్నారు. బిసి కల కోసం 42% రిజర్వేషన్ పట్టుబట్టి ముఖ్యమంత్రి పోరాడుతున్నారు. బిల్లు చెయ్యాల్సిన బీజేపీ పార్టీ వంకరటింకార సమాదానలు చెబుతుందన్నారు. చేతనైతే పార్లమెంట్ లో బిల్లు ప్రవేశపెట్టాలన్నారు.

## ఆగస్టు 2వ తేదీన నాంపల్లిలోని రెడ్ రోజ్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్లో మెగా జాబ్ మేళా

**హైదరాబాద్ :** నిరుద్యోగులకు శుభవార్త. ఆగస్టు 2వ తేదీన నాంపల్లిలోని రెడ్ రోజ్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు మెగా జాబ్ మేళా నిర్వాహకులు మన్నన్ ఖాన్ ఇంజినీర్ అధికారికంగా ప్రకటించారు. ఈ మెగా జాబ్ మేళాలో అనేక కంపెనీలో పాల్గొననున్నాయని తెలిపారు. ఫార్మా, హెల్త్, ఐటీ, ఎడ్యుకేషన్, బ్యాంక్ సెక్టార్లతో పాటు వివిధ రంగాలకు చెందిన కంపెనీలు అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసుకోనున్నాయి. వీటిలో కొన్ని కంపెనీలు వర్క్ ఫ్రమ్ హోం సదుపాయాన్ని కూడా కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మెగా జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిస రిగా పది, ఆపై తరగతులు ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. మెగా జాబ్ మేళాలో పాల్గొన దలచుకునే వారు మరిన్ని వివరాలకు 8374315052 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

## ఫామ్ ఆయిల్ పంటతో ఆర్థిక బలం

### మంత్రి తుమ్మల

**వికారాబాద్ :** పామ్ ఆయిల్ పంటలు సాగు చేస్తూ అధిక దిగుబడులతో ఆర్థికంగా బలపడాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు సూచించారు. వికారాబాద్ పరిసర ప్రాంతంలోని కొత్రేపల్లిలోని కాసాని జ్ఞానేశ్వర్ వ్యవసాయ క్షేత్రంలో చేపట్టిన మెగా ఆయిల్ ఫామ్ ప్లాన్ టేషన్ డ్రైవ్ లో భాగంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వ్యవసాయ శాఖ మంత్రి నాగేశ్వరావు మాట్లాడు తూ... రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి రైతులను ఆదుకునే దిశగా పనిచేస్తుందన్నారు. పామ్ ఆయిల్ పంట సాగుతో అధిక లాభాలు ఆర్జించడంతో పాటు మూడు సంవత్సరాల పాటు అంతర్గత కూరగాయ పంటలతో వ్యవసాయం సాగు చేయవచ్చునని మంత్రి తెలిపారు. ఆయిల్ ఫామ్ పంటకు ప్రభుత్వం సబ్సిడీని అందిస్తూ రైతులను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యధికంగా ప్రాముఖ్యత నిస్తూ రైతుల సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన ఏడాదిన్నర లోనే వ్యవసాయ రంగం కోసం లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసిందని, రైతులను రుణ బారం నుండి విముక్తులను చేయడానికి 25 లక్షల మంది రైతులకు చెందిన 21 వేల కోట్ల రుణాలను మాఫీ చేయడం జరిగిందని సభాపతి తెలిపారు. రైతు భరోసా ను ఏడాదికి ఎకరాకు 12 వేలకు పెంచి కేవలం తొమ్మిది రోజులలో తొమ్మిది వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాలలో వేయడం జరిగిందని

## బాపట్లలో డెకరేషన్ గోడౌన్‌లో అగ్ని ప్రమాదం

సమాచారం అందుకున్న సీఐ రాంబాబు పరిశీలన



**బాపట్ల జులై 29 (ప్రజాజ్యోతి జిల్లా ప్రతినిధి)** బాపట్ల పట్టణం రామకృష్ణాపురం ప్రాంతంలో ఉన్న ఖాసీం డెకరేషన్స్ కు చెందిన డెకరేషన్ సామగ్రి గోడౌన్‌లో సోమవారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. గోడౌన్‌లో ఉన్న భారీ మొత్తంలో డెకరేషన్ సామగ్రి పూర్తిగా కాలిపోయినట్లు సమాచారం. ఈ ఘటనపై గోడౌన్ యజమాని ఖాసీం అనుమానాస్పదంగా భావించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్పందించిన బాపట్ల సీఐ రాంబాబు తన సిబ్బందితో కలిసి వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని క్లూస్ టీమ్‌లతో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలు తేల్చేందుకు విచారణ జరుగుతోందని, బాధితుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని సీఐ రాంబాబు హామీ ఇచ్చారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## ఆగస్టు 8వ తేదీన కరీంనగర్ జిల్లాలో బీసీల భారీ బహిరంగ సభ

### మాజీ మంత్రి, తలసాని శ్రీనివాస్ యాదవ్

**హైదరాబాద్ :** ఆగస్టు 8వ తేదీన కరీంనగర్ జిల్లాలో బీసీల భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ల అమలుపై తెలంగాణ భవన్‌లో మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన బీసీ ముఖ్య నాయకులు సమావేశమయ్యారు.ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. మొదటి నుండి కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తూ వస్తుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ తరపున త్వరలోనే బీసీ ప్రతినిధుల బృందం రాష్ట్రపతిని కలవనుందని తెలిపారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42 శాతం రిజర్వేషన్‌లకు చట్టబద్ధత కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు.ఓట్ల కోసమే కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలు ఇచ్చిందని మండిపడ్డారు. పారదర్శకత లేకుండా కులగణన జరిపి, హడావుడిగా అసెంబ్లీలో ప్రభుత్వం బిల్లును పెట్టిందన్నారు. రాష్ట్రపతి వద్ద బిల్లు పెండింగ్‌లో ఉండగానే ఆర్డినెన్స్ తీసుకొస్తామనడం రాజ్యాంగ విరుద్ధం. 9వ షెడ్యూల్‌లో చేర్చితేనే చట్టబద్ధత లభిస్తుందని అసెంబ్లీలో తాము స్పష్టం చేసినం. అమలు కాదని తెలిసే కాలయాపన చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మభ్య పెడుతుందన్నారు.ఢిల్లీలో ధర్నా చేస్తామనడం కొత్త డ్రామాకు కాంగ్రెస్ కుట్ర. బిజెపి, కాంగ్రెస్ పార్టీల వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్తాము. మీ చేతుల్లోనే ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీలో 42 శాతం రిజర్వేషన్ ఎందుకు అమలు చేయరు. మిగిలిన మూడు మంత్రి పదవులను బీసీలకు ఇచ్చి చిత్తశుద్ధి నిరూపించుకోవాలి. వివిధ ప్రభుత్వ శాఖలలో కూడా

## చెత్త రోడ్ల పైన వేస్తే జరిమానా తప్పదు మున్సిపల్ కమిషనర్



**బద్వేల్ జులై 29 (ప్రజా జ్యోతి న్యూస్)** బద్వేల్ పురపాలక సంఘంలోని పలు ప్రధాన రోడ్లను మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి మంగళవారం ఉదయం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లు షాపు ల నుండి వచ్చే చెత్త గాని ఇళ్లలోని చెత్త గాని ఎట్టి పరిస్థితుల్లో షాపుల ముందు గానీ రోడ్ల పైన గానీ వేయరాదన్నారు షాపుల ముందు తోపుడు బండ్లవారు చెత్త రోడ్లమీదనే వేసి వెళ్తున్నారన్నారు అలా చేసినచో షాపు యజమానులే బాధ్యత వహించాలన్నారు అట్లు వేసిన యెడల జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ఈరోజు ఉదయం చెత్త రోడ్డుమీద వేసినందుకు మారుతి ఏజెన్సీస్ వారికి 2000/- రూపాయలు జరిమానా విధించడం జరిగిందన్నారు. షాపుల నుండి వచ్చే చెత్త గాని ఇళ్లలోని చెత్త గాని కేటాయించిన చెత్త సేకరణ వాహనాల్లో మాత్రమే వేయవలెనన్నారు. చెత్త సేకరణ వాహనాలు ఆలస్యమైన లేదా సకాలంలో రాకపోయినా దిగువ తెలిపిన ఫోన్ నెంబర్ కి కాల్ చేయాలన్నారు (9440126507)

## ప్రాణ సమానమైన నీటి వనరులను పరిరక్షించాలి

ప్రజా సంకల్ప వేదిక మీడియా జర్నలిజం వైస్ ప్రెసిడెంట్ జరిపిటి వీరాంజనేయులు

**గంగా నది ఆక్రమణల తొలగింపుపై గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు దేశంలోని ముఖ్యంగా రాయలసీమలోని అన్ని నదులు, వాగులు, గుంటలకు వర్తింప చేయాలి!**



**అన్నమయ్య జిల్లా జూలై 29 (ప్రజాజ్యోతి)** గంగానది ఆక్రమణలపై సుప్రీంకోర్టు గతంలో ఆందోళన వ్యక్తం చేయటమే కాకుండా ఆక్రమణలను తొలగింపుకు తీసుకున్న చర్యలను తక్షణమే నివేదిక రూపంలో అందజేయాలని ఇటు కేంద్ర ప్రభుత్వాన్ని అటు బీహార్ ప్రభుత్వాన్నీ కోరడం శుభ పరిణామంగా భావించాలని రాయలసీమలోని చెరువులను, వాగు, వంకలను, ఆక్రమణదారుల నుంచి రక్షించి ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో నిజాయితీ గల అధికారులు పుణ్యం సంపాదించుకోవాలని హితువు పలికారు. ఇప్పటికైనా నిద్ర అవస్థ నుంచి కోలుకొని కరువు నివారణ పై జల వనరుల శాఖ చర్యలు తీసుకోవాలని ప్రజా సంకల్ప వేదిక మీడియా జర్నలిజం వైస్ ప్రెసిడెంట్ జెరిపిటి విరాంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు.ఈరోజు దేశంలో ఏ నది చూసినా, కన్నీరు కార్చే పరిస్థితులు ఉండటం దేశానికి ప్రమాదకరమని ప్రతి ఒక్కరూ గుర్తించి, నదుల ఆక్రమణలను తొలగింపుకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈరోజు నదులు కాలుష్య కేంద్రాలుగా తలపించటం అత్యంత దురదృష్టకరం, వీటిపై మేధావులు, ప్రజాసంఘాలు, ప్రజా ప్రతినిధులు ప్రభుత్వఅధికారులు , రాజకీయ పార్టీలు,యువత నీటి వనరులను పరిరక్షించడంలో చేతులెత్తేసాయి కాబట్టి, ప్రజలే భవిష్యత్తు తరాల మనుగడ కోసం ముందుకు రావాలని తెలియజేశారు. ప్రాణ సమానమైన నీటి వనరులను పరిరక్షించడంలో ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యం కావడం జీవకోటి మనగుడికే ప్రమాదమని హెచ్చరించారు.దేశంలోని ముఖ్యంగా మన రాయలసీమలో ప్రతి నీటి వనరులను పరిరక్షణపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు ప్రారంభించాలని. ప్రజా సంకల్ప వేదిక ప్రభుత్వానికి మీడియా ద్వారా విజ్ఞప్తి చేయడమైనది.

## వంగిమల్ల వారి వివాహ వేడుకలలో పాల్గొన్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు




**రాయచోటి జూలై 29 (ప్రజాజ్యోతి)** మంగళవారం రోజు రాత్రి రాయచోటి పట్టణం మాసాపేట నందు గల శ్రీ వెంకటేశ్వర స్వామి గుడిలో రాచపల్లి గ్రామం, బాల్ రెడ్డిగారిపల్లి వాస్తవ్యులు వంగిమల్ల అరుణ్ కుమార్ రెడ్డి వెడ్స్ లక్ష్మీ శ్వేత ల వివాహ వేడుకలలో పాల్గొనీ నూతన వధూవరులను ఆశీర్వదించిన రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల క్లస్టర్ ఇంచార్జ్ కసినేని మహేంద్ర నాయుడు, టిడిపి మండల నాయకుడు కొండా భాస్కర్ రెడ్డి, నాగభూషణ రెడ్డి,సురేంద్ర, రామాంజులు, కృష్ణ మూర్తి పాల్గొన్నారు.

## మహిళపై మానభంగం చేయాలని ప్రయత్నం.

**మహిళ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.**

**ముద్దాయికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, మూడువేల రూపాయలు జరిమానా విధిస్తూ ఏ ఎస్ జె, రాయచోటి కోర్టు తీర్పు వెలువరింపు.**

**గుడ్ ట్రైల్ మానిటరింగ్ వ్యవస్థ బలోపేతం**



**అన్నమయ్య జిల్లా జూలై 29 (ప్రజాజ్యోతి)** అన్నమయ్య జిల్లా ఎస్పీ శ్రీ వి.విద్యాసాగర్ నాయుడు ఐపీఎస్,. గారి పర్యవేక్షణలో అన్నమయ్య జిల్లా పోలీసులు ముద్దాయిలకు కఠిన శిక్షల కై గట్టి చర్యలు చేపట్టారు. జరిగిన విషయం లక్కిరెడ్డిపల్లె జతీ .అశీ .74/2011 .చీశీ.254/13452,376511 12.11.2011 సంవత్సరంలో కె ఎస్ ఆర్ పల్లి లక్కిరెడ్డిపల్లి మండలంలో ఒక మహిళను మానభంగం చేయడానికి ప్రయత్నించినాడని, మహిళ ఫిర్యాదు పైన అప్పటి ఎస్ఐ ఎస్వీ, నర్సింహారావు కేసు రిజిస్టర్ చేసి చార్జిషీట్ ఫైల్ చేయడం జరిగింది. పిపి, టి.జగన్ మోహన్ రెడ్డి కేసును వాదించడం జరిగింది. అన్ని కోణాల్లో విచారించి నేరం రుజువు కావడంతో అన్నమయ్య జిల్లా రాయచోటి ఏ ఎస్ జె, కోర్టు న్యాయమూర్తి. డాక్టర్ శ్రీమతి ఇ.ప్రసూన గారు ముద్దాయి అయిన పత్తి సుధాకర్ కు మూడు సంవత్సరాలు జైలు శిక్ష మరియు 3 వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ కేసులో క్రియాశీలకంగా వ్యవహరించి ముద్దాయికి శిక్ష పడడంలో కృషి చేసిన పిపి, టి.జగన్ మోహన్ రెడ్డి, అప్పటి ఎస్ఐ నరసింహారావు, లక్కిరెడ్డిపల్లి సిఐ టీ.వీ.కొండారెడ్డి, ఎస్ఐ, డి.రవీంద్రబాబు, కోర్టు కానిస్టేబుల్ (2694) చెల్లు గంగాధర్ ను , అన్నమయ్య జిల్లా ఎస్పీ శ్రీ.వి.విద్యాసాగర్ నాయుడు ఐపీఎస్,. గారు అభినందించారు. మహిళలు, చిన్నపిల్లల పట్ల లైంగిక వేధింపులు, అఘాయిత్యాలకు పాల్పడే వారికి కోర్టు తీర్పు ఒక గుణపాఠం కావాలని, జిల్లా ఎస్పీ శ్రీ.వి.విద్యాసాగర్ నాయుడు ఐపీఎస్,. గారు పేర్కొన్నారు.



# ఈ మూడు తింటే గుండె 100 ఏళ్లు సేఫ్?

గుండె జబ్బులను నివారించాలనుకుంటే ఈ రోజు నుండి ఈ మూడు కూరగాయలను మీ ఆహారంలో చేర్చుకోండి. చిన్న చిన్న ఆరోగ్యకరమైన అలవాట్లు పెద్ద మార్పును తీసుకొస్తాయి. ఈ మూడు కూరగాయలు ఏమిటి..? వాటి ప్రయోజనాలు ఎలా ఉంటాయి? ఈ మధ్య కాలంలో గుండె జబ్బులు కలవరపెడుతున్నాయి. వయసుతో సంబంధం లేకుండా ఇది అందరినీ కబళిస్తుంది. 20ఏళ్ల యువకుడు కూడా గుండెపోటుతో మరణించడం ఆందోళన కలిగిస్తుంది. ముఖ్యంగా గుండె ధమనులలో అడ్డంకులు ఏర్పడటం గుండెపోటు వస్తుంది. దీనికి ప్రధాన కారణం అనారోగ్యకరమైన జీవనశైలి, తప్పుడు ఆహారపు అలవాట్లు, పెరుగుతున్న ఒత్తిడి. కానీ సరైన సమయంలో కొన్ని అవసరమైన మార్పులు చేస్తే, ఈ ప్రమాదాన్ని చాలా వరకు తగ్గించవచ్చు. వెల్లుల్లి, బ్రోకలీ, పాలకూర వంటి కొన్ని సహజ కూరగాయలు గుండె ధమనులను శుభ్రంగా ఉంచడంలో, రక్తపోటును నియంత్రించడంలో, కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో చాలా సహాయపడతాయి. వెల్లుల్లిలో ఉండే అల్లిసిన్, బ్రోకలీ యొక్క యాంటీఆక్సిడెంట్లు, పాలకూర నైట్రేట్లు కలిసి గుండె ఆరోగ్యాన్ని బలోపేతం చేస్తాయి. గుండె ఎక్కువ కాలం ఆరోగ్యంగా ఉండటానికి వైద్యులు ఈ కూరగాయలను సాధారణ ఆహారంలో చేర్చుకోవాలని సిఫార్సు చేస్తారు. గుండె ఆరోగ్యానికి వెల్లుల్లి ఉత్తమ సహజ ఔషధంగా పనిచేస్తుంది. ఇందులో అల్లిసిన్ అనే క్రియాశీల సమ్మేళనం ఉంటుంది. ఇది కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో, రక్తపోటును నియంత్రించడంలో, ధమనులలో పేరుకుపోయిన కొవ్వును క్లీన్ చేయడంలో సహాయపడుతుంది. పచ్చి వెల్లుల్లిని క్రమం తప్పకుండా తినడం వల్ల గుండెపోటు, అడ్డంకి ప్రమాదం తగ్గుతుందని పరిశోధనలో తేలింది. ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో ఒకటి లేదా రెండు పచ్చి వెల్లుల్లి రెబ్బలను నమిలి తినడం మంచిది. బ్రోకలీ అనేది ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు కె, సీలతో సమృద్ధిగా ఉన్న సూపర్‌ఫుడ్. ఇది ధమనుల గోడలను బలపరుస్తుంది. వాటిలో మంటను తగ్గిస్తుంది. బ్రోకలీ రక్తపోటును నియంత్రించడంలో, గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. బ్రోకలీని ఉడుకబెట్టుకుని తినడం లేదా సలాడ్‌లో యాడ్ చేసుకుని తినొచ్చు. పాలకూరలో ఐరన్, ఫోలిక్ యాసిడ్, నైట్రేట్ పుష్కలంగా ఉంటాయి. ఇది రక్తాన్ని శుభ్రపరచడంలో, కండరాలకు ఆక్సిజన్‌ను అందించడంలో, ధమనులను తెరవడంలో సహాయపడుతుంది. నైట్రేట్ శరీరంలోకి ప్రవేశించి నైట్రిక్ ఆక్సైడ్‌గా మారుతుంది. ఇది రక్త ప్రవాహాన్ని మెరుగుపరుస్తుంది. గుండె అడ్డంకి ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

# పిల్లలు ఆరోగ్యంగా ఉండాలా?



మీ బిడ్డ తరచుగా జలుబు లేదా జ్వరంతో బాధపడుతున్నారా? మందులు లేకుండా మీ బిడ్డ రోగనిరోధక శక్తి బలంగా ఉండాలని మీరు కోరుకుంటున్నారా? అయితే మీకు కావలసిందల్లా మీ వంటగదిలో మీరు చేసే కొన్ని ఆహారాలు. ఈ రోజుల్లో మారుతున్న వాతావరణం, కాలుష్యం, చెడు ఆహారపు అలవాట్ల వల్ల పిల్లల రోగనిరోధక శక్తి దెబ్బతింటోంది. పిల్లలు తరచుగా అనారోగ్యానికి గురవుతున్నారు. జలుబు, జ్వరం లేదా కడుపు సమస్యలు సర్వసాధారణంగా మారాయి. అటువంటి పరిస్థితిలో వారి రోగనిరోధక శక్తిని బలోపేతానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే బాల్యంలో తల్లి పాలు తాగకపోవడం, తప్పుడు ఆహారపు అలవాట్లు కూడా రోగనిరోధక శక్తి బలహీనపడటానికి కారణం కావచ్చు. పిల్లల రోగనిరోధక శక్తి బలంగా ఉండడానికి, మందులకు బదులు, మొదట ఇంటి చిట్కాలు, సహజ పద్ధతులను పాటించాలి. ఇవి సురక్షితమైనవి, శరీరానికి ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవు. మీ బిడ్డ ఆరోగ్యంగా, వ్యాధుల నుండి దూరంగా ఉండాలని మీరు కోరుకుంటే, నేటి నుండేఈ ఇంటి చిట్కాలను ఫాలో అవ్వండి. పసుపు పాలు: పసుపులో క్రిమినాశక, యాంటీఆక్సిడెంట్ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. రాత్రి పడుకునే ముందు పిల్లలకు గోరువెచ్చని పాలలో అర టీస్పూన్ పసుపు కలిపి ఇవ్వడం రోగనిరోధక శక్తి పెరగడానికి సహాయపడుతుంది. ఇది వ్యాధులతో పోరాడే శక్తిని పెంచుతుంది. ఉసిరి – తేనె వినియోగం: ఉసిరి విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. ఉసిరి రసాన్ని కొద్దిగా తేనెతో కలిపి ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో పిల్లలకు ఇవ్వవచ్చు. ఇది రోగనిరోధక శక్తిని పెంచడమే కాకుండా జీర్ణక్రియను ఆరోగ్యంగా ఉంచుతుంది. తులసి – అల్లం టీ: తులసి – అల్లం రెండూ వైరస్‌లు, బ్యాక్టీరియాతో పోరాడటానికి సహాయపడతాయి. ఈ రెండు పదార్థాలతో తయారు చేసిన గోరువెచ్చని హెర్బల్ టీని పిల్లలకు తక్కువ పరిమాణంలో ఇవ్వవచ్చు. చక్కెరకు బదులుగా కొద్దిగా తేనె కలపాలని గుర్తుంచుకోండి. ఖర్జూరాలు –ఎండిన పండ్లు: ఖర్జూరాలు, ఎండిన ఖర్జూరాలు వంటి ఎండిన పండ్లు శరీరానికి బలాన్ని ఇస్తాయి. శీతాకాలంలో వాటిని తీసుకోవడం పిల్లల రోగనిరోధక శక్తికి మంచిది. వారికి ఇవ్వడానికి ఉత్తమ మార్గం వాటిని పాలలో ఉడకబెట్టడం. ఇది శక్తిని అందిస్తుంది. జలుబు, దగ్గును నివారిస్తుంది. చ్యవనప్రాష్ ఆయుర్వేద మూలికలతో తయారు చేస్తారు. ఇది పిల్లల రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. ఉదయం అల్పాహారానికి ముందు ఒక టీస్పూన్ చ్యవనప్రాష్ ఇవ్వడం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది రక్తాన్ని శుద్ధి చేయడంలో, ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా సహాయపడుతుంది.

# అల్లం, పసుపు నీరు బెనిఫిట్స్..



అల్లంతో అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు అంటున్నారు ఆరోగ్య నిపుణులు. క్రమం తప్పకుండా ఇలా చేస్తూ ఉంటే.. త్వరలోనే అధిక బరువు సమస్య తగ్గడం నుంచి చెడు కొలొస్ట్రాల్?ని దూరం చేసేంత వరకు అనేక లాభాలు ఉన్నాయని చెబుతున్నారు. అల్లం నీటిలో కాస్త పసుపు కలిపి తాగితే రెట్టింపుల లాభాలు అంటున్నారు. దగ్గు, జలుబు వంటి సీజనల్ వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుంది. శ్వాసకోశ సమస్యలు తగ్గుతాయి. శరీరంలోని కఫం మొత్తం కరిగిపోతుంది. ఉదయాన్నే అల్లం నీరు తాగటం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. బ్యాక్టీరియా, వైరస్‌ల నుంచి రక్షణ లభిస్తుంది. ఇన్‌ఫెక్షన్లు సైతం తగ్గుతాయి. ఈ నీళ్లను రోజూ పరగడుపునే తాగుతుంటే కీళ్లు, మోకాళ్ల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది..అల్లం నీటితో మైగ్రేన్‌ని తగ్గించొచ్చు అని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి.అల్లం నీరు చెడు కొలొస్ట్రాల్?ని తొలగిస్తుంది. కొలొస్ట్రాల్ లెవల్స్‌ని తగ్గిస్తుంది. దీంతో గుండెకు ఎంతో మేలు జరుగుతుంది. గుండె పనితీరు మెరుగు పడుతుంది. శరీరంలో రక్త సరఫరా పెరుగుతుంది. బీపీ తగ్గుతుంది. బరువు తగ్గాలనుకునేవారు తప్పనిసరిగా అల్లం నీరు తీసుకోవాల్సిందే అంటున్నారు నిపుణులు.అల్లంలో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో ఫ్రీ ర్యాడికల్స్ నిర్మూలించబడతాయి. ఫలితంగా క్యాన్సర్ వంటి వ్యాధులు దరిచేరకుండా అడ్డుకోవచ్చు అంటున్నారు నిపుణులు. పసుపులోనూ యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువే. ఇవి క్యాన్సర్ కణాలు పెరగకుండా చూస్తాయి. ఉదయాన్నే ఖాళీ కడుపుతో అల్లం, పసుపు నీళ్లను తాగితే చాలు, చర్మానికి తేమ లభించి మృదువుగా మారుతుంది. చర్మం పగలకుండా కాంతివంతంగా మారుతుంది. చర్మంపై ఉండే మొటిమలు, మచ్చలు కూడా తగ్గిపోతాయి. చర్మం ప్రకాశిస్తుంది. యవ్వనంగా కనిపిస్తారు. గ్యాస్ట్రిక్ యాసిడ్ ఉత్పత్తిని తగ్గించడంలో అల్లం నీరు అద్భుత ఔషధంగా సహాయపడుతుంది. అల్లం నీరు వాంతులు, వికారాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. అల్లం నీరు తయారి కోసం చిన్న అల్లం తీసుకుని ముక్కలుగా కట్ చేసుకోవాలి. కప్పు నీళ్లు గోరువెచ్చగా మరిగించండి. ఆ తర్వాత ఆ నీటిలో అల్లం వేయండి. 10 నిమిషాలు అలా ఉంచండి. నీళ్లల్లో నుంచి అల్లం తీసి, ఆ నీటిని తాగండి.

# ఈ మూడు కూరగాయలు పవర్‌ఫుల్



ఈ రోజుల్లో చిన్నా పెద్దా అనే తేడా లేకుండా.. అన్ని వయసుల వారిలో గుండె జబ్బులు ఆందోళనకరంగా మారాయి. ముఖ్యంగా గుండె ధమనులలో అడ్డంకులు ఏర్పడటం వల్ల కలిగే హార్ట్ బ్లాకేజ్.. ఒక ప్రమాదకరమైన పరిస్థితి. సకాలంలో చికిత్స అందించకపోతే.. ఇది ఒక్కోసారి ప్రాణాంతకంగా మారుతుంది. హార్ట్ బ్లాకేజీ.. దీనికి ప్రధాన కారణం అనారోగ్యకరమైన జీవనశైలి, తప్పుడు ఆహారపు అలవాట్లు..

పెద్దగా పట్టించుకోరు.. కానీ, ఈ మూడు కూరగాయలు పవర్‌ఫుల్.. గుండెపోటు ప్రమాదాన్ని ఇట్టే తగ్గిస్తాయి.ఈ రోజుల్లో చిన్నా పెద్దా అనే తేడా లేకుండా.. అన్ని వయసుల వారిలో గుండె జబ్బులు ఆందోళనకరంగా మారాయి. ముఖ్యంగా గుండె ధమనులలో అడ్డంకులు ఏర్పడటం వల్ల కలిగే హార్ట్ బ్లాకేజ్.. ఒక ప్రమాదకరమైన పరిస్థితి. సకాలంలో చికిత్స అందించకపోతే.. ఇది ఒక్కోసారి ప్రాణాంతకంగా మారుతుంది. హార్ట్ బ్లాకేజీ.. దీనికి ప్రధాన కారణం అనారోగ్యకరమైన జీవనశైలి, తప్పుడు ఆహారపు అలవాట్లు.. పెరుగుతున్న ఒత్తిడి.. కానీ సరైన సమయంలో కొన్ని అవసరమైన మార్పులు చేస్తే, ఈ ప్రమాదాన్ని చాలా వరకు తగ్గించవచ్చంటున్నారు నిపుణులు.. గుండె జబ్బులను నివారించాలనుకుంటే.. ఈ రోజు నుండి ఈ మూడు కూరగాయలను మీ ప్లేట్‌లో చేర్చుకోండి. చిన్న చిన్న ఆరోగ్యకరమైన అలవాట్లు పెద్ద తేడాను కలిగిస్తాయి. వైద్యుల అభిప్రాయం ప్రకారం.. వెల్లుల్లి, బ్రోకలీ, పాలకూర వంటి కొన్ని సహజ కూరగాయలు గుండె ధమనులను శుభ్రంగా ఉంచడంలో, రక్తపోటును నియంత్రించడంలో, కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో చాలా సహాయపడతాయి. వెల్లుల్లిలో ఉండే అల్లిసిన్, బ్రోకలీలోని యాంటీఆక్సిడెంట్లు, పాలకూరలోని నైట్రేట్లు కలిసి గుండెను బలోపేతం చేస్తాయి.. ఇంకా బ్లాకేజ్ ప్రమాదాన్ని తగ్గిస్తాయి. గుండె చాలా కాలం పాటు ఆరోగ్యంగా ఉండటానికి ఈ కూరగాయలను సాధారణ ఆహారంలో చేర్చుకోవాలని వైద్యులు కూడా సిఫార్సు చేస్తున్నారు. ఈ కూరగాయలు తినడం వల్ల గుండెపోటు రాకుండా ఎలా సహాయపడుతుంది..? వైద్యులు కూడా వీటిని ఆహారంలో చేర్చుకోవాలని ఎందుకు సిఫార్సు చేస్తారో ఘజియాబాద్ జిల్లా ఆసుపత్రిలోని డైటీషియన్ డాక్టర్ అనామిక సింగ్ వివరించారు.. అనామిక సింగ్ మాట్లాడుతూ.. ఈ మూడు కూరగాయలు సూపర్‌ఫుడ్ అని.. వాటిని తప్పనిసరిగా ఆహారంలో చేర్చుకోవాలని సూచించారు. వెల్లుల్లి గుండె ఆరోగ్యానికి ఉత్తమమైన సహజ ఔషధంగా పరిగణించబడుతుంది. ఇందులో అల్లిసిన్ అనే క్రియాశీల సమ్మేళనం ఉంటుంది.. ఇది కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో, రక్తపోటును నియంత్రించడంలో, ధమనులలో పేరుకుపోయిన కొవ్వును తొలగించడంలో సహాయపడుతుంది. పచ్చి వెల్లుల్లిని క్రమం తప్పకుండా తినడం వల్ల గుండెపోటు, గుండెజబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుందని పరిశోధనలో తేలింది. ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో ఒకటి లేదా రెండు పచ్చి వెల్లుల్లి రెబ్బలను నమిలి తినండి. పాలకూరలో ఐరన్, ఫోలిక్ యాసిడ్, నైట్రేట్ పుష్కలంగా ఉంటాయి.. ఇవి రక్తాన్ని శుభ్రపరచడంలో, కండరాలకు ఆక్సిజన్‌ను అందించడంలో, ధమనులను తెరవడంలో సహాయపడతాయి.

# నైట్ షెడ్యూల్ టైం..


## రాంచరణ్ పెద్ది షూటింగ్ ఇప్పుడెక్కడ జరుగుతుందో తెలుసా..?



ఉప్పెన ఫేం బుచ్చిబాబు సాన డైరెక్షన్‌లో టాలీవుడ్ స్టార్ యాక్టర్ రాంచరణ్ నటిస్తోన్న చిత్రం పెద్ది పాన్ ఇండియా రూరల్ స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో జాన్వీకపూర్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఏఆర్ రెహమాన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. పెద్ది షూటింగ్‌కు సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్ బయటకు వచ్చింది. ప్రస్తుతం నైట్ (రాత్రిపూట) షూటింగ్ కొనసాగుతుంది. రామోజీఫిలింసిటీలో రాంచరణ్ అండ్ టీంపై వచ్చే సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్టు ఫిలింనగర్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్. ఈ షెడ్యూల్‌లో జాన్వీకపూర్, రాంచరణ్‌పై వచ్చే పాటను కూడా షూట్ చేయనున్నారట. త్వరలోనే షూటింగ్‌కు సంబంధించి మరిన్ని వివరాలపై క్లారిటీ రానుందని తెలుస్తోంది. పెద్ది మార్చి 27న 2026న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ చిత్రంలో జగపతిబాబు, దివ్యేందు శర్మ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి. శంకర్ డైరెక్షన్‌లో వచ్చిన గేమ్ ఛేంజర్ బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. దీంతో ఉప్పెన డైరెక్టర్‌తో ఈ సారి ఎలాగైనా మంచి హిట్టుకొట్టాలని చూస్తున్నాడు.

# ఫ్యాషన్‌షోలో తళుక్కుమన్న జాన్వీ కపూర్






# భయపెట్టిస్తోన్న ప్రభాస్ తాత

గ్లోబల్ స్టార్ ప్రభాస్ టాలీవుడ్ దర్శకుడు మారుతి డైరెక్షన్‌లో నటిస్తోన్న పాన్ ఇండియా ప్రాజెక్ట్ రాజాసాబ్ హార్రర్ కామెడీ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీలో మలబారు భామ మాళవిక మోహనన్ ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఇప్పటికే ప్రేక్షకుల ముందుకు రావాల్సిన ఈ చిత్రం పలుమార్లు వాయిదా పడుతూ వస్తోంది. ఫైనల్‌గా ఈ చిత్రాన్ని డిసెంబర్ 5న విడుదల చేస్తున్నారు. కాగా ప్రమోషన్స్‌లో భాగంగా మేకర్స్ బాలీవుడ్ స్టార్ యాక్టర్ సంజయ్ దత్ లుక్ ఒకటి విడుదల చేశారు. ఈ చిత్రంలో సంజయ్ దత్ ప్రభాస్ తాత పాత్రలో నటిస్తున్నాడు. మున్నాభాయ్ బర్త్ డే సందర్భంగా మేకర్స్ రాజాసాబ్ నుంచి కొత్త పోస్టర్ విడుదల చేశారు. రాజాసాబ్‌లో సంజయ్ దత్ సంజూబాబా పాత్రలో కనిపించబోతున్నాడని తెలియజేస్తూ రిలీజ్ చేసిన పోస్టర్ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తోంది. భారీగా పెరిగిన తలవెంట్రుకలు, గడ్డంతో సంజూ బాబా పాత్ర సినిమాకే హైలెట్‌గా నిలువబోతున్నట్టు తాజా స్టిల్ చెప్పకనే చెబుతోంది. మేకర్స్ ఇప్పటికే లాంచ్ చేసిన రాజాసాబ్ గ్లింప్స్‌లో ప్రభాస్ సూపర్ స్టైలిష్‌గా చేతిలో పూలబొకే పట్టుకొని అద్దంలో తనను తాను చూసుకుంటూ.. పూలు చల్లుతూ నయా లుక్‌లో కనిపిస్తూ అభిమానులకు విజువల్ ట్రీట్ ఇవ్వడం పక్కా అని క్లారిటీ ఇచ్చేస్తున్నాడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిబొట్ల సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీ మోషన్ పోస్టర్ రికార్డ్ బ్రేకింగ్ వ్యూస్‌తో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచిన విషయం తెలిసిందే.



# ప్రభాస్ మనసు గెలుచుకున్న మహావతార్ నరసింహ..

## పవర్ ఫుల్ విజన్ అంటూ కామెంట్

హరిహర వీరమల్లు చిత్రం రిలీజ్ అయిన తర్వాతి రోజు సైలెంట్‌గా థియేటర్స్‌లోకి వచ్చి కేవలం మౌత్ టాక్‌తో భారీ కలెక్షన్స్ సాధిస్తున్న చిత్రం మహావతార్ నరసింహ. 50 ఏళ్ల క్రితం వచ్చిన క్లాసిక్ మూవీ "భక్త ప్రహ్లాద" తెలుగు సినిమా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. శ్రీ మహావిష్ణువు భక్తుడైన ప్రహ్లాదుని జీవితం ఆధారంగా రూపొందిన ఆ చిత్రం, అప్పట్లో అన్ని వర్గాల ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ఎస్వీ రంగారావు హిరణ్యకశిపుడిగా, అంజలీదేవి ప్రహ్లాదుని తల్లిగా, తరుణ్ మదర్ రోజారమణి ప్రహ్లాదుడిగా నటించిన ఈ చిత్రానికి చిత్రపు నారాయణమూర్తి దర్శకత్వం వహించారు. మెయ్యప్పన్ నిర్మించిన ఈ చిత్రం ప్రహ్లాదుడి కథకు సినిమాటిక్ రిఫరెన్స్‌గా నిలిచిపోయింది. అయితే, ఇప్పుడు ఆ గొప్ప కథను ఆధునిక సాంకేతికతతో, అద్భుతమైన విజువల్స్‌తో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చింది హొంబలే ఫిల్మ్స్. మహా విష్ణువు దశావతారాల ఆధారంగా పదేళ్లపాటు వరుసగా సినిమాలు చేయనున్న నేపథ్యంలో మరో నిర్మాణ సంస్థ క్లీమ్ ప్రొడక్షన్స్ తో చేతులు కలిపింది హొంబలే. మహావతార్ సినిమాటిక్ యూనివర్స్ లో భాగంగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన తొలి చిత్రం మహావతార్ నరసింహ కాగా, ఇది బాక్సాఫీస్ దగ్గర వసూళ్ల వర్షం కురిపిస్తుంది. ఈ 3%ణ% యానిమేషన్ మూవీలో మొదటి నలభై నిమిషాలు, చివరి అరగంట భారీ ఎమోషనల్ హైలైట్‌గా నిలుస్తున్నాయని ప్రేక్షకులు చెబుతున్నారు. థియేటర్లలో ఈలలు, కేకలతో సందడి మామూలుగా లేదంటూ రివ్యూస్ వెల్లువెత్తుతున్నాయి. సినిమా లోని గ్రాఫిక్స్, వీఎఫ్ఎక్స్ వర్క్ ప్రపంచ స్థాయిలో ఉందన్న ప్రశంసలు వినిపిస్తున్నాయి. పురాణాలను ఆధునిక తరం పిల్లలకు అర్థమయ్యే విధంగా చెప్పే ప్రయత్నంగా ఈ మూవీ నిలుస్తోంది. తాజాగా ఈ చిత్రాన్ని వీక్షించిన ప్రభాస్ మూవీపై ప్రశంసల జల్లు కురిపించారు. పవర్ ఫుల్ విజన్‌తో మహావతార నరసింహ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చిన హొంబలే ఫిల్మ్ కి శుభాకాంక్షలు. సినిమా చాలా బాగుంది. యాక్షన్ సన్నివేశాలు, యానిమేషన్ రూపంలో తీర్చిదిద్దిన సన్నివేశాలు అద్భుతం. దర్శకుడు అశ్విన్ కుమార్, చిత్ర బృందానికి నా అభినందనలు అని పేర్కొన్నారు. ప్రభాస్ ఈ సినిమాపై తన అభిప్రాయం వ్యక్తం చేసినందుకు హొంబలే చిత్రబృందం కృతజ్ఞతలు తెలియజేసింది.



Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com